PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 320 | విజయవాడ, మంగళవారం 25 జూన్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 25 June 2024 | Rs

భారత్ వృద్ధి 7% లోపే..!

- ఎస్‌అండ్‌పి విశ్లేషణ
- ఆర్‌బిఐ అంచనాల కంటే తక్కువ
- అధిక వడ్డీ రేట్ల ప్రభావం

3




పార్లమెంటు ఆవరణలో రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని నిరసన తెలుపుతున్న ఇండియా ఫోరం నేతలు

మాదకద్రవ్యాల నివారణకు సబ్‌కమిటీ

• వివిధ శాఖలపై ఏడు శ్వేతపత్రాలు • మంత్రివర్గ సమావేశ నిర్ణయాలు

- ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుకు ఆమోదం
- డిఎస్‌సి ద్వారా 16,347 పోస్టులు భర్తీ
- జాతీయ విద్యావిధానంపై అధ్యయనం



తొలి కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, లోకేష్ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మత్తు, మాదకద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి చేసిన ఐదు సంతకాలకు మంత్రులు ఆమోదం తెలిపారు. వివిధ శాఖల్లో ఉన్న పరిస్థితి, గత ప్రభుత్వ అక్రమాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేయాలని కూడా నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా దానివెనుక గంజాయి మూలంగా ఉంటోందని ఆయన చెప్పారు. అత్యాచారాలు, హత్యల ఘటనల్లో ఎక్కువ మంది గంజాయిని తీసుకుని ఉన్నారని గుర్తించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో గంజాయి మూలాలన్నీ మన రాష్ట్రంలోనే ఉండటంతో దీని నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. దీనిలో భాగంగా మంత్రులు వంగలపూడి అనిత, నారా లోకేష్, కొల్లు రవీంద్ర, గుమ్మడి సంధ్యా రాణి, సత్యకుమార్ యాదవ్‌లతో సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీరిచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

డిసెంబర్ 10లోపు మెగా డిఎస్‌సి పోస్టుల భర్తీ

మెగా డిఎస్‌సి నిర్వహణ నిర్ణయానికి ఆమోదం తెలిపిన మంత్రిమండలి జులై 1 నుండి ప్రక్రియను ప్రారంభించి డిసెంబర్ 10లోపు 16,347 పోస్టుల భర్తీని పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేసింది. అలాగే ప్రతి సంవత్సరం డిఎస్‌సి నిర్వహించాలని, నిబంధనలకు అనుగుణంగా టెట్ నిర్వహించాలనీ నిర్ణయించారు. టీచర్ల నియామకం ముందే శిక్షణ ఇవ్వాలని, నూతన విద్యావిధానాన్ని అధ్యయనం చేయాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం రూపొందించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు నిర్ణయాన్ని కూడా మంత్రివర్గం ఆమోదించింది. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన చట్టానికి, గత ప్రభుత్వం ఆమోదించిన చట్టానికి తీవ్ర వైరుధ్యం ఉందని కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించిన మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ఈ యాక్టులో టైట్లింగ్ ఆఫీసరు నేరుగా నిర్ణయం తీసుకునే విధంగా పేర్కొన్నారని, ఇది ప్రమాదకరమైందని, రెవెన్యూ, న్యాయవ్యవస్థలు అస్తవ్యస్తం అవుతాయని ఆయన తెలిపారు. సామాజిక పింఛన్ల పథకానికి గతంలో మాదిరి ఎన్‌టిఆర్ భరోసా పేరు పెట్టడానికి మంత్రి మండలి ఆమోదించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 28 కేటగిరీల్లో 65 లక్షల మందికి పింఛను పెంచుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సస్ -2024 నిర్వహణకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 310 ఇంజనీరింగ్ కాలేజీలు, 1440 డిగ్రీ, 267 పాలిటెక్నిక్, 516 ఐటిఐ కళాశాలల నుండి ఏటా 4.4 లక్షల మంది ఆయా కోర్సులను పూర్తి చేసుకుని బయటకు వస్తున్నారని, వారి డిమాండుకు తగిన విధంగా సదుపాయాలు కల్పించడమే దీని ఉద్దేశమని తెలిపారు. పారిశ్రామిక, వ్యవసాయ, మార్కెటింగ్, ప్రొడక్షన్ సంస్థలు వారి అవసరాలను మిగతా 2లో



(ఫైల్ ఫొటో)

వలంటీర్ల రాజీనామాలపై కౌంటర్ దాఖలు చేయండి

- ఇసి, రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెద్ద సంఖ్యలో వలంటీర్లు రాజీనామాలు చేయడంపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలపై ఇసితోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 22కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ బి కృష్ణమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలో మే 13న పోలింగ్ ముగిసే వరకు వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలను ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసేలా ఇసిని ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) అధ్యక్షులు బి రామచంద్రయాదవ్ గత ఏప్రిల్‌లో వ్యాజ్యం దాఖలు చేశారు. న్యాయవాది ఉమేష్ చంద్ర వాదనలు వినిపిస్తూ.. వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి నాటి మంత్రులు ఒత్తిడి కారణంగానే రాజీనామాలు చేయాల్సి వచ్చిందని పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. రాజీనామాలపై ప్రభుత్వ, ఇసిల వైఖరి కోరాలని అన్నారు. ఈ మేరకు ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

రాజ్యాంగంపై మోడీ దాడి

పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో ఎన్‌డిఎ సర్కారు మూడోసారి అధికారం చేపట్టిన తరువాత సోమవారం తొలి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. బిజెపి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష ఇండియా ఫోరం నేతలు పార్లమెంటు ఆవరణలో నిరసనకు దిగారు. రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని, రాజ్యాంగాన్ని కాపాడాలంటూ నినాదాలు హోరెత్తించారు. రాజ్యాంగాన్ని బిజెపి అవమానిస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. 'మోడీ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకే ఈరోజు అన్ని పార్టీల నేతలు ఒక్కతాటిపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. బిజెపి నేతలు గాంధీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని బద్దలు కొడుతున్నారు. మనం రాజ్యాంగం ప్రకారం ముందుకెళ్లాలి. మోడీ.. ఎమర్జెన్సీ గురించి 100 సార్లు చెబుతారు. ఎమర్జెన్సీ విధించకుండానే ఆయన ప్రజల హక్కులను కాలరాస్తున్నారు. ఇలా ఇంకెంతకాలం పాలించాలనుకున్నారు' అని ప్రశ్నించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వివిధ పార్టీల నేతలు, ఎంపిలు పాల్గొన్నారు. అనంతరం వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. ఆ రాజీనామాను ప్రొటెం స్పీకరు భర్తృహరి మెహతాబ్ ఆమోదించారు.

దేశ రాజ్యాంగంపై ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా దాడికి పాల్పడుతున్నట్లు లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. జవాబివ్వకుండా ప్రధానిని ప్రతిపక్షాలు తప్పించుకోనివ్వవని ఆయన అన్నారు. పార్లమెంటు ఆవరణలో రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగంపై దాడిని ఆమోదించబోమన్నారు. రాజ్యాంగం పుస్తక కాపీలను చేతుల్లో పట్టుకున్న ఇండియా వేదిక నేతలు మార్చ్ చేసి ఇచ్చిన సందేశం ప్రజలకు చేరుతోందని, భారత రాజ్యాంగాన్ని ఏ శక్తి కూడా తాకలేదని, దాన్ని తాము పరిరక్షించనున్నట్లు పేర్కొన్నారు.

స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు ప్రతిపక్షం పోటీ

లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు పోటీ చేస్తామని ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చందన్ పేర్కొన్నారు. స్పీకరు, డిప్యూటీ స్పీకరు పదవులపై ప్రతిపక్షాల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకునేందుకు ముందుకొస్తే తాము పోటీపై పునరాలోచిస్తామని చెప్పారు. ప్రభుత్వం మొండివైఖరితో వెళ్తే తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఎమర్జెన్సీపై ప్రధాని మోడీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ గత పదేళ్లలో మోడీ పాలనలో రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాజ్యాంగ మార్పుకు కాషాయ పాలకులు గట్టి ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహించారు. రాజ్యాంగ మార్పులను ప్రతిపక్షం ఐక్యంగా ఎదుర్కొని నిలువరిస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు తాము కలిసికట్టుగా పోరాడతామని తెలిపారు. దేశ లౌకిక ప్రజాస్వామ్య స్ఫూర్తిని రక్షించాల్సిన అవసరం ఉందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలు, సిద్ధాంతాలను పరిరక్షించుకోవాలన్నారు.

ప్రధాని, కేంద్ర విద్యామంత్రికి నిరసన సెగ

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు నిరసన సెగ తగిలింది. సోమవారం లోక్‌సభలో ప్రధాని మోడీ ఎంపిగా ప్రమాణం చేసేందుకు సీటులో నుంచి వెళ్తుండగా ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లో లేచి, రాజ్యాంగ ప్రతులను చూపించి నిరసన తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎంపిగా ప్రమాణం చేసేందుకు సీటులో నుంచి వెళ్తుండగా ప్రతిపక్ష ఎంపిలు నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో సభను హోరెత్తించారు. 'నీట్.. నీట్.. నీట్..' అంటూ నినదించారు. ప్రతిపక్షాల నినాదాల మధ్యే మిగతా 7లో

ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా బడ్జెట్ ఉండాలి

- సామాజిక భద్రతా నిధి
- కేంద్ర సంస్థల్లో ఖాళీల భర్తీ
- స్వామినాథన్ సిఫార్సుల మేరకు ఎంఎస్‌పి
- కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్
- ఆర్థికమంత్రికి సంయుక్తంగా లేఖ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను రూపొందించే సమయంలో కచ్చితంగా పరిగణించాల్సిన కొన్ని అంశాలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకువస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్‌ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి, రంగాలవారీగా ఫెడరేషన్‌లు, అసోసియేషన్లు సంయుక్తంగా ఒక లేఖను రాశాయి.

సంపద సృష్టికర్తలకు ప్రతినిధులుగా ఈ దేశ కార్మిక లోకం ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై గౌరవం, విశ్వాసంతో బడ్జెట్‌కు ముందస్తుగా జరిగే చర్చల్లో పాల్గొంటున్నా కార్మిక సంఘాలు చేసే ఏ ఒక్క సూచనను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని అందుకే ఈ లేఖ రాయాల్సి వచ్చిందని సంఘాల ప్రతినిధులు ఆ లేఖలో పేర్కొన్నారు.

అత్యున్నత త్రైపాక్షిక వేదిక అయిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి) సమావేశం ఏర్పాటు చేసి దాదాపు దశాబ్ద కాలం గడుస్తోంది. గత ఐఎల్‌సిల సిఫార్సులను అమలు చేయాలని కోరినా ఇంతవరకు దాన్ని పట్టించుకోలేదన్నారు. కేంద్ర కార్మిక సంఘాల సూచనలు, సిఫార్సులు, డిమండ్లు అన్ని విస్మరించడమే కాకుండా అన్ని త్రైపాక్షిక, ద్వైపాక్షిక ప్రజాస్వామ్య యంత్రాంగాలను, సంస్థలను కూడా పట్టించుకోకుండా పక్కనబెట్టేసి విధానాలను రూపొందిస్తున్నారని ఆ లేఖ పేర్కొంది. ఇందుకు తాజా ఉదాహరణగా కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రచురించిన నోటిఫికేషన్‌ను పేర్కొంది. ఇపిఎఫ్ చెల్లించని యజమానులకు విధించే మిగతా 7లో

అమరావతి పనులు మళ్లీ ప్రారంభించండి

- ఎల్ అండ్ టి ప్రతినిధులను కోరిన సిఎం
- బిల్లులు జాప్యం చేయవద్దని కోరిన కంపెనీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో ఆగిపోయిన పనులను మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎల్‌అండ్‌టి ప్రతినిధులను కోరారు. ఎల్ అండ్‌టి సంస్థ గతంలో రాజధాని ప్రాంతంలో కొన్ని పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. రాజధానిలో కీలకమైన అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ పనులను ఎల్‌అండ్‌టి చేపట్టింది. మరికొన్ని కీలక పనులను షాపూర్‌జీ, పల్లోంజి, ఎన్‌సిసి, మేఘా సంస్థలు కూడా చేశాయి. రాజధాని నిర్మాణాన్ని ప్రాధాన్యతగా తీసుకున్న నేపథ్యంలో గతంలో పనులు నిర్వహించిన సంస్థలతో ఒక్కోరోజు ఒక్కో సంస్థతో సమావేశం కావాలని చంద్రబాబు నిర్ణయించారు. దీనిలో భాగంగా తొలిరోజైన శుక్రవారం ఎల్‌అండ్‌టి సంస్థ ప్రతినిధులతో సమావేశమైన ఆయన గతంలో వారు చెపట్టిన పనులు, ఎంతవరకూ పూర్తయ్యాయి. మరలా పనులు చేపట్టాలంటే ప్రభు త్వం చేయాల్సిం దేమిటి తదితర అంశాలపై వారితో మాట్లాడారు. బిల్లుల పెండింగ్ వంటివి ఏమైనా ఉన్నాయా ఉంటే వాటిస్థితి ఏమిటి, గత ఐదేళ్లలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు తదితర అంశాలను వారితో చర్చించారు. దీనిపై స్పందించిన ఎల్‌అండ్‌టి సంస్థ ప్రతినిధులు తమకు గతంలో కొంత నిధులు పెండింగ్ ఉన్నాయని, కొన్ని యంత్రాలు వదిలేశామని, కొంత నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం తామేమీ చేయాలని మీరు కోరుకుంటున్నారో చెప్పాలని అడిగారు దీనిపై వారు మాట్లాడుతూ పనులు చేయడానికి అభ్యంతరం లేదని, కానీ బిల్లులు వెంటనే వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని, ఇతర అంశాలపై అధికారులతో చర్చించి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తానని చెప్పినట్లు తెలిసింది. ఎల్‌అండ్‌టి సంస్థ అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఎజిసి)తోపాటు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాన్ని చేపట్టింది. వీటిల్లో ఉద్యోగుల నివాసాలు దాదాపు పూర్తయ్యేదశలో ఉండగా వైసిపి ప్రభుత్వం పనులు నిలిపేసింది.



(ఫైల్)

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆందోళనలు
- అధికారులకు వినతులు

సమస్యలు పరిష్కరించండి

- మంత్రులకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విజ్ఞప్తి

తక్షణమే జోక్యం చేసుకోలేం

- కేజ్రీవాల్ బెయిల్ స్టేపై సుప్రీం

లోపలి పేజీలో..

కృష్ణా జలాశయాలు వెలవెల!

- 25 లక్షల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం
- పొంచి ఉన్న తాగునీటి సమస్య



నీరు లేక వెలవెలబోతున్న నాగార్జునసాగర్ జలాశయం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా నది పరివాహక ప్రాంతంలో నీటి నిల్వలు లేక ప్రధాన జలాశయాలన్నీ వెలవెలబోతున్నాయి. ఆల్మట్టి నుంచి పులిచింతల వరకు కనీస నీటి నిల్వలు లేకపోవడంతో నాగార్జునసాగర్ ఆయకట్టులో 11.26 లక్షల ఎకరాల్లో, కృష్ణా డెల్టా పరిధిలో 13.74 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంగా ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఎప్పటికి ప్రారంభం అవుతుందనేది చర్చనీయాంశమైంది. గత తొమ్మిది నెలలుగా సరైన వర్షాలు లేక కృష్ణా పరివాహక ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడింది. ఆల్మట్టి నుంచి వరద ప్రవాహం లేకపోవడంతో గతేడాది సాగు అంతంత మాత్రంగా సాగింది. ఈ ఏడాది వేసవిలో కురుస్తున్న ఆకాల వర్షాలతో నీటి ఎద్దడి నుంచి తాత్కాలిక ఉపశమనం ఉన్నా సమస్య తీవ్రత ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు పూర్తిగా కనీస స్థాయికి పడిపోయాయి. నారాయణపూర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 37.64 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 25.06 టిఎంసిలే ఉన్నాయి. ఎగువ నుంచి కేవలం 232 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. దిగువకు నీరు విడుదల లేదు. ఆల్మట్టి గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 129.72 కాగా, ప్రస్తుతం 60 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. జూరాలలో గరిష్ట నీటి నిల్వ 9.65 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 8.43 టిఎంసిలే ఉన్నాయి. దిగువకు 2,750 క్యూసెక్కులను తెలంగాణ జిల్లాల్లోని కాలువలకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.80 టిఎంసిలు కాగా, సోమవారం సాయంత్రం ఆరు గంటలకు 37.40 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. శ్రీశైలం నుంచి దిగువకు నీటి విడుదల లేదు. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 122.19 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. దిగువకు నీరు విడుదల చేయడం లేదు. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసిలు కాగా, 0.39 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. పులచింతల నుంచి నీటి విడుదల లేకపోవడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి నిల్వ 3.50 టిఎంసిల నుంచి 2.30 టిఎంసిలకు పడిపోయింది. ప్రకాశం బ్యారేజీ నుంచి మిగతా 2లో

'కేరళం'గా మార్చండి

- కేరళ పేరు మార్పు తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం

తిరువనంతపురం : కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చేందుకు, ఈ పేరు మార్పుకు అవసరమైన రాజ్యాంగ సవరణను ప్రతిపాదిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని సోమవారం ఆమోదించింది. సిఎం పినరయి విజయన్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఫస్ట్ షెడ్యూల్‌లో ఈ పేరు మార్పును అమల్లోకి తెచ్చేందుకు రాజ్యాంగంలోని 3వ అధికరణను అమలు చేయాలని తీర్మానం పిలుపునిచ్చింది. గతేడాది కూడా ఇదే రీతిలో రాష్ట్రప్రభుత్వం తీర్మా నాన్ని పంపింది. కానీ అందుకు అనుసరించిన తీరు సరిగా లేదనే కారణంతో కేంద్రం వెనక్కి పంపింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లోనూ కేరళ పేరును సవరిం చాలని తొలుత రాష్ట్రం కోరింది. కేంద్ర హోం శాఖ సూచనల మేరకు, ఫస్ట్ షెడ్యూల్‌లో సవరణపైనే దృష్టి కేంద్రీకరించింది. 2023 ఆగస్టు 9న అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని సవరించడానికి ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. 'కేరళం' రాష్ట్రానికి సంబంధించిన మలయాళం పేరు. అధికారిక పేరును మలయాళం ఉచ్ఛారణ తో సమంచేయడానికి ఉద్దేశించిందే ఈ తీర్మానం.

గర్భగుడిలోకి వర్షపు నీరు

- అయోధ్యలో రామ మందిరం పరిస్థితి
- పై కప్పు నుండి లీకవుతోందన్న ప్రధాన పూజారి



అయోధ్య: వానొస్తే అయోధ్యలో రామ మందిరం చిత్తడి చిత్తడిగా తయారవుతోంది. ఇటీవల కురిసిన ఒక మోస్తరు వర్షానికే పై కప్పు నుండి వర్షపు నీరు లీక్ కావడం ప్రారంభించిందని ఆలయ ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఆలయ పై భాగాన్ని సరిగ్గా నిర్మించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. నిర్మాణ దశలో ఉన్న సమస్యలేంటో గుర్తించి ఒకట్రెండు రోజుల్లా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దీనిని సత్వరమే పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో గర్భ గుడిలో పూజలు చేయడం కూడా కష్టమవుతుందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయం ప్రారంభించి నాలుగు నెలలు కూడా తిరగక ముందే లీకేజీలు ఏర్పడడం తీవ్ర అలయ నిర్మాణంలో బిజెపి అవినీతి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి కాకున్నా హడావుడిగా జనవరి 22న ప్రారంభించారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం తన ప్రభుత్వ ఘనతగా ఎన్నికల్లో ప్రచారం చేసుకున్నారు. అయినా, అయోధ్యకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బిజెపి ఓటమి పాలైంది. వర్షా కాలం రావడంతో ఆలయ నిర్మాణంలో లోపాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. మొదటి వర్షానికే గర్భగుడిలో పైకప్పు నుంచి నీరు కారడం ప్రారంభించింది. పైకప్పు నుండి నీటిని బయటకు తీయడానికి సరైన మార్గం కూడా లేదని పూజారి చెప్పారు. ఆలయ పూజారి చేసిన ఫిర్యాదుపై రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన నృపేంద్ర మిశ్రా స్పందిస్తూ డిజైన్ లేదా నిర్మాణ సమస్య ఏమీ లేదని అన్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం బిజెపి అవినీతికి మరో ఉదాహరణ అని కాంగ్రెస్ విమర్శించింది. అది అమరవీరుల శవ పేటిక కావచ్చు, దేవుడి గుడి కావచ్చు కాదేదీ విజెపి అవినీతికి అనర్హం అన్నట్లుగా పరిస్థితి తయారైందని యుపి కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ వ్యాఖ్యానించారు.

26 నుంచి ఇ-సెట్ కౌన్సెలింగు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇ-సెట్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ జూన్ 26 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను అడ్మిషన్ల కన్వీనరు నవ్య సోమవారం విడుదల చేశారు.

ప్రోసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ జూన్ 26 నుంచి 30వ తేదీ వరకు అభ్యర్థులకు అవకాశం ఉంది. సర్టిఫికెట్ల అప్‌లోడ్ 27 నుంచి జులై 3వ తేదీ వరకు ఉంటుంది. జులై 1 నుంచి 4వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు, 5 నుంచి ఆప్షన్ల మార్పు చేసుకునే అవకాశం ఉంది. సీట్ల కేటాయింపు జులై 8న ఉంటుంది. జులై 9 నుంచి 15 వరకు విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయాలి. జులై 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. వ్యవసాయ డిప్లమో అభ్యర్థులకు తదుపరి దశ కౌన్సెలింగ్‌లో సీట్ల భర్తీ ఉంటుంది. ఫార్మసీ అభ్యర్థులకు ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేస్తామని కన్వీనరు నవ్య వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

డిజిటల్ కార్పొరేషన్ పేరుతో జగన్ దోపిడీ

- టిడిపి అధికార ప్రతినిధి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి సోషల్‌మీడియా కోసం డిజిటల్ కార్పొరేషన్‌ను ఉద్యోగ పునరావాస కేంద్రంగా మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్ వాడుకున్నారని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అస్మదీయులకు ఉద్యోగాలు కట్టబెట్టి, అక్రమంగా యాడ్‌లు ఇచ్చి కోట్ల రూపాయల ప్రజాధనం కొల్లగొట్టారని ఆరోపించారు. డిజిటల్ కార్పొరేషన్‌ను అస్తవ్యస్తంగా తయారు చేసి దోచుకున్నారని అన్నారు. పల్లెల్లో డిజిటల్ లైబ్రరీలను డిజిటల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కానీ అది ఎక్కడా జరగలేదన్నారు. ఐడ్రీమ్ అనే యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహించే వ్యక్తికి డిజిటల్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టారని విమర్శించారు. ప్రభుత్వం మారిన వెంటనే సగం మంది రాజీనామా చేసి వెళ్లిపోయారని తెలిపారు. డిజిటల్ లైబ్రరీలకు కేటాయించిన రూ.750కోట్లు ఏమయ్యాయో తెలియదని పేర్కొన్నారు. ఇందులో పనిచేసే వారంతా సాక్షి సోషల్ మీడియాలో పనిచేసేవారేనని ఆరోపించారు. ఈ దోపిడీకి సహకరించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా వుండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ నుంచి సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్యశాఖ అధికారులు డిఎంహెచ్‌ఒలు, డిసిహెచ్‌ఎస్‌లు, జిజిహెచ్‌ల సూపరింటెండెంట్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. డయేరియా ప్రబలిన తర్వాత చేపట్టే చర్యల కంటే ముందస్తు చర్యల వల్ల ప్రాణాల్ని కాపాడినవారవుతారని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వైద్యారోగ్యశాఖను ప్రక్షాళన చేసే దిశగా మున్ముందు చర్యలుంటాయన్నారు. త్వరలో జిల్లాల్లో పర్యటించి ఆస్పత్రుల పనితీరును పరిశీలిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, ఆరోగ్యశ్రీ సిఇఒ లక్ష్మీశా, డిఎంఇ నరసింహం, డిహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాశయాలు వెలవెల!

(మొదటి పేజి తరువాయి)

13.74 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించాల్సి ఉండగా, నీరు లేకపోవడంతో అధికారులు, రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. పులిచింతలలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది.నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో వరి సాగుకు గతేడాది కూడా అనుమతి ఇవ్వలేదు. ఈ ఏడాది ఇస్తారో? లేదో? తెలియడం లేదు. ఆరుతడి పంటలు వేసేందుకు కూడా రైతులు వెనుకంజ వేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు మందగించడంతో ఈ ఐదు జిల్లాల్లో వర్షాలు ముఖం చాటేశాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినా కాలువల్లో నీరు లేక సాగుపై రైతులు దృష్టి సారించలేకపోతున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు బాగా తక్కువగా ఉండడంతో ఖరీఫ్ సాగు ఎప్పటికి ప్రారంభం అవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

విద్యా ప్రమాణాల మెరుగుకు సహకరించండి

- బాధ్యతలు స్వీకరించిన మంత్రి లోకేష్
- మెగా డిఎస్‌సి విధి విధానాలపై తొలి సంతకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్

విద్యారంగంలో ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సహకరించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. సచివాలయంలో సోమవారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన మెగా డిఎస్‌సి విధి విధానాలకు సంబంధించిన ఫైల్‌పై లోకేష్ తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా లోకేష్‌ను పలు విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వీటిని లోకేష్ స్వీకరించి వారితో చర్చించారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. మళ్లీ విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు ఉపాధ్యాయులంతా సహకరించాలని కోరారు. గతంలో మాదిరిగానే ఉపాధ్యాయులపై అనవసరమైన పనిభారం, వేధింపులు ఉండవని అన్నారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, ఎస్ సవిత, టిజి భరత్, మాజీ ఎంపి గల్లా జయదేవ్, ఎమ్మెల్సీలు చిరంజీవి, శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, పి అశోక్ బాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీలు వైవిబి రాజేంద్రప్రసాద్, ఎఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లోకేష్‌కు పలు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు వినతులను అందించారు. ఎపిపిఎస్‌సి పోస్టుల భర్తీ సమయంలో కాంట్రాక్టు లెక్చరర్ల పోస్టులను మినహాయించి నోటిఫికేషన్ ఇవ్వాలని ఎపి రాష్ట్ర పాలిటెక్నిక్ ఆల్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ కార్యదర్శి బి కృష్ణ, ఉపాధ్యక్షులు పి సాయిరాజు, వ్యవస్థాపక కార్యదర్శి ఎం దుర్గామల్లేశ్వరి, మహిళా కార్యదర్శి ఆర్ స్వాతి కోరారు. పాఠశాల విద్యాశాఖలో జిఓ 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాశ్‌రావు, సహాధ్యక్షులు ఎంజి మెహది, బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి మనోజ్‌కుమార్, సిహెచ్ రమేష్, రాజేష్ విడివిడిగా వినతిపత్రం అందజేశారు.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేయాలి

- ఎపిపిఎస్‌సిని కోరిన టిడిపి పట్టభద్ర ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీలు

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి)ను టిడిపి పట్టభద్ర ఎమ్మెల్సీలు కోరారు. కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్ కుమార్‌ను ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, రామ్‌గోపాల్ రెడ్డి సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు గత ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా ఎన్నికలు వస్తున్నాయనే నెపంతో హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు.

పరీక్ష నిర్వహించిన 45 రోజుల తరువాత ఫలితాలను విడుదల చేసి జులైలో మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించిందని వివరించారు. గ్రూప్-2 మెయిన్ సిలబస్‌లో తీసుకొచ్చిన కొత్త సబ్జెక్టు సైన్స్ అండ్ టెక్నాలజీకి తెలుగులో సరైన ప్రామాణిక పుస్తకాలు లేవని తెలిపారు. తక్కువ వ్యవధిలో గ్రామీణ యువత నేర్చుకోవడానికి వీలుకాకపోవడం వంటివి జరిగాయని వివరించారు. కావున వేలాది మంది నిరుద్యోగ యువత గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతున్నారని తెలిపారు. 2 నుంచి 3 నెలల వరకు సమయం ఇవ్వాలని కోరారు. ఉప విద్యాశాఖ పోస్టుల భర్తీ కోసం జరిగిన పరీక్షలో మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. గ్రూప్-1 ఫలితాల ప్రకటన సమయంలో మెరిట్ లిస్టును ఎపిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. కేంద్రంలో యుపిఎస్‌సి ప్రకటిస్తున్నట్లు రాష్ట్రంలో కూడా ఎపిపిఎస్‌సి జాబ్ క్యాలెండర్‌ను అమలుపరచాలని, గ్రూప్-1 ఇంటర్వ్యూలను పారదర్శకంగా నిర్వహించాలని, ఇంటర్వ్యూల మార్కుల్లో వ్యత్యాసాలు ఉండకూడదని కోరారు.

పలువురి రాజీనామాలు ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వంలో ఉద్యోగ విరమణ తరువాత పలు శాఖల్లో నియమితులైన పలువురు అధికారుల రాజీనామాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. న్యాయశాఖ కార్యదర్శి సత్యప్రభాకర్‌రావు, అమరావతి విజిలెన్స్ కమిషనర్ వీణా ఇష్, పట్టణాభివృద్ధిశాఖ అదనపు కార్యదర్శి ఎం ప్రతాప్ రెడ్డి, కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ వెంకటరమణారెడ్డి, అదనపు డైరెక్టర్ సుధాకర్ రాజీనామాలను ఆమోదిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జులై మూడో వారంలో బడ్జెట్ సమావేశాలు !

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ బడ్జెట్ సమావేశాలు జులై మూడో వారంలో నిర్వహించే అవకాశం వుంది. ఆగస్టు నుంచి మార్చి ఆఖరు వరకు అవసరమైన బడ్జెట్ ఆమోదం కోసం ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. మరోవైపు ఎన్‌డిఎ కూటమి తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించనుంది. శాసనసభ సమావేశాల్లో సూపర్ సిక్స్‌కు సంబంధించిన బిల్లుల్ని శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అందోళనలు
- అధికారులకు వినతులు

ప్రజాశక్తి- యంత్రాంగం



పశ్చిమగోదావరి జిల్లా విస్సాకోడేరులో రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ధర్నా

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆందోళనలు జరిగాయి. ప్రజాదర్బారుల్లో అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ధాన్యం బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లాలో పాలకోడేరు మండలం విస్సాకోడేరులోని గ్రామ సచివాలయం వద్ద ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు సిపిఎం మద్దతు తెలిపింది. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో రూ.800 కోట్లకుపైగా ధాన్యం బకాయిలు నెలల తరబడి పేరుకుపోయాయన్నారు. కరెంటు ఛార్జీలు ఆలస్యమైతే ప్రభుత్వం వడ్డీతో సహా ముక్కుపిండి వసూలు చేస్తోందని, రైతులకు చెల్లించాల్సిన బకాయిలకు మాత్రం అతీగతీ లేదని విమర్శించారు. వడ్డీతో సహా ధాన్యం బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై నరసాపురంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఎపి కౌలు రైతు సంఘం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు ధర్నా చేశారు. దీనిపై ఆర్‌డిఒ స్పందించి జిల్లా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడారు. వారం రోజుల్లో ధాన్యం బకాయిలు చెల్లిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వీరవాసరంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, దుక్కులు తదితర అవసరాల కోసం ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన విజయనగరం కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే స్పందించి సాయమందించాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. తాటిపూడి ప్రాజెక్ట్ కాలువలు పూడికలు తీయాలని, డామ్ వద్ద పాడైన షట్టర్లును బాగు చేయాలని, పొలాలకు నీరు సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు పెట్టుబడి సాయం అందించాలని కోరులూ సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు అనంతపురం జిల్లా వ్యాప్తంగా అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతపురం, తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో అధికారులను కలిసి తమ సమస్యలను వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు. మామిడి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం చిత్తూరు కలెక్టర్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు వినతిపత్రం అందజేశారు. వ్యాపారులు, మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాల వైఖరి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ వినతిపత్రంలో వివరించారు. తోతాపూరి మామిడికి టన్నుకు రూ.30 వేల ధరను జిల్లా కలెక్టర్ నిర్ణయించినా, వ్యాపారులు రూ.23 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు.

శ్రీకాకుళం జిల్లాలోని సాగునీటి కాలువలు, షట్టర్లు, మదుములకు మరమ్మతులు చేపట్టి సాగు నీరు అందించాలని కోరుతూ ఆ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పి.చంద్రరావు, కె.మోహనరావు కోరారు. జడ్‌పిలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ఈ మేరకు జెసికి వినతిపత్రం అందజేశారు. జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని కోరారు. రైతులకు అవసరమైన విత్తనాలను పూర్తి స్థాయిలో అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకుల ద్వారా రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు సబ్‌కమిటీ

(మొదటి పేజి తరువాయి)


మంత్రి పార్థసారథి

దృష్టిలో పెట్టుకుని వాటి అవసరాలకు అనుగుణంగా మూడు నుండి నాలుగు నెలల వ్యవధిలో ఇంటింటికీ తిరిగి సర్వే పూర్తి చేయనున్నారు.

ఆగస్టు నుండి 183 అన్న క్యాంటీన్లు

గతంలో రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు ఉండేవని గత ప్రభుత్వం వాటిని మూసివేయడంతో తాజాగా పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. తొలిదశలో 183 అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు.ఆగస్టు నుండి ఈ క్యాంటీన్లను ప్రారంభిస్తామని, ఐదు రూపాయలకే పేదలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తామని చెప్పారు. దీనికోసం ఆహారాన్ని సరఫరా చేసే సంస్థలను టెండర్ల పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును గతంలో ఉన్న విధంగా డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయంగా పేరు మార్చే ప్రతిపాదనకూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రస్తుత ఎజి శ్రీరామ్, అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చేసిన రాజీనామాలను క్యాబినెట్ ఆమోదించింది. కొత్త ఎజిగా దమ్మాలపాటి శ్రీనివాస్ నియామకాన్ని ఆమోదించింది. గత టిడిపి ప్రభుత్వంలోనూ దమ్మాలపాటి ఎజిగా పనిచేశారు.

28 నుండి శ్వేతపత్రాలు

పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం (ల్యాండ్, శాండ్, మైన్స్, జియాలజీ), లిక్కర్ అండ్ ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ ఆర్థికశాఖలపై శ్వేత పత్రాలను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈనెల 28 నుండి జులై 18 వరకూ రెండు మూడు రోజులకు ఒకటి చొప్పున శ్వేతపత్రాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు. పంచాయతీలు, మున్సిపాలిటీలోల పారిశుధ్య పనులు వెంటనే ప్రారంభించాలని, కాల్వలు, చెరువుల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని చర్యలూ తీసుకోవాలని, అధ్వానంగా తయారైన రోడ్లను బాగుచేయాలని, పాట్‌హోల్స్‌ను వెంటనే పూడ్చాలని నిర్ణయించారు.

పటిష్టంగా 'ఉచిత విద్యుత్' అమలు

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతు సాధికారతకు దోహదపడే ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరా పథకాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇంధనశాఖపై సచివాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఉచిత విద్యుత్ పథకాన్ని పటిష్టం చేసేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. దెబ్బతిన్న పాతలైన్లు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు వంటి వాటిని వెంటనే పునరుద్ధరించాలని చెప్పారు. గిరిజన ప్రాంతాలకు 100 శాతం విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ లైన్లు వేయడం సాధ్యం కాని గిరిజన ఆవాసాలకు సోలార్ విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, ఇంధనశాఖ డిప్యూటీ సెక్రటరీ బిఎవిపి కుమార్ రెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్ ఎవికె భాస్కర్, ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఐ పథ్వితేజ్, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో దారుణ హత్య


ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. వైఎంఆర్ కాలనీకి చెందిన మహేశ్వరరెడ్డి (23) తన అమ్మ నాగరత్నమ్మతో కలిసి నివసిస్తున్నారు. నాగరత్నమ్మతో రామచంద్రారెడ్డి సహజీవనం చేస్తున్నాడు. అందరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. సోమవారం తెల్లవారుజామున గోనె సంచిలో రామచంద్రారెడ్డి ఏదో తీసుకుని వెళ్తూ కనిపించడంతో నాగరత్నమ్మ ప్రశ్నించారు. పాత సామాన్లు తీసుకువెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తపు మడుగులు ఉండడంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. డబ్బుల కోసమే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మహేశ్వరరెడ్డి శరీరాన్ని రెండు మూడు ముక్కలుగా చేసి ప్రొద్దుటూరు శివారు ప్రాంతంలో వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి మురళీధర్ తెలిపారు.

త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

- అక్రమార్కులకు పార్టీలోకి ప్రవేశం లేదు : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అహర్నిశలూ కష్టపడి కూటమి విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొని పోరాడిన వారికి తప్పకుండా ఈ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. టిడిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు, పార్లమెంటు అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా చంద్రబాబు సోమవారం మాట్లాడారు. కష్టపడ్డవారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. పార్టీ నేతలు ఇచ్చే నివేదికలతోపాటు, ఇతర మార్గాల్లో కూడా నివేదికలు తెప్పించుకుని కష్టపడిన వారికే పదవులు వచ్చేలా చేస్తామన్నారు. ప్రతిపక్షంలో నిర్వహించిన బాదుడే బాదుడు, ఇదేం కర్మ మన రాష్ట్రానికి, యువగళం, రా.. కదలిరా, ప్రజాగళం వంటి కార్యక్రమాలతో ప్రజలతోనే ఉన్నామని వివరించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని పార్టీకి, కార్యకర్తలకు నష్టం చేసి వేధించిన వైసిపి నేతలకు టిడిపిలోకి ప్రవేశం లేదన్నారు. పొత్తులో భాగంగా 31 మందికి సీట్లు రాలేదని, అయినా గెలుపే లక్ష్యంగా వారు పనిచేశారని చెప్పారు. తాను కూడా ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళ్లి కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నానని గుర్తుచేశారు. 2029 ఎన్నికల్లో విజయానికి కూడా ఇప్పటి నుంచే ప్రణాళిక ఉండాలని చెప్పారు. గత ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పెన్షన్లు ఇవ్వడం అసాధ్యమని చెప్పిందని తెలిపారు. సాధ్యమవుతుందని చెప్పడానికే సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేపట్టబోతున్నామని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం ఫేజ్-1లో 183 అన్న క్యాంటీన్లను రాష్ట్రంలో పున:ప్రారంభించబోతున్నామని చెప్పారు. పల్లా శ్రీనివాసరావు గాజువాకలో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచారని, రాష్ట్ర చరిత్రలో ఇంత మెజార్టీ ఎప్పుడూ రాలేదన్నారు. బిసి తరగతికి చెందిన పల్లాను పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, అయ్యన్నపాత్రుడుకు స్పీకరు పదవి ఇచ్చామని తెలిపారు. మంత్రివర్గ కూర్పులోనూ సామాజిక సమతూకం పాటించామన్నారు.

గనులు, ఎక్సైజ్‌శాఖలను ప్రక్షాళన చేస్తాం

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో గత ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన గనులు, ఎక్సైజ్ శాఖలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి గాడిలో పెడతామని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని మూడో బ్లాక్‌లో ఆయన రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖల మంత్రిగా కొల్లు రవీంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నూతన ఎక్సైజ్ విధానాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. అలాగే ఇసుక అక్రమ రవాణాను నియంత్రించి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరాను సులభతరం చేస్తామన్నారు. అత్యంత కీలకమైన గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖలు తనకు కేటాయించడం పట్ల సిఎం చంద్రబాబుకు మంత్రి కొల్లు రవీంద్ర కృతజ్ఞతలు తెలిపారు. పదవీ బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో 2022 నుంచి పెండింగ్‌లో వున్న ఒఎన్‌జిసి పెట్రోలియం మైనింగ్ లీజు పునరుద్ధరణ ఫైల్‌పై మంత్రి మొదటి సంతకం చేశారు. అనంతరం ఆయనకు సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, మైన్స్ డైరెక్టరు ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్‌శాఖ కమిషనరు వివేక్ యాదవ్, డైరెక్టరు చేతన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

1నుంచి రేషన్ కార్డుపై రాగులు

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా జూలై 1 నుంచి ఒక్కో రేషన్ కార్డుకు బియ్యానికి బదులుగా గరిష్టంగా 3 కిలోల రాగులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. జూన్ నెల వరకు రాయలసీమ 8 జిల్లాల్లో మాత్రమే రాగులను ప్రజా పంపిణీ కింద పంపిణీ చేసినట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమలోని ఐదు జిల్లాల్లో పంపిణీ చేస్తున్న జొన్నలను జూలై నుంచి మిగిలిన రాయలసీమలోని శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాగులు/జొన్నలు తీసుకోవాలా వద్దా అనేది కార్డుదారుని ఇష్టమేనని కమిషనరు తెలిపారు.

తూకాల్లో తేడాలపై 189 కేసులు నమోదు :

లీగల్ మెట్రాలజీ శాఖ ఈనెల 16నుంచి 22వరకు రాష్ట్ర వ్యాప్తంగా 251 ఎంఎల్‌ఎస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. చక్కెర, కందిపప్పు, పామోలిన్ ఆయిల్ ప్యాకెట్లలో నికర పరిమాణంలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో తేడాలు గుర్తించి లీగల్ మెట్రాలజీ శాఖ 189 కేసులు నమోదు చేసిందని, వాటిలో 110 కేసులు చక్కెర, 74 కేసులు కందిపప్పు, 4 పామోలిన్‌పై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. తనిఖీల సమయంలో కొంతమంది సరఫరా దారులు నికర పరిమాణంలో 10శాతం తక్కువగా ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. లీగల్ మెట్రాలజీ శాఖ అన్ని ఏజెన్సీలకు లీగల్ మెట్రాలజీ చట్టం 2009 కింద నో టీసులను జారీచేయడంతో పాటు నిబంధనలను ఉల్లంఘించినందుకసీ సరఫరాదారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఫోరం, ఎపి విద్యార్థి జెఎసి ఫిర్యాదు చేశాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఇరు సంఘాల అధ్యక్షులు బి శ్రీరాములు, అయ్యాస్వామి సచివాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థులు చెల్లించిన ఫీజులను విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపయోగించకుండా ఎంఒయుల పేరుతో చీకటి ఒప్పందాలు చేసుకుని రూ.కోట్లు కొల్లగొట్టారని వివరించారు. మండలి నిధులను దుర్వినియోగం చేశారని తెలిపారు. వివిధ యూనివర్సిటీలకు తన బినామీలను ఉపకులపతులు, రిజిస్ట్రార్లుగా నియమించుకున్నారని పేర్కొన్నారు. ఆయా యూనివర్సిటీల్లో కోట్ల రూపాయలు దిగమింగారని అన్నారు. ఐప్యాక్, వైసిపి కార్యకర్తలకు అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాస్తులు, విద్యార్థులను వేధించి వారి జీవితాలతో చెలగాటమాడారని తెలిపారు. విద్యార్థులు కట్టిన రూ.200 కోట్ల ఫీజులను మాయం చేసి అనంతపురం, మద్రాసు, కడప, హైదరాబాద్, బెంగళూరు, వైజాగ్ ప్రాంతాల్లో అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఫీజులను మాయం చేసిన హేమచంద్రారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీల్లో జరిగే అవినీతి, అక్రమాలను అరికట్టి, ప్రక్షాళన చేసి పేదలకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని కోరారు. అనుభవం ఉన్నవారినే యూనివర్సిటీలకు ఉపకులపతులుగా, రిజిస్ట్రార్లుగా నియమించాలని కోరారు.

ఎస్ఐపై అధికార పార్టీ కార్యకర్తల దాడి

ప్రజాశక్తి- గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా)

ఎస్ఐపై అధికార పార్టీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. గుర్రంకొండ మండలం అల్లేపల్లికి చెందిన బి.రమణ స్థలంలోని ముళ్ల కంచెను కొంత మంది అధికార పార్టీ కార్యకర్తలు తొలగించారు. ఈ కంచెను రమణకు సంబంధించిన వ్యక్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. దీంతో వారిపై టిడిపి కార్యకర్తలు దాడి చేశారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకునేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడే రెండు గ్రూపుల వారు మరోసారి గొడవపడ్డారు. స్టేషన్‌లో గొడవ పడొద్దని చెప్పడంతో ఎస్ఐ శ్రీనివాస నాయక్‌పై టిడిపి కార్యకర్తలు దాడి చేశారు. దీంతో ఇరు గ్రూపులను పోలీసులు చెదరగొట్టారు. టిడిపి కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు.



గవర్నర్ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ కార్యదర్శిగా ఎల్ఎఫ్‌బి అండ్ ఎల్ఎమ్ఎస్ డిపార్టమెంట్ ప్రభుత్వ కార్యదర్శి హరి జవహర్‌లాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌ను ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హరి జవహర్‌లాల్‌ను గవర్నర్ కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది.

సమస్యలు పరిష్కరించండి

- మంత్రులకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంత్రులుగా బాధ్యతలు చేపట్టాక హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఈ మేరకు కలిశారు. ఈ సందర్భంగా మంత్రులకు వారు అభినందనలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, రాష్ట్ర నాయకులు జి షేబారాణి, ఎం నాగశేషు, కె కృష్ణవేణి, ఇ చంద్రావతి, వెంకటమ్మ, నిర్మల, రేణుక తదితరులు వున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సమస్యలను మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వివరించారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ అమలు చేయాలని, రాష్ట్రంలో ఇప్పుడున్న మినీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలని, 42 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రికి యూనియన్ ప్రతినిధులు వివరించారు. అలాగే సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని హోంమంత్రి వంగలపూడి అనితను వారు కోరారు.



మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యూనియన్ నేత సుబ్బరావమ్మ తదితరులు



వైసిపి శ్రేణులకు అభివాదం తెలుపుతున్న జగన్

కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మంచి రోజులు వస్తాయని, ఎవరు భయపడవద్దని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా సోమవారం మూడవ రోజు పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి పార్టీ శ్రేణులు, ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో జగన్ మాట్లాడారు. ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉందని, మనపట్ల ప్రజలకు విశ్వాసం ఉందని, మళ్లీ ప్రజల్లోకి వస్తామని, భవిష్యత్తు మనదేనని వైసిపి శ్రేణులకు ధైర్యం చెప్పారు. వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నేతలతోనూ చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తకు తనతో పాటు వైసిపి తోడుగా ఉంటుందని జగన్ భరోసానిచ్చారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని, కానీ పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా వేరే వారికి పనులు ఎందుకు కట్టబెట్టారని వైసిపి ముఖ్య నాయకులను మందలించారు. వందల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉంటే ఎందుకు తన దృష్టికి తీసుకురాలేదని జగన్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాయచోటి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, జిల్లా, నియోజకవర్గంలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మూడ్రోజుల పాటు నిర్వహించిన ప్రజాదర్బార్ ముగియడంతో జగన్, ఆయన భార్య భారతి ప్రత్యేక హెలికాప్టర్‌లో బెంగళూరులోని వారి నివాసానికి బయలుదేరి వెళ్లారు.

బాలికపై మైనర్ బాలుడు లైంగిక దాడి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఐదేళ్ల చిన్నారిపై 16 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా నరసరావుపేటలో సోమవారం వెలుగు చూసింది. నరసరావుపేట రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఒకే భవనంలో వరుసగా ఉండే రేకుల ఇళ్లల్లో మూడు కుటుంబాలు అద్దెకు నివాసం ఉంటున్నాయి. తన పక్కింట్లోని ఐదేళ్ల బాలికకు మైనర్ బాలుడు మాయమాటలు చెప్పి గత శనివారం తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు సోమవారం నరసరావుపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను స్థానిక ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోశయ్య తెలిపారు.

బాపట్ల జిల్లా బీచ్‌లకు నోఎంట్రీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లో వరుసగా ఎనిమిది మంది పర్యాటకులు మరణించిన నేపథ్యంలో జిల్లాలోని బీచ్‌లకు పర్యాటకులు వెళ్లకుండా జిల్లా పోలీసులు సోమవారం నుంచి కట్టడి చేశారు. బాపట్ల సూర్యలంక, చీరాల వాడరేవు, వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లకు ఎవరు వెళ్లకుండా ఆయా మార్గాల్లో బారికేడ్స్ ఏర్పాటు చేశారు. , యాత్రికులకు విజ్ఞప్తి పేరుతో బ్యానర్లు కట్టారు. సముద్ర తీరంలో అలల ఉధృతి ఎక్కువగా ఉందని, సముద్రపు ఒడ్డున సుడిగుండాలు ఏర్పడి లోతైన గుంతల కారణంగా పర్యాటకుల మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. పరిస్థితిని సమీక్షించి తిరిగి అనుమతి ఇచ్చేంత వరకు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.



ఐద్వా ఆధ్వర్యాన విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

చేయూత డబ్బులివ్వాలని ఐద్వా ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల కోడ్ కారణంగా గత ప్రభుత్వం విడుదల చేసిన చేయూత డబ్బుల్ని ఆపేశారని, వెంటనే మహిళలందరికీ వాటిని అందజేయాలని కోరుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టరేట్ల వద్ద మహిళలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా విజయనగరంలో జిల్లా కార్యదర్శి పి రమణమ్మ నాయకులు వి లక్ష్మి మాట్లాడుతూ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత చేయూత డబ్బులు కొద్దిమందికి మాత్రమే పడ్డాయని, దీంతో మిగతావారు బ్యాంకులు చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన మహిళలందరికీ చేయూత డబ్బులు జమ అయ్యేలా టిడిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పార్వతీపురంలో జరిగిన ధర్నాలో పార్వతీపురం, గరుగుబిల్లి మండలాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. వీరినుద్దేశించి సిఐటియు నాయకులు గొర్లె వెంకటరమణ మాట్లాడారు.

26 నుంచి వారాహి అమ్మవారి దీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 26 నుంచి వారాహి అమ్మవారి దీక్ష చేపట్టనున్నారు. 11 రోజులపాటు దీక్ష చేయనున్నారు. ఇందులో భాగంగా పాలు, పండ్లు, ద్రవపదార్థం తీసుకోనున్నారు. గతేడాది జూన్ నెలలో పవన్‌కల్యాణ్ వారాహి విజయయాత్ర చేపట్టారు. ఆ యాత్ర సందర్భంలోనూ వారాహి అమ్మవారికి పూజలు చేసి దీక్ష చేపట్టారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

సముద్ర ఉత్పత్తుల రవాణాలో అగ్రగామిగా విశాఖ పోర్టు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సముద్ర ఉత్పత్తుల రవాణాలో భారతదేశంలోనే విశాఖపట్నం పోర్టు అగ్రగామిగా నిలిచింది. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.17,983.99 కోట్ల విలువేన 3,14,199 టన్నుల సముద్ర ఉత్పత్తులను రవాణా చేసి దేశంలో నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుంది. ఆ తరువాత రూ.6,395.70 కోట్ల విలువైన 2,40,253 టన్నుల సముద్ర ఉత్పత్తులను రవాణా చేసి జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు అథారిటీ రెండో స్థానంలో నిలిచింది. రూ.6,120 కోట్ల విలువైన 1,81,400 టన్నుల సముద్ర ఉత్పత్తులను రవాణా చేసి కొచ్చిన్ పోర్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం రూ.60,523.89 కోట్ల విలువైన 17,81,602 టన్నుల సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రధాన ఎగుమతి గమ్యస్థానాల్లో, విదేశీ డిమాండ్‌లో సవాళ్లు ఎదురైనా భారత్ వాటిని అధిగమించి నూతన రికార్డులను నెలకొల్పింది. 132 దేశాలకు సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసి తన ప్రతిష్టను పెంచుకుంది. ఎగుమతులలో రొయ్యలు ప్రధాన పాత్ర పోషించాయి.

నెంబర్ 1గా విశాఖ పోర్టు నిలవడం వెనుక కారణాలివీ..

ఆంధ్రప్రదేశ్‌లో దినదినాభివృద్ధి చెందుతున్న ఆక్వాకల్చర్ పరిశ్రమ విశాఖ పోర్టు మొదటి స్థానంలో నిలవడంలో దోహదపడింది. వనామి రకం రొయ్యల అధిక ఉత్పత్తి, ఒడిశా సముద్ర ఉత్పత్తులను విశాఖ పోర్టు నుంచి ఎగుమతి చేయడం వంటి అంశాలు విశాఖ పోర్టును ప్రగతిపథాన నిలిపాయి.

సచివాలయాలకే 'సూపర్ సిక్స్'

- అమలు బాధ్యత అప్పగింత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయాలకే అప్పగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిం. ప్రభుత్వం నుండి అందిన ఆదేశాలతో అధికారయంత్రాంగం కూడా కసరత్తు ప్రారంభించింది. ఒక్కో సచివాలయంలో ఇప్పటికే పది నుంచి 12 మంది వరకు కార్యదర్శులు పనిచేస్తున్నారు. వారికే సూపర్ సిక్స్ పథకాల బాధ్యతలను కూడా అప్పగించనున్నారు. వీటితోపాటు ఉద్యోగ నియామకాలకు సంబంధించి నిరుద్యోగులను గుర్తించే బాధ్యత కూడా సచివాలయాలకే అప్పగించాలని, లేదా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించే బాధ్యతను వారికి అప్పగించాలని యోచిస్తున్నారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు తెలిసింది.

'అన్నమయ్య'కు తొలగని చిక్కులు

- మరో డిజైన్‌కు శ్రీకారం
- 25 మీటర్ల ఎత్తుకు డ్యామ్ నిర్మాణం
- ముంపునకు గురికానున్న నందలూరు



అన్నమయ్య రిజర్వాయర్ తెగిన ప్రదేశం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య రిజర్వాయర్‌కు డిజైన్ చిక్కులు తొలగడం లేదు. 2021 నవంబర్ నుంచి 2024 వరకు డిజైన్ల దశలోనే సతమతమవుతోంది. రెండేళ్ల ప్రభుత్వ, ప్రయివేటు సర్వే సంస్థల పరిశీలన అనంతరం 2023 డిసెంబర్‌లో 2.5 టిఎంసిల నిల్వ సామర్థ్యం, 10 గేట్లు, ఐదు లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి పరిమాణంతో కూడిన కాంక్రీట్ డ్యామ్ డిజైన్ నిర్మాణానికి ప్రభుత్వ ఆమోదం లభించింది. రూ.787.77 కోట్లతో జిఒఆర్‌టి నెంబర్ 2076 విడుదల చేసింది. అదే ఏడాది ఫిబ్రవరిలో జిల్లా జలవనరుల శాఖ టెండర్లు సైతం పిలిచింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టు సంస్థ టెండరు దక్కించుకుంది. రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టే సమయానికి సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

రాష్ట్రంలో అధికారం మారడంతో డిజైన్ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. కాంక్రీట్ డ్యామ్ డిజైన్ కాదని, మరోసారి డిజైనింగ్ ప్రక్రియకు జలవనరులశాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్ర జలవనరులశాఖ, కేంద్ర ప్రభుత్వ ఇంజనీరింగ్ సంస్థలైన ఢిల్లీ, మహారాష్ట్రలోని సిఐసిడిసి, సిడబ్ల్యుడి పిఆర్ఎస్ నిపుణుల సహకారాన్ని తీసుకుంది. 500 ఏళ్ల వరద ప్రవాహాన్ని అధ్యయనం చేసింది. 2.5 టిఎంసిల నిల్వ సామర్థ్యం, 25 మీటర్ల ఎత్తు, 14 గేట్లు, 8.23 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి పరిమాణంతో డిజైన్‌కు రూపకల్పన చేసింది. కేంద్రంలోని సిడబ్ల్యుడిసి హైడ్రాలజీ ఆమోదమూ లభించింది. ఈ డిజైన్ ప్రకారం ఎనిమిది లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి పరిమాణంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తే బహుదా బేసిన్ పరిధిలోని 24 వేల ఎకరాల ఆయకట్టు ప్రాంతం సహా నందలూరు మండల కేంద్రం సైతం ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందనే వాదన ఇంజనీరింగ్ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఇటువంటి డిజైన్‌తో రిజర్వాయర్ నిర్మాణం చేపడితే బహుదా నదికి ఇరువైపులా సుమారు 20 కిలోమీటర్ల మేర ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాల్సిన అవసరం ఉంది.

రెట్టింపు వ్యయం

కడప జిల్లాలోని ఐదు నదీ పరివాహక బేసిన్లలో బాహుదా బేసిన్ చిన్నది. అన్నమయ్య రిజర్వాయర్ నుంచే ఎనిమిది లక్షల క్యూసెక్కులు డిశ్చార్జి చేసే అవకాశం ఉంటే బహుదా బేసిన్ కంటే పెద్దవైన పెన్నా బేసిన్ నుంచి సుమారు 10 లక్షల క్యూసెక్కులు, పాపాఘ్ని 10 లక్షల క్యూసెక్కులు, చిత్రావతి ఎనిమిది లక్షల క్యూసెక్కులు, కుందూ నాలుగు క్యూసెక్కులు వస్తే సుమారు 32 లక్షల క్యూసెక్కులను విడుదల చేయాల్సి వస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కడప-నెల్లూరు జిల్లాల సరిహద్దులోని సోమశిల రిజర్వాయర్ ఏడు లక్షల క్యూసెక్కు డిశ్చార్జి సామర్థ్యం తట్టుకునే అవకాశాలు లేవనే వాదన వినిపిస్తోంది. తొలుత కాంక్రీట్ డిజైన్ నిర్మాణానికి కేటాయించిన రూ.787.77 కోట్లకు రెట్టింపు వ్యయం కేటాయించాల్సి వచ్చే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. రిజర్వాయర్ నిర్మాణ వ్యయం పెరుగుదల, ముంపు పరిస్థితిపై అన్నమయ్య రిజర్వాయర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను సంప్రదించగా 2021 నవంబర్‌లో వచ్చిన జవాద్ తుపాన్‌లో ఎనిమిది లక్షల క్యూసెక్కుల డిశ్చార్జిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఇంజనీరింగ్ నిపుణులు డిజైన్ చేశారని పేర్కొనడం గమనార్హం.

భారత్ వృద్ధి 7% లోపే..!

- ఎస్అండ్‌పి విశ్లేషణ
- ఆర్‌బిఐ అంచనాల కంటే తక్కువ
- అధిక వడ్డీ రేట్ల ప్రభావం



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల ఏడు శాతం దిగువకే పరిమితం కానుందని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పి అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత వృద్ధి 6.8 శాతంగా ఉండొచ్చని సోమవారం ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. అధిక వడ్డీ రేట్లు, వ్యవసాయేతర రంగాలలో మందగమనం డిమాండ్‌ను దెబ్బతీయనున్నాయని తెలిపింది. "భారత జిడిపి వృద్ధి పురోగమనం ఆశ్చర్యకరంగా కొనసాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం వృద్ధి నమోదయ్యింది. అధిక వడ్డీ రేట్లు, వ్యవసాయేతర రంగాలలో తక్కువ ఆర్థిక వృద్ధితో ఈ ఏడాది జిడిపి 6.8 శాతానికి పడిపోవచ్చని అంచనా వేస్తున్నాము" అని ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ ఆసియా ఫసిపిక్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఆర్థిక సంవత్సరం 2025-26లో 6.9 శాతం, 2026-27లో 7 శాతంగా నమోదు కావొచ్చని ఎస్అండ్‌పి అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తన పాలసీ రేటును 6.5 శాతం నుండి 6 శాతానికి తగ్గించవచ్చని పేర్కొంది. 2025-26, 2026-27లో రుణ రేటును వరుసగా 5.5 శాతం మరియు 5.25 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషించింది.

ఎస్అండ్‌పి వృద్ధి అంచనాలు ఆర్‌బిఐ కంటే తక్కువగా ఉన్నాయి. తాజా ద్రవ్య పరపతి విధాన సమీక్షలో, ఆర్‌బిఐ 2024-25కు గాను 7.2 శాతం వృద్ధిని అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండొచ్చని తెలిపింది. "ద్రవ్యోల్బణం, అధిక నిరుద్యోగం, సామాజిక, ఆర్థిక అసమానతలు వంటి దీర్ఘకాలిక సవాళ్లను ఎదుర్కోవడంలో.. అదే విధంగా కొత్త పొత్తులను ఏర్పరచడంలో బిజెపి ఎంత బాగా పని చేస్తుందో.. దాన్ని బట్టి వచ్చే ఐదేళ్లలో భారత వృద్ధి ఉండొచ్చని ఎస్అండ్‌పి పేర్కొంది.

హీరో మోటో వాహనాలు ప్రియం



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ కంపెనీ హీరో మోటో కార్ప్ తన వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఎంపిక చేసిన మోటారు సైకిళ్లు, స్కూటర్లపై జులై 1 నుంచి పెంచిన ధరలు అమల్లోకి వస్తాయని సోమవారం ఆ సంస్థ వెల్లడించింది. మోటారు సైకిల్ లేదా స్కూటర్‌పై గరిష్ఠంగా రూ.1,500 వరకు పెంచుతున్నట్లు వెల్లడించింది. ముడి సరుకుల వ్యయాలు పెరగడంతో పెంపు అనివార్యమయ్యిందని హీరో మోటో తెలిపింది. హీరో మోటో 2023లో 5.08 లక్షల యూనిట్లు అమ్మకాలు చేయగా.. 18,673 యూనిట్లను ఎగుమతి చేసింది.



ఒప్పో నుంచి ఎ3ప్రో

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో కొత్తగా తన ఒప్పో ఏ3 ప్రోను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. గత ఏప్రిల్‌లో చైనాలో ఈ ఫోన్‌ను ఆవిష్కరించింది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్, 50-మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంది. 8జిబి ర్యామ్ విత్ 128జిబి స్టోరేజీ వేరియంట్ ధరను రూ.17,999గా, 8జిబి ర్యామ్, 256 జిబి స్టోరేజీ వేరియంట్ ధరను రూ.19,999గా నిర్ణయించింది. ఒప్పో ఏ3 ప్రో ఫోన్ 50 ఎంపి ప్రైమరీ సెన్సర్ కెమెరాతో పాటు డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ సహా సెల్ఫీ కోసం 8ఎంపి కెమెరాను అమర్చింది.

ఆర్థిక మోసాలపై అప్రమత్తం : హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్

ముంబయి : మోసపూరిత వాట్సాప్ గ్రూప్‌లు, బ్యాంకు ప్రతినిధులుగా చేసే మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టాక్ బ్రోకింగ్ సంస్థ హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ హెచ్చరించింది. పెట్టుబడిదారులందరూ స్టాక్ మార్కెట్‌లో సూచనాత్మకమైన, హామీ ఇవ్వబడిన లేదా గ్యారెంటీడ్ రాబడిని అందిస్తుందనే ఏదైనా స్కీమ్ లేదా ప్రొడక్ట్‌లను సబ్‌స్క్రయిబ్ చేయకుండా ఉండాలని ఆ సంస్థ సిఒఒ సందీప్ భరద్వాజ్ పేర్కొన్నారు.



వెంకటపాలెం నుంచి బయలుదేరిన రైతుల పాదయాత్ర

తిరుమలకు పాదయాత్రగా రాజధాని రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఐదేళ్ల తరువాత రాజధాని అమరావతి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడం, అమరావతి ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు ప్రారంభంకావడం, రాజధాని గ్రామాల్లో మళ్లీ కొత్త కళ ఏర్పడడంతో రాజధాని గ్రామాల రైతులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. రాజధానిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం నుంచి తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు 16 రోజులపాటు ఈ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సోమవారం వెంకటపాలెం ఆలయం వద్ద ప్రారంభించారు. రైతులు, మహిళలు యాత్రలో పాల్గొన్నారు.

అమరావతి పనులు ప్రారంభమైతే తాము తిరుమల తిరుపతి దేవస్థానానికి పాదయాత్రగా వస్తామని ఉద్యమం సమయంలో మొక్కుకున్నామని, ఈ మేరకు తాము ఈ యాత్ర ద్వారా తిరుమల వెళ్తున్నామని రైతులు తెలిపారు. కూటమి పాలనలో రాజధానికి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు పువ్వాడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జిల్లాలోని ఒకటో మాస్టర్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన గేట్ మీటింగ్ అనంతరం ఈ కార్యక్రమం చేపట్టారు. ధర్నాలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలో పనిచేస్తున్న కార్మికులకు, ఆప్కాస్ కార్మికులకు పెండింగ్ మెడికల్ అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. కోవిడ్ కార్మికులకు గత మూడు నెలల నుండి వేతనాలు బకాయిలు ఉన్నాయని, అదనపు కార్మికులకు ఎనిమిది నెలల నుండి వేతనాలు ఇవ్వడంలేదని అన్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్లకు సెమి స్కిల్డ్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, స్కూలులో స్వీపర్స్‌కు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులకు ఏళ్ల తరబడి పిఎఫ్ రికార్డు సక్రమంగా చేయడంలేదన్నారు. ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, కార్మికులు పనిచేసేందుకు చీపుర్లు, పనిముట్లు, పుష్ కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో పనిభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, కార్మికుల యూనియన్ నగర కార్యదర్శి యు రత్నకుమారి, టి విజయ, సిహెచ్ అక్కేశ్వరరావు, ఎం బాబు, సిహెచ్ సింహాద్రి, శ్రీదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.



ఒంగోలులో మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు..

సంపాదకీయం

'మద్దతు' మోసం

పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటనలో మోడీ ప్రభుత్వం ఈ మారు కూడా రైతులకు ద్రోహమే చేసింది. పంట ఉత్పత్తికి రైతు చేసే మొత్తం వ్యయాన్ని లెక్కగట్టి (సి2), దానికి యాభై శాతం కలిపి ఎంఎస్‌పి నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసింది. తాము అధికారంలోకొస్తే ఆ విధంగా ఎంఎస్‌పి ఇస్తామని పదేళ్ల క్రితం మోడీ హామీ ఇచ్చారు. కేంద్రంలో రెండు పర్యాయాలు ఫుల్ మెజార్టీతో ప్రభుత్వాలను నడిపించిన బిజెపి సర్కారు, ఒకటిన్నర రెట్ల ఎంఎస్‌పి హామీని తుంగలో తొక్కింది. అంతేకాదు, ఆ హామీని అమలు చేయలేమని సుప్రీంకోర్టుకు రాతపూర్వకంగా అఫిడవిట్ ఇచ్చింది. ఇంకోవైపు తాము ఒకటిన్నర రెట్ల ఎంఎస్‌పి ఇచ్చేశామని అబద్ధపు ప్రచారం లంకించుకోవడం బిజెపికే చెల్లింది. మూడవసారి మోడీ ఆధ్వర్యంలో కేంద్రంలో ఎన్‌డిఎ సంకీర్ణ సర్కారు ఏర్పడగా, ఇప్పుడు సైతం ప్రభుత్వం మనసు మారలేదనడానికి 2024-25లో 14 ఖరీఫ్ పంటలకు బుధవారం మోడీ కేబినెట్ ఆమోదించిన ఎంఎస్‌పిలను చూస్తే అర్థమవుతుంది. గతేడాది ధరల కంటే ఈ తడవ పెంచామని సర్కారు తప్పుడు ప్రచారం చేస్తుండగా, స్వామినాథన్ సిఫారసుల ప్రకారం చూస్తే మోడీ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఎంఎస్‌పిల వలన ఖరీఫ్ రైతులు ఆర్థికంగా భారీగా నష్టపోనున్నారని తేటతెల్లమవుతోంది.

వ్యవసాయ పంట ఉత్పత్తుల వ్యయాలు, ధరల కమిషన్ (సిఎసిపి) అంచనాల ప్రకారం క్వింటాలు సాధారణ రకం వరి ధాన్యం ఉత్పత్తికి రైతు చేసే వాస్తవ వ్యయం రూ.2 వేలకుపైమాటే. స్వామినాథన్ సిఫారసు ప్రకారం ఆ వ్యయానికి యాభై శాతం కలిపి ప్రభుత్వం ధర నిర్ణయించాలి. కానీ 2,300 మాత్రమే ప్రకటించింది. ప్రభుత్వ చర్య వలన రైతు క్వింటాలు ధాన్యానికి 700 కోల్పోతున్నాడు. మోడీ ప్రభుత్వ వాదన వేరేలా ఉంది. నిరుడు 2,183 ఇచ్చాం, ఈ సంవత్సరం 117 పెంచాం అని వాస్తవాలకు మసిపూసే యత్నం చేయడం దారుణం. ఒక్క వరి విషయంలోనే కాదు అన్ని పంటల ధరలూ ఇలాగే ఉన్నాయి. ప్రభుత్వం చేస్తున్న మరో వంచన సిఎసిపి వ్యయ అంచనాల్లో కొంత భాగాన్ని లెక్కలోకి తీసుకొని ఒకటిన్నర రెట్ల ఎంఎస్‌పి ఇచ్చేశామనడం. స్వామినాథన్ సూచించింది పంట పండించడానికి రైతు చేసే మొత్తం వ్యయం (సి2). కానీ మోడీ సర్కారు సి2ను కాకుండా కొంత భాగాన్నే లెక్కలోకి తీసుకొని దానిపై 50 శాతం అంటోంది. ఇది మోడీ సర్కారు అన్నదాతలను నిలువునా చేస్తున్న పెద్ద మోసం.

పిఎం కిసాన్ కిస్తును విడుదల చేసే ఫైల్‌పై ప్రధానిగా మోడీ తొలి సంతకం చేస్తూ తమ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వమని గొప్పగా చెప్పారు. రైతులకు ఎంఎస్‌పి ఇచ్చే విషయంలో ఇచ్చిన వాగ్దానాన్ని పాతిపెట్టి రైతుల సంక్షేమం అనడం ఎంతమాత్రం నప్పదు. రైతులకు ఎంఎస్‌పి ఇవ్వకుండా వారి ఆదాయాలు రెట్టింపు చేస్తామనడం దగా. మోడీ గ్యారంటీ చెల్లనిచీటీనే! వ్యవసాయ ప్రధాన దేశంలో రైతులను సంక్షోభంలోకి నెట్టి, ఆత్మహత్యలు కొనసాగుతుండగా వికసిత భారత్ అనడం వంచనే. స్వామినాథన్ సిఫారసునులను అటకెక్కించి ఆయనకు భారతరత్న ఇవ్వడం గౌరవించడం కాబోదు. మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులో 2020-21 ఏడాదిపాటు రైతులు వీరోచిత పోరాటం చారిత్రాత్మకమైనది. ఆ పోరాటం నుంచి పుట్టిందే ఎంఎస్‌పికి చట్టబద్ధ గ్యారంటీ డిమాండ్. మూడు చట్టాల రద్దు తర్వాత కూడా మోడీ ప్రభుత్వంలో మార్పు రాలేదు. ఢిల్లీకి అనుకొని ఉన్న యుపి, హర్యానా, రాజస్థాన్‌లలో మొన్నటి ఎన్నికల్లో బిజెపి ఓడింది రైతుల ఆగ్రహం వల్లనే. ఎంఎస్‌పి నిర్ణయంలో, వ్యవసాయ బడ్జెట్ రూపకల్పనలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తో మోడీ సర్కారు సంప్రదింపులు జరపలేదు. పంటల వ్యయాలపై కనీసం రాష్ట్రాలు ఇచ్చిన అంచనాలను, సిఎసిపి గణాంకాలను పట్టించుకోలేదు. ఇది మోడీ ప్రభుత్వ ఏకపక్ష, ఒంటెత్తు పోకడలకు పరాకాష్ట. మోడీ సర్కారు ఖరీఫ్‌నకు ప్రకటించిన ఎంఎస్‌పిలను వెనక్కితీసుకొని రైతుల ఆకాంక్షలకనుగుణంగా సరికొత్త ప్రతిపాదనలతో ముందుకు రావాలి. అందుకు మోడీ ప్రభుత్వంపై రైతాంగం ఒత్తిడి తేవాలి.

మహనీయుల మాట




ఒక దేశం యొక్క నిజమైన బలం
అది దాచి ఉంచిన
బంగారంలో కాక
ఆ దేశ ప్రజల మేధో, భౌతిక
బలంలో ఉంటుంది.

- సర్ సి.వి రామన్,
సుప్రసిద్ధ శాస్త్రవేత్త.

కృత్రిమ మేధస్సు - ఉపాధి సమస్య

ప్రజాస్వామ్యం

ప్రభాత్ పట్నాయక్




కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ లేదా ఎ.ఐ)ను ఉపయోగించడానికి నిర్మాతలు సిద్ధపడినప్పుడు హాలీవుడ్ రచయితలు దాని కారణంగా తమ ఉపాధి దెబ్బ తింటోందంటూ సమ్మెకు దిగారు. ఆ ఘర్షణ సర్దుబాటు అయ్యింది. ఐతే ఆ సమ్మె లేవనెత్తిన మౌలిక ప్రశ్న మాత్రం అలానే మన ముందు ఉంది. ఎ.ఐ ని ప్రవేశ పెడితే వచ్చే అనేక సమస్యల గురించి చాలా మంది రాశారు. కాని ఎ.ఐ కారణంగా తలెత్తే భారీ స్థాయి నిరుద్యోగం గురించి ఇక్కడ మనం ప్రధానంగా చర్చించాలి.

ఇక్కడ సమస్య ఎ.ఐ ది కాదు. ఎ.ఐ ని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశ పెట్టడం వలన వచ్చే సమస్య ఇది. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక భాగంలో ఉన్నది పెట్టుబడిదారీ వ్యవస్థే గనుక శ్రామిక ప్రజానీకానికి ఇది తీవ్రమైన సమస్యగా ఉంటుంది. శ్రమను అందరూ పంచుకోవడం, దాని ఫలితంగా వచ్చే ఉత్పత్తిని కూడా అందరూ పంచుకోవడం అన్న సూత్రాన్ని అనుసరించే వ్యవస్థ, అంటే సోషలిస్టు వ్యవస్థ వంటిది ఉన్న చోట ఎ.ఐ ని ప్రవేశ పెడితే అది పెద్ద సమస్య కానే కాదు. ఎ.ఐ ని ప్రవేశ పెట్టడం వలన వచ్చే నైతిక, ఇతర అభ్యంతరాలను పక్కన పెడితే, అది సోషలిస్టు వ్యవస్థలో మనుషుల మీద పని భారాన్ని తగ్గిస్తుందే తప్ప అక్కడ ఉపాధి అవకాశాలను నాశనం చేయదు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో అలా జరగదు. ఎందుకంటే ఈ వ్యవస్థ పని భారాన్ని పంచుకోవడం, ఉత్పత్తిని పంచుకోవడం అనే సూత్రాన్ని అనుసరించదు.

ఉదాహరణకు, ఎ.ఐ ని ప్రవేశ పెట్టడం వలన గాని, మరే ఇతర టెక్నాలజీని ప్రవేశ పెట్టడం వలన కాని ఇప్పుడు 100 మంది కార్మికులు అవసరమైన చోట 50 మంది మాత్రమే సరిపోతారనుకుందాం. ఇది సోషలిస్టు వ్యవస్థలో జరిగితే అప్పుడు ఆ 100 మంది కార్మికులమీద పనిభారం సగానికి తగ్గిపోతుంది. వారికి అంతవరకూ చెల్లించిన వేతనాలు అలానే కొనసాగుతాయి. అంటే వారి తీరుబాటు సమయం పెరుగుతుంది. అదే సమయంలో అంత వరకూ వారు పొందిన మోతాదులోనే సరుకులను ఇక ముందూ పొందగలుగుతారు. లేదా, అంతకు ముందు ఎంత సమయం పని చేస్తూ వచ్చారో, అంత సమయమూ ఇప్పుడు కూడా (అంటే, ఎ.ఐ ని ప్రవేశ పెట్టిన తర్వాత కూడా) పనిచేస్తూ వచ్చారనుకోండి. అప్పుడు వారి వేతనాలు రెట్టింపు అవుతాయి. అంటే సోషలిజంలో ఉత్పాదకత పెరుగుతున్న కొద్దీ దాని ఫలితంగా వారి తీరుబాటు సమయం కాని, ఆదాయాలు కాని పెరుగుతూ పోతాయి. వారి శ్రమకాలం అంతకు ముందు ఎంత ఉందో ఇప్పుడు కూడా అంతే ఉంటుంది.

అదే పెట్టుబడిదారీ వ్యవస్థలోనైతే, తక్కువ మంది కార్మికులతో పని చేయించగలిగే టెక్నాలజీని ప్రవేశ పెడితే దాని ఫలితంగా వెంటనే ఉపాధి తగ్గిపోతుంది. పైన చెప్పిన ఉదాహరణనే పెట్టుబడిదారీ వ్యవస్థకు వర్తింపజేస్తే, ఇక్కడ ఎ.ఐ ని ప్రవేశ పెట్టగానే, 50 మందికి ఉద్యోగాలు పోతాయి. కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టినందుకు అయ్యే అదనపు ఖర్చు వలన తమ లాభాలు తగ్గిపోకుండా ఉండాలంటే యజమానులు అదనంగా ఉండే కార్మికులను తొలగించి తద్వారా తమ ఖర్చును తగ్గించుకుంటారు. ఇలా పనులు పోగొట్టుకున్న 50 మందీ నిరుద్యోగ సైన్యంలో కలుస్తారు. అప్పుడు మెరుగైన జీతాలు కోరుకునే కార్మికుల పోరాట శక్తి బలహీన పడుతుంది. వారి వేతనాలు పెరగవు సరికదా తగ్గే అవకాశాలు ఉంటాయి. అంటే పని భారాన్ని తగ్గించే ఏ టెక్నాలజీ అయినా పెట్టుబడిదారీ సమాజంలో ప్రవేశ పెడితే దానివలన కార్మికుల పరిస్థితి మరింత దిగజారుతుంది. నిరుద్యోగం మరింత



పెట్టుబడిదారీ వ్యవస్థలోనైతే, తక్కువ మంది కార్మికులతో పని చేయించగలిగే టెక్నాలజీని ప్రవేశ పెడితే దాని ఫలితంగా వెంటనే ఉపాధి తగ్గిపోతుంది. పైన చెప్పిన ఉదాహరణనే పెట్టుబడిదారీ వ్యవస్థకు వర్తింపజేస్తే, ఇక్కడ ఎ.ఐ ని ప్రవేశ పెట్టగానే, 50 మందికి ఉద్యోగాలు పోతాయి. కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టినందుకు అయ్యే అదనపు ఖర్చు వలన తమ లాభాలు తగ్గిపోకుండా ఉండాలంటే యజమానులు అదనంగా ఉండే కార్మికులను తొలగించి తద్వారా తమ ఖర్చును తగ్గించుకుంటారు. ఇలా పనులు పోగొట్టుకున్న 50 మందీ నిరుద్యోగ సైన్యంలో కలుస్తారు. అప్పుడు మెరుగైన జీతాలు కోరుకునే కార్మికుల పోరాట శక్తి బలహీన పడుతుంది. వారి వేతనాలు పెరగవు సరికదా తగ్గే అవకాశాలు ఉంటాయి. అంటే పని భారాన్ని తగ్గించే ఏ టెక్నాలజీ అయినా పెట్టుబడిదారీ సమాజంలో ప్రవేశ పెడితే దానివలన కార్మికుల పరిస్థితి మరింత దిగజారుతుంది.

పెరుగుతుంది. కార్మికుల నిజ వేతనాలు తగ్గుతాయి. దానికి భిన్నంగా సోషలిజంలో అదే టెక్నాలజీ వలన కార్మికుల చాకిరీ భారం తగ్గుతుంది. మానవులకు మరింత సుఖ సంతోషాలు కలుగుతాయి. అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎ.ఐ ప్రవేశం వలన కార్మికుల జీవితాలు నాశనం అవుతాయి. ఇదేదో 19వ శతాబ్దం నాటి మొరటు కార్మిక పోరాటపు వాదనగా ముందు అనిపించవచ్చు. 19వ శతాబ్దంలో జౌళి పరిశ్రమల్లో యంత్రాలను ప్రవేశ పెట్టినప్పుడు దాని కారణంగా తమ ఉద్యోగాలు పోతాయని ఆ యంత్రాలను ధ్వంసం చేయడానికి కార్మికులు పూనుకున్నారు. ఆ ఉద్యమకారులను "లుడ్డైట్స్" అంటారు. వారి వాదన అంతా యంత్రాల ప్రవేశం

సోషలిస్టు వ్యవస్థ వంటిది ఉన్న చోట ఎ.ఐ ని ప్రవేశ పెడితే అది పెద్ద సమస్య కానే కాదు. ఎ.ఐ ని ప్రవేశ పెట్టడం వలన వచ్చే నైతిక, ఇతర అభ్యంతరాలను పక్కన పెడితే, అది సోషలిస్టు వ్యవస్థలో మనుషుల మీద పని భారాన్ని తగ్గిస్తుందే తప్ప అక్కడ ఉపాధి అవకాశాలను నాశనం చేయదు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో అలా జరగదు. ఎందుకంటే ఈ వ్యవస్థ పని భారాన్ని పంచుకోవడం, ఉత్పత్తిని పంచుకోవడం అనే సూత్రాన్ని అనుసరించదు.

వలన తమ ఉద్యోగాలు పోతున్నాయనే. ఆ వాదనలో పొరపాటు ఏమిటి? యంత్రాల ప్రవేశంతో వారి ఉద్యోగాలు పోయిన మాట వాస్తవమే కదా? ఐతే వారి ఉద్యోగాలు పోయినది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆ యంత్రాలను ప్రవేశపెట్టడం వలన తప్ప యంత్రాల వలన కాదు. పెట్టుబడిదారీ సమాజపు లోపాన్ని వారు టెక్నాలజీ లోపంగా చూశారు. అంతే తప్ప ఉద్యోగాలు కోల్పోరాదన్న వారి వాదనలో తప్పేమీ లేదు. నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో కొత్త టెక్నాలజీ వస్తే అదనపు ఉద్యోగాలు వస్తాయని వాదించేవారిదే తప్పుడు వాదన.

అలా కొత్త టెక్నాలజీ ద్వారా అదనపు ఉద్యోగాలు కలుగుతాయని వాదించిన ఆర్థికవేత్తలలో డేవిడ్ రికార్డో ముఖ్యుడు. వేతనాలు ఎప్పుడూ స్థిరంగా, జీవించేందుకు సరిపోయేలా ఉంటాయని భావిస్తూ, అటువంటి స్థితిలో కొత్త టెక్నాలజీని ప్రవేశ పెడితే కొందరి ఉద్యోగాలు వెంటనే పోతాయని, అయితే పెట్టుబడిదారుల లాభాలు బాగా పెరుగుతాయని, అలా పెరిగిన లాభాలను పెట్టుబడిదారులు మళ్లీ పెట్టుబడి రూపంలో పెడతారని, అప్పుడు చాలా కొత్త ఉద్యోగాలు వస్తాయని, అలా వచ్చే కొత్త ఉద్యోగాలు అంతకు ముందు కోల్పోయిన ఉద్యోగాలకన్నా ఎక్కువ సంఖ్యలో ఉంటాయని రికార్డో వాదించాడు. ఆ విధంగా కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టడం వలన ఉత్పత్తి రేటు, ఉపాధి రెండూ పెరుగుతాయిని అతడు భావించాడు. అంటే కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టిన ఫలితంగా ఏర్పడే నిరుద్యోగం తాత్కాలికమేనని, ఆ తర్వాత వచ్చే కొత్త ఉపాధి అవకాశాలు అంతకన్నా చాలా ఎక్కువగా ఉంటాయని రికార్డో అభిప్రాయపడ్డాడు. ఈ రోజుకీ యజమానులు, ప్రభుత్వాలు ఇదే వాదనను ఉపయోగిస్తున్నాయి. కార్మిక సంఘాలు తమ ఉపాధి అవకాశాలను దెబ్బ తీసే కొత్త టెక్నాలజీని వ్యతిరేకించిన ప్రతీసారీ ఇదే వాదనతో యజమానులు కార్మికుల డిమాండ్లను తిరస్కరిస్తున్నారు. రికార్డో వాదన అంతా కొత్త టెక్నాలజీ కేవలం ఒక్కసారి మాత్రమే ప్రవేశ పెడతారన్నట్టు, దాని వలన కలిగే తాత్కాలిక నిరుద్యోగం కొంత కాలంలో సర్దుకుపోయి అదనపు ఉద్యోగాలు కూడా వస్తాయన్నట్టు ఉంది. కాని కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడం అనేది మానవ సమాజంలో నిరంతరం కొనసాగే ప్రక్రియ. దాని వలన ప్రతీ సందర్భంలోనూ ఉద్యోగాలు కోల్పోవడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతూనే వుంటుంది. అందుచేత ఏ సమయంలో చూసుకున్నా కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టేముందు ఉన్న ఉద్యోగాల కన్నా, ఆ ప్రవేశం తర్వాత ఉండే ఉద్యోగాలు ఎప్పుడూ తక్కువే.

అంతకన్నా ముఖ్యమైనది మరొకటి ఉంది. పెట్టుబడిదారుడు తాను ఉత్పత్తి చేసే సరుకులకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది అన్నప్పుడే అదనంగా పెట్టుబడి పెడతాడు. కొత్త టెక్నాలజీని తెచ్చి దాని వలన తన ఉత్పత్తి ఖర్చు తగ్గిపోయింది గనుక, లాభాలు పెరుగుతాయి గనుక అదనంగా పెట్టుబడి పెట్టాలని అనుకోడు. అలా అదనంగా పెట్టే పెట్టుబడితో ఉత్పత్తి అయ్యే అదనపు సరుకును కొనుగోలు చేయగలిగిన అదనపు డిమాండ్ మార్కెట్‌లో ఉన్నప్పుడే ఆ అదనపు పెట్టుబడి పెట్టడానికి ముందుకొస్తాడు.

కొత్త టెక్నాలజీ ప్రవేశిస్తే వెంటనే ఉన్న ఉద్యోగాలు తగ్గుతాయన్నది రికార్డో సైతం అంగీకరించిన విషయం. జీతాలు ఎప్పుడూ బతకడానికి సరిపోయే స్థాయిలోనే కొనసాగుతాయన్నది కూడా అతడు చెప్పినదే. కొత్త టెక్నాలజీ వచ్చిన ఫలితంగా ఉద్యోగాలు తగ్గినప్పుడు మార్కెట్‌లో ఉండే కొనుగోలుశక్తి ఆ మేరకు తగ్గుతుంది. తక్కువ మంది కార్మికులతో పని చేయించుకున్నందు వలన పెట్టుబడిదారుల లాభాలు పెరుగుతాయి. అలా అదనంగా వారికి వచ్చే లాభాలను వారు దాచుకుంటారు తప్ప వారి వినిమయం ఏమీ పెరగదు. పైగా కొత్త టెక్నాలజీ ప్రవేశం ఫలితంగా ఉద్యోగాలు తగ్గిపోయాయి గనుక మార్కెట్‌లో ఉండే డిమాండ్ తగ్గుతుంది. దానికి తగినట్టు పెట్టుబడిదారులు ఉత్పత్తిని తగ్గించుకుంటారు తప్ప పెంచరు. అందుచేత రికార్డో ఊహించినట్టు అదనపు పెట్టుబడీ రాదు, అదనపు ఉపాధీ రాదు.

కొత్త టెక్నాలజీ ప్రవేశంతో కార్మికుల ఉద్యోగాలు తగ్గిపోతాయన్న కార్మికుల పాత కాలపు వాదన ఇప్పటికీ చెల్లుతుంది. ఐతే మరి యూరప్‌లో కొత్త టెక్నాలజీ ప్రవేశ పెట్టినప్పుడు ఉపాధి అవకాశాలు ఎందుకు ప్రతీసారీ పెరుగుతూ వచ్చాయి? మొదటి కారణం: యూరప్ ఖండం నుంచి భారీ స్థాయిలో తెల్లవాళ్ళు ఉష్ణ మండల ప్రాంతాలకు వలసలు పోయారు. అక్కడి స్థానికులను వారి వారి భూముల నుండి వెళ్ళగొట్టి ఆక్రమించుకున్నారు. అందుచేత యూరప్ లో కార్మికులకు డిమాండ్ ఎప్పుడూ ఉంటూ వచ్చింది. దాని ఫలితంగా అక్కడ కార్మికులు తమ జీతాలను పెంచుకోగలిగారు. 19వ శతాబ్దంలో 5 కోట్ల మంది ప్రజలు కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా దేశాలకు వలస వెళ్ళారు.

రెండవది: కొత్త టెక్నాలజీతో యూరప్‌లో ఉత్పత్తి అయిన సరుకులను ఇంకా పెట్టుబడిదారీ దశ పెరగని వెనుకబడిన వలస దేశాల లోకి దింపి అక్కడి మార్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అదనపు మార్కెట్ వలన యూరప్‌లో అదనపు ఉద్యోగాలు వచ్చాయి. కాని అంతకు మించిన సంఖ్యలో భారతదేశం, చైనా తదితర వలస దేశాల్లో చేతివృత్తుల మీద జీవించే ప్రజలు ఉపాధి కోల్పోయారు. ఒక విధంగా, యూరప్ తన దేశంలోని నిరుద్యోగాన్ని తాను ఆక్రమించుకున్న దేశాల మీదకు నెట్టివేసింది. ఆ దేశాల్లో పరిశ్రమలు నాశనం అయ్యాయి.

సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టినప్పుడు కలిగే నిరుద్యోగ సమస్యను ఆ విధంగా ఇతర దేశాల మీదకు నెట్టివేసి తమ తమ పెట్టుబడిదారీ వ్యవస్థలను వారు భద్రంగా కాపాడుకోగలిగారు. ఆ వలసలు విముక్తి పొంది స్వతంత్ర దేశాలుగా మారిన తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థలో కీన్స్ విధానాలను అనుసరించారు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి దాని ద్వారా అదనపు ఉపాధి అవకాశాలను కల్పించే ప్రయత్నం చేశారు. కాని నయా ఉదారవాద విధానాలు చేపట్టాక ప్రభుత్వ వ్యయాన్ని పెంచి ఉద్యోగాలను కల్పించడం అనేదానికి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఇప్పుడు ఆ సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో సహా పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తం మీద నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ఎ.ఐ ని ప్రవేశపెడితే ఉద్యోగులకు, కార్మికులకు అది పెను ముప్పు కాగలదు. ఈ ముప్పును నివారించడానికి సముచితమైన రీతిలో డిమాండ్లను రూపొందించుకుని కార్మికవర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సమాయత్తం కావాలి.

(స్వేచ్ఛానుసరణ)

విద్యా వ్యవస్థ పతనంలో సంఘ్ పాత్ర

వ్యాఖ్య



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

కేంద్రం, రాష్ట్రాల్లో బిజెపి పాలించే డబుల్ ఇంజిన్‌కు అవకాశం ఇమ్మని, అద్భుతాలు సృష్టిస్తానని మోడీ మోత మోగిస్తుంటారు. డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లోనే అవినీతి, అక్రమాలు ఎక్కువ జరిగాయి. పోటీ పరీక్షల అవకతవకలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల రాష్ట్రాలలోనే జరిగాయి. వాటిలో గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, బీహార్ లలో మరీ ఎక్కువ. ఉత్తర ప్రదేశ్‌లో ఇటీవలి పోలీసు నియామకాల్లో కూడా కుంభకోణం జరిగింది. ఇవీ మోడీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల అద్భుతాలు.

వాజ్‌పేయి ప్రభుత్వంలో సంఘ్ ప్రముఖుడు మురళీ మనోహర్ జోషి విద్యాశాఖ మంత్రి. అశాస్త్రీయ అంశాలను బోధనాంశాలుగా విద్యాలయాల్లో అమలు చేశారు. విద్యార్థులపై ఛాందసాలను రుద్దారు. మానవులుగా మారవలసిన మనుషులను పశుపక్ష్యాదుల స్థాయికి దిగజార్చారు. రోమ్ విశ్వవిద్యాలయ మతాంశాల మాజీ ఆచార్యుడు జియోవని జెంటైల్ ఇటలీ ఫాసిస్టు నియంత ముసోలినీ విద్యాశాఖ మంత్రి. జెంటైల్ సంస్కరణలతో ఈయన అమలు చేసిన విద్యా విధానంలో విద్యాలయాల్లో అగ్ర వర్ణాల వారే బోధించాలి. యూదులు, స్త్రీలు, వికలాంగులు విద్యకు అనర్హులు. ఉన్నత వర్గాలకు ప్రభు విద్యను, మధ్యములకు మత విద్యను, యూదులకు బానిస విద్యను బోధించాలి. మోడీ 'జాతీయ విద్యా విధానం-2020'లో ఇటువంటి అంశాలతో పాటుగా విద్యను ధార్మిక సంస్థలకు అప్పగిస్తారు. సరస్వతీ మందిరాలు, దీనానాథ్ బాత్రా భారతీయ విద్యామండలి, ప్రజ్ఞా భారతి మొదలగు సంఘ్ అనుబంధ సంస్థలే వీరి ధార్మిక సంస్థలు. విద్య, పరిశోధన, శిక్షణల భారతీయ మండలి (ఎన్.సి.ఇ.ఆర్.టి.) ఇటీవల బడుల పాఠ్యాంశాలను సంఘీకరించింది.

అన్ని వృత్తుల్లో కాషాయ సైన్య తయారీకిగాను విద్య, పోటీ పరీక్షల నిర్వాహక కాషాయాధిపతులు పోటీ పరీక్షల్లో అవినీతికి పాల్పడ్డారు. విమర్శలు వచ్చినా తమ అనుకూల అక్రమాల పోటీ పరీక్షలను సమర్థించుకుంటారు. ఆశించిన లాభం దక్కదనుకున్న పరీక్షలను కుంటి సాకులతో రద్దు చేస్తారు. నేటి నీట్, నెట్ ల కుంభకోణాలకు మధ్యప్రదేశ్ 2013 'వ్యాపమ్' ప్రవేశ పరీక్ష కుంభకోణం మూలం. ఇది వైద్య, ఇంజినీరింగ్ వృత్తి విద్యలకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రవేశ పరీక్ష. నేటి కేంద్ర మంత్రి నాటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆయన భార్య, సోదరులు 'వ్యాపమ్' కుంభకోణంలో కూరుకుపోయారు. తమ తాత్వికులను డాక్టర్లు, ఇంజినీర్లు, శాసనాధికారులు, ఉపాధ్యాయులుగా నియమించారు. వీరి అసమర్థత వల్ల రోగులు చనిపోయారు. భవనాలు, వంతెనలు కూలాయి. లక్షల అష్టావక్రులు తయారయ్యారు.

మోడీ ప్రభుత్వం 2017లో జాతీయ పరీక్షల సంస్థ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్.టి.ఎ.)ను స్థాపించింది. ఒక దేశం-ఒక పరీక్ష మోడీ లక్ష్యం. ఎన్.టి.ఎ, వైద్య విద్యలో ప్రవేశానికి నీట్ (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)ను, విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ నియామకాలకు విశ్వవిద్యాలయాల నిధుల సంస్థ(యుజిసి)-జాతీయ అర్హత పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్-నెట్)ను, దేశవ్యాపిత ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశానికి సంయుక్త ప్రవేశ పరీక్ష (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-జెఇఇ)ని, కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిశోధన, ఇతర స్నాతకోత్తర విద్యలో ప్రవేశానికి నిర్వహించే కేంద్ర/ఉమ్మడి విశ్వవిద్యాలయాల ప్రవేశ పరీక్ష (సెంట్రల్/ కామన్ యూనివర్శిటి ఎంట్రెన్స్ టెస్ట్ -సియుఇటి)ని నిర్వహిస్తుంది. ఎన్.టి.ఎ ఈ పరీక్షల నిర్వహణను సమాచార సాంకేతిక సంస్థలకు అప్పజెప్తుంది. అజాగ్రత్తలు, అభద్రతలు, తస్కరణలకు వీలుగా ఒకరికి బదులు మరొకరు పని చేసే విధంగా ఆ సంస్థల పని తీరు ఉంది. వాటి కంప్యూటర్లలోని సమాచారం ఆపరేటర్ల ద్వారా, ఇతర మార్గాల ద్వారా ఇతరులకు అందే అవకాశం ఉంది. ఆ సంస్థలే ప్రలోభాలకు లొంగవచ్చు. ప్రభుత్వాలే ఆ సంస్థలను ఆ పనికి పురమాయిస్తే!? ప్రమాదం ఊహకందదు. 2024 సంవత్సరానికి నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల ప్రశ్నా పత్రాలు బయటకు పొక్కాయి. దీనిపై వివరణ ఇమ్మని కేంద్ర ప్రభుత్వం, ఎన్.టి.ఎ.లకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. విద్యార్థులతో, వారి హక్కులతో ఆడుకోవద్దని కేంద్రానికి చివాట్లు పెట్టింది. ప్రభుత్వం నెట్‌ను మరుసటి రోజే రద్దు చేసింది. నీట్‌ను రద్దు చేయలేదు. విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో అసలు దోషులు తప్పించుకుంటారు. కాని, మూల కారకులైన విద్యా సంస్థల కాషాయ కసాయిలను, వారిని నియమించిన నరమేధులను శిక్షించాలి.

మోడీ ప్రభుత్వం విద్య, పరిశోధన రంగాలకు నిధులను తగ్గించింది. విద్యాసేవలను ప్రైవేటీకరించింది. ప్రభుత్వ కళాశాలల్లో 55,648 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో 50,685 సీట్లు మొత్తం 1,06,333 సీట్ల కోసం 2024 నీట్‌కు 24 లక్షలకు పైగా హాజరయ్యారు. ఎంపిక చేసిన కొన్ని నగరాల కళాశాల్లో 83 బోధనాంశాల అధ్యాపక పదవుల కోసం 9 లక్షల మంది 2024 నెట్ రాశారు. వైద్య విద్య సీట్లు, ఉపాధ్యాయ పోస్టులు చాలా తక్కువ. ఈ కొరత కూడా అవినీతికి కారణం. ఒక్క ప్రశ్నా పత్రం రూ.30-రూ.32 లక్షలు పలికింది.

కేంద్రం, రాష్ట్రాల్లో బిజెపి పాలించే డబుల్ ఇంజిన్‌కు అవకాశం ఇమ్మని, అద్భుతాలు సృష్టిస్తానని మోడీ మోత మోగిస్తుంటారు. డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లోనే అవినీతి, అక్రమాలు ఎక్కువ జరిగాయి. పోటీ పరీక్షల అవకతవకలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల రాష్ట్రాలలోనే జరిగాయి. వాటిలో గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, బీహార్ లలో మరీ ఎక్కువ. ఉత్తర ప్రదేశ్‌లో ఇటీవలి పోలీసు నియామకాల్లో కూడా కుంభకోణం జరిగింది. ఇవీ మోడీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల అద్భుతాలు.



యుజిసి నెట్ 2024 పరీక్షలో వైదికవాద పౌరాణిక అంశాలపై ప్రశ్నలున్నాయి. పునర్నిర్మించిన అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ట ఎప్పుడు జరిగింది? (ప్రాణ ప్రతిష్ట రామ మందిరానికి కాదు, బాలరామునికి అన్న జ్ఞానం ప్రశ్నా పత్ర రచయితకు లేదు). హిందూతత్వ ప్రస్థాన త్రయి లోని అంశాలేవి? తలలు తెగిన తర్వాత కూడా కురు క్షేత్ర యుద్ధాన్ని చూడ్డానికి బతికిఉన్న మహాభారత యుద్ధ యోధులెవరు? రామచరిత మానస్‌లో ఏ కాండలో హనుమాన్ దర్శనమిస్తాడు? బహుళ జవాబుల ఎంపిక ప్రశ్నల్లో ఇవి కొన్ని. ఉపాధ్యాయుల వైదికీకరణ వీటి ఉద్దేశం. వీటికి తోడు పోటీ పరీక్షల్లో అవినీతి (ప్రశ్నాపత్రాల అమ్మకం) విద్యార్థుల భవిష్యత్తును దెబ్బ తీస్తుంది. అవినీతితో పరీక్షలో ఉత్తీర్ణులైనవారు కర్ణ ద్రోణాదులను చంపిన వీరుల్లా గర్వంతో పొంగిపోతారు. భారత కాషాయీకరణలో, నిరంకుశ పాలనలో శకుని, శల్య పాత్రలు పోషిస్తారు.

'నీట్' అవినీతి కారణంగా నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. మోడీ అవినీతిని అంతం చేస్తానన్నారు. కోట్ల ఖర్చుతో పరీక్షపై చర్చలు జరిపారు. కాని ఈ పోటీ పరీక్షల గందరగోళంపై నోరు విప్పలేదు. పార్లమెంటు లోపల, బయట కాషాయ విద్యా విధానాలను వివరించి, ఎదిరించి, నిరోధించాలి. కాషాయాన్ని అధిగమించే తాత్వికతను అలవర్చుకోడమేగాక...ఎన్నికల్లో భావజాల పాదార్థిక ప్రలోభాలకు, ప్రయోజనాలకు లొంగకుండా ఓట్లు వేసి సామాన్య ప్రజా పక్షపాత పాలకులను ఎన్నుకోవాలి.

/ వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, సెల్ : 9490204545 /

కవిత్వం

సాగు శోకం

నల్లని మబ్బులు
ముసురుకు వచ్చి
నింగిని చీకటి దుప్పటి
కప్పేస్తే
ఆవేశంతో గంతులేయాల్సిన
రైతన్న
ప్రకాశంలేని పందిట్లో
కుప్పకూలాడు.

ఉరుము మెరుపు పిడుగులు
చూసి
మేఘం తటాలున వరద నీరై
పారే
తట్టుకోలేని నాగలి ఏడుపు
ఎత్తే
తీరని వడ్డీ బాధతో పొలమూ
మూల్గే.

కాయం నిండా జరజర జారి
కారే
చెమట చుక్కలకు ఘర్మ
ధారలకు
మద్దతుగానీ..ధర కట్టే
పద్ధతిగానీ
లేనే లేదని...అమలు కానే
లేదని.
మేఘం రాగం రావం
చేయద
ఎద్దూ పగ్గం సాక్ష్యం చెప్పవ
కాడీ మేడీ అండగ ఉండవ
రైతుతో కలిసి కదం తొక్కవ.

రైతుల కష్టం బొక్కిన
'మాల్'పతి
లక్షలు..కోట్లుగ కూడేస్తుంటే
పాలక నేతలు చేపుత ఉంటే
బసవన్నలే బుస
కొడుతున్నయ్.
రక్త మాంసముల రైతన్నలు
సలసల కాగే నెత్తుటి కళ్ళతో
పెరిగిన విత్తూ సత్తువతో
పోల్చి
స్వేదం..ధర ధర్మం
అడుగుతూ.
వీధులకెక్కి తిరగబడ సాగితే
ఆ నేరం..ఆ నేరం ఎవ్వరదని
తొలకరి మేఘం
ఉరుముతోంది.

ఆ భూమే సమ్మెకు దిగితే..!
చుక్క నీరు చిక్కుతుందా!
ఒక్క గింజ దక్కుతుందా!
అప్పుడు సోషపడి తిరగబడే
ఆకలి దప్పుకు ఆసర ఎవరు?
రాలే ప్రాణికి రక్షణ ఎవరు?
లేచిన ప్రశ్నకు
బదులిచ్చేదెవరు?

- ఉన్నం వెంకటేశ్వర్లు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్య మనుగడ

- ప్రబీర్ పుర్కాయస్థ



కన్నూర్ : ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే డిజిటల్ మీడియాలో ప్రజా ప్రాతినిధ్యం కీలకపాత్ర పోషించాల్సిన అవసరం వుందని న్యూస్‌క్లిక్ వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థ వ్యాఖ్యానించారు. పీపుల్స్ మిషన్ అండ్ లైబ్రరీ కౌన్సిల్ నిర్వహించిన డిజిటల్ మీడియా వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. భారత మీడియాలో మితవాద ఫాసిస్ట్ రాజకీయాలు విసురుతున్న సవాళ్లను పుర్కాయస్థ ప్రత్యేకించి ప్రస్తావించారు.

"కొత్త మీడియా, రైతుల పోరాటం వంటి ప్రజాదరణ పొందిన ఉద్యమాలు... ఇవన్నీ ప్రధాన స్రవంతిలోని మీడియాపై ప్రభుత్వ నియంత్రణను సవాలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి." అని పుర్కాయస్థ పేర్కొన్నారు. అప్రకటిత ఎమర్జన్సీ సమయంలో బిజెపికి మద్దతునిచ్చిన ప్రధాన స్రవంతిలోని మీడియాను ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజల అసమ్మతిని ఈ మీడియా తరచుగా తప్పుడు రీతిలోనే ప్రతిబింబిస్తుందని, కార్మికుల సమ్మెను ట్రాఫిక్‌కు అంతరాయాలుగా తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తూ వుంటాయని ఆయన విమర్శించారు.

బిజెపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారు

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ప్రబీర్ పురకాయస్థ పేర్కొన్నారు. భారతదేశ ప్రజలు తమ స్వేచ్ఛను హరించడాన్ని, తమ గొంతుకలను అణచివేయడాన్ని సహించడానికి సిద్ధంగా లేరని చెప్పేందుకు ఈ ఎన్నికలు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ లేదా మరే ఇతర పార్టీలు సాధించిన విజయం కాదని, బిజెపికి దేశ ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రజల ప్రయోజనాలను విస్మరించారని, అందుకే బిజెపి చాలా చోట్ల విఫలమైందని అన్నారు. మత విభజన రాజకీయాలు అయోధ్యలోనూ విఫలమయ్యాయని చెప్పారు.

భారతదేశం ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు కేంద్రం మతవిద్వేషాలను, విభజన రాజకీయాలను తెరపైకి తీసుకొచ్చిందని అన్నారు. పోషకాహార లోపం, పేదరికం, శిశు మరణాల రేట్లు పెరిగాయని, దేశం బ్రిటిష్ రాజ్ మాదిరిగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ సారథ్యంలో అదానీ, అంబానీలు బిలియనీర్లుగా మారారని అన్నారు. అసలు గణాంకాలను కూడా కేంద్రం విడుదల చేయడం లేదని, ప్రణాళికా సంఘాన్ని రద్దు చేశారని అన్నారు.

ప్రజలకు సమాచారం చేరకుండా నల్ల చట్టాలను ప్రవేశపెట్టారని, గళం విప్పిన వారిని దేశద్రోహులుగా పేర్కొంటూ జైళ్లలో పెట్టారని విమర్శించారు. ఇందుకోసం అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలను వినియోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా పెట్టుబడిదారుల నుంచి నిధులు సేకరించేందుకు ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టారని మండిపడ్డారు.

మాజీ ఆర్థిక మంత్రి టి.ఎం.థామస్ ఇజాక్ మాట్లాడుతూ, కొత్త మీడియాలో మితవాద శక్తుల ప్రాబల్యం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలో ప్రజలను రాజకీయంగా సంఘటితం చేయడానికి మతం, సంస్కృతులను ఉపయోగించడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కొత్త మీడియాలో ప్రతి పౌరుడు క్రియాశీలకంగా పాల్గొనాలని ఇజాక్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ఎంపి డాక్టర్ వి.శివదాసన్ అధ్యక్షత వహించారు. మంత్రి కదనప్పళ్ళి రామచంద్రన్, జిల్లా పంచాయితీ అధక్షుడు పి.పి.దివ్య పుర్కాయస్థను సత్కరించారు.. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు, జర్నలిస్టులు, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీకి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులను కూడా సన్మానించారు.

నేడు కుప్పంకు ముఖ్యమంత్రి చంద్రబాబు

- స్వంత నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రెండు రోజుల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించనున్నారు. మంగళవారం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 12.30 గంటలకు కుప్పంకు చేరుకుంటారు. 12.55 గంటలకు నియోజకవర్గంలోని శాంతిపురం మండలం జల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డి గ్రామాల్లో హంద్రీనీవా కాల్వను పరిశీలించనున్నారు.

అక్కడి నుంచి నేరుగా ఆర్అండ్‌బి అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంకాలం కుప్పం ఆర్‌టిసి బస్టాండ్ (ఎన్టీఆర్ సర్కిల్) వద్ద బహిరంగసభలో ప్రసంగించనున్నారు. రాత్రికి ఆర్అండ్‌బి అతిథి గృహంలోనే బస చేయనున్నారు. బుధవారం ఉదయం10.30 గంటలకు అక్కడే అర్జీలను స్వీకరించనున్నారు. పిఇఎస్ మెడికల్ కళాశాల పక్కన ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కుప్పం నియోజకవర్గంలోని అధికారులతో ప్రత్యేకంగా సమావేశం, భోజన విరామం అనంతరం 2.35 గంటలకు కుప్పం పార్టీ క్యాడర్‌తో సమావేశం కానున్నారు. 4.10 గంటలకు తిరుగు ప్రయాణమై విజయవాడకు చేరుకుంటారు.

టిటిడి ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం

ప్రజాశక్తి -తిరుమల

టిటిడి ట్రస్టులకు జార్ఖండ్‌కు చెందిన సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ రూ.20 లక్షలు విరాళంగా అందించింది. ఎస్‌విబిసి ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు అందజేసింది. ఇందుకు సంబంధించిన డిడిలను తిరుపతికి చెందిన ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర సోమవారం గోకులం విశ్రాంతి గృహంలో ఇఒ శ్యామలరావుకు అందజేశారు.

మఠాల పేరుతో స్కాం : జనసేన

తిరుమలలో మఠాల పేరుతో కోట్ల రూపాయల స్కాం జరుగుతుందని జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. నిబంధనలను అతిక్రమించి కొండపైన స్వరూపానంద స్వామి అక్రమ కట్టడాలు చేపట్టారని తెలిపారు. జనసేన నేతలతో కలిసి పలు మఠాలను ఆయన సందర్శించారు. అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలను ఇఒ దృష్టికి తీసుకువెళ్లి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవారి సన్నిధిలో ఎక్కడ అవినీతికి తావు లేకుండా.. కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తుందని హామీ ఇచ్చారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్రం తక్షణం నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 1180వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షల్లో ఐఎఫ్‌టియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, వర్కింగ్ కేపిటల్ సమకూర్చాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న మార్కెట్‌యార్డులను లీజుకు ఇవ్వడంగాని, అమ్మడంగానీ చేయరాదన్నారు. స్టీల్‌ప్లాంట్ భూములను పరిరక్షించాలని కోరారు. గంగవరం పోర్టును వైసిపి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా అదానీకి అప్పగిస్తూ ఒప్పందం చేసుకుందని తెలిపారు. దాన్ని రద్దు చేసి టిడిపి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఉక్కు నిర్వాసితులకు తక్షణమే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కారణంగా రిజర్వేషన్లకు విఘాతం కలిగి సామాజిక న్యాయం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీక్షల్లో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె మల్లయ్య, సీనియర్ నాయకులు వై కొండయ్య, జిల్లా కమిటీ సభ్యులు భూషణం పాల్గొన్నారు.

భారీగా పెరిగిన అంచనా వ్యయం

- 458 కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు రూ.5.71 లక్షల కోట్లకు పైగానే ఖర్చవుతుందని లెక్కలు
- కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ సమాచారం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఖర్చు అంచనాలను మించిపోయాయి. దేశవ్యాప్తంగా మొత్తం 1,817 ప్రాజెక్టుల్లో 458 ప్రాజెక్టులపై రూ.5.71 లక్షల కోట్లకు పైగా అదనపు వ్యయం నమోదైంది. అలాగే, 831 ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయి. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక ఈ సమాచారాన్ని వెల్లడించింది. ఈ సమాచారం ప్రకారం.. ఈ ప్రాజెక్టులలో ప్రతి ఒక్కదాని ఖర్చు రూ.150 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ.ఈ 1,817 ప్రాజెక్టుల అమలుకు తొలుత మొత్తం అసలు వ్యయం రూ.27,58,567.23 కోట్లుగా అంచనా వేయగా.. ప్రస్తుతం వాటి పూర్తి అంచనా వ్యయం రూ.33,29,647.99 కోట్లకు చేరింది. అంటే, అదనంగా రూ. 5,71,080.76 కోట్లు ఎక్కువ అన్నమాట. పూర్తి వ్యయం పెరగటంతో ప్రభుత్వానికి 20.70 శాతం అదనపు ఖర్చవుతుంది.

831 ఆలస్యమైన ప్రాజెక్టులలో, 245 మొత్తం 1-12 నెలల పరిధిలో ఆలస్యంగా ఉన్నాయి, 188 ప్రాజెక్టులు 13-24 నెలలు, 271 ప్రాజెక్టులు 25-60 నెలలు, 127 ప్రాజెక్టులు 60 నెలలకు పైగా ఆలస్యమయ్యాయి. కాగా, జాప్యానికి కారణాలు భూసేకరణ, పర్యావరణ క్లియరెన్స్, ఆర్థిక సమస్యలు, ఒప్పంద, అంతర్గత సమస్యలు, మానవ వనరుల కొరత, వ్యాజ్య సమస్యలని ప్రాజెక్ట్ అమలు ఏజెన్సీలు చెప్పటం గమనార్హం.

18లక్షల సంస్థల మూత..

- కొలువులు పోగొట్టుకున్న 54 లక్షల మంది
- మోడీ పాలనలో కోల్పోయిన ఉద్యోగాలు
- ఎన్ఎస్ఒ రిపోర్టు



న్యూఢిల్లీ : ఉత్పాదక రంగంలో చట్టబద్ధంగా ఏర్పడని పలు సంస్థలు గత ఏడేళ్ల కాలంలో లక్షలాది ఉద్యోగాలను కోల్పోయాయి. 2015 జులై-2016 జూన్, 2022 అక్టోబర్-2023 సెప్టెంబర్ మధ్య కాలంలో ఈ సంస్థలు 54 లక్షల ఉద్యోగాలను కోల్పోయాయి. అదే సమయంలో 18 లక్షల సంస్థలు మూతపడ్డాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) అందించిన సమాచారం ప్రకారం గత ఏడు సంవత్సరాల కాలంలో చట్టబద్ధంగా ఏర్పడని సంస్థల సంఖ్య 9.3% మేర తగ్గింది. 2022 అక్టోబర్-2023 సెప్టెంబర్ మధ్యకాలంలో ఉత్పాదక రంగంలో 1.78 కోట్ల అనధికారిక సంస్థలు కార్యకలాపాలు సాగించాయి. 2015 జూలై - 2016 జూన్ మధ్యకాలానికి వాటి సంఖ్య 1.97 కోట్లుగా ఉండేది. అంటే అనధికారిక సంస్థల సంఖ్య 9.3 శాతం తగ్గిందన్న మాట.

ఇదే కాలంలో ఆయా సంస్థల్లో పనిచేసిన కార్మికుల సంఖ్య కూడా తగ్గిపోయింది. 2015-16లో అనధికారిక సంస్థల్లో 3.60 కోట్ల మంది కార్మికులు పనిచేయగా 2022-23 నాటికి వారి సంఖ్య 3.06 కోట్లకు అంటే 15 శాతం మేర తగ్గింది. అనధికారిక రంగంలోని చిన్నచిన్న వ్యాపారాలు, ఒకే వ్యక్తి యాజమాన్యంలో నడిచే సంస్థలు, భాగస్వామ్యాలు... వీటన్నింటినీ చట్టవిరుద్ధంగా ఏర్పడిన సంస్థలుగా పరిగణిస్తారు. ఇవి చట్టబద్ధంగా ఏర్పడినవి కావు. వాణిజ్య రంగంలో కూడా చట్టవిరుద్ధంగా ఏర్పడిన సంస్థల సంఖ్య తగ్గిపోయిందని ఎన్ఎస్ఒ తెలిపింది. 2015 జులై-2016 జూన్ మధ్యకాలంలో 2.30 కోట్ల సంస్థలు ఉంటే 2022 అక్టోబర్-2023 సెప్టెంబర్ నాటికి వాటి సంఖ్య 2.25 కోట్లకు తగ్గింది. ఈ రంగంలో పనిచేసిన కార్మికుల సంఖ్య స్వల్పంగా... 3.87 కోట్ల నుంచి 3.9 కోట్లకు పెరగడం గమనార్హం.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా గంట్యాడ మండలం వసాది గ్రామంలో సోమవారం మధ్యాహ్నం పిడుగుపడి వ్యక్తి మృతి చెందారు. పోలీసులు కథనం ప్రకారం.. బోధంకి ఎర్నాయుడు (47) పొలంలో దొంకలు కొడుతుండగా సమీపంలో పిడుగు పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు విజయనగరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆయన మృతి చెందాడు. ఎర్నాయుడుకు భార్య సూర్యడమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

శ్రీలంక అదుపులో 22 మంది తమిళజాలర్లు

చెన్నై : తమిళనాడుకు చెందిన 22 మంది జాలర్లను శ్రీలంక నేవీ తాజాగా అరెస్ట్ చేసింది. సరిహద్దు దాటి చేపల వేట సాగించారనే కారణంగా నేదుండివు సమీపంలో వారిని అదుపులోకి తీసుకుని.. మూడు బోట్లను స్వాధీనం చేసుకుంది.

పెనుకొండలో మట్టి మాఫియా

- జగనన్న కాలనీలో యథేచ్ఛగా గ్రావెల్ దోపిడీ
- తవ్వకాలతో కాలనీలో ఏర్పడిన పెద్దపెద్ద గోతులు

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో 29 ఎకరాల్లో 1100 ఇళ్లు పేదలకు ప్రభుత్వం మంజూరు చేసింది. గూడులేని నిరుపేదలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీ పక్కనే ప్రభుత్వ భూమి ఉంది. దీంతో అక్రమ మట్టి వ్యాపారులు ఈ భూమిపై కన్ను పడింది. జెసిబిలతో పట్టపగలే ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేసి దర్జాగా తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడు మట్టి రూ.1000 నుంచి రూ.1200 వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

స్పందించని అధికారులు

లేఅవుట్ నుంచి మట్టి తరలింపుపై లబ్ధిదాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదు. గనులు, రెవెన్యూ శాఖ అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలున్నాయి.

ప్రమాదాలకు నిలయంగా..!

లేఅవుట్‌లో కొన్ని చోట్ల ఆరు నుంచి ఎనిమిది అడుగుల లోతు వరకు మట్టి తవ్వేయడంతో ప్రమాదాలకు నిలయంగా కాలనీ మారిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. కొందరు అధికారులు అక్రమ మట్టి వ్యాపారస్తులతో ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణలు సైతం వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైన జిల్లా అధికారులు అక్రమ మట్టితవ్వకాలపై దృష్టి సారించి అడ్డుకట్టవేయాలని, కాలనీలో ఏర్పడిన గోతులను పూడ్చి వేసి ప్రమాదాలు ఆరికట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం

అక్రమ మట్టితవ్వకాలపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తహాశీల్దార్ ఉదయశంకరరాజు అన్నారు. అక్రమ మట్టి తరలింపు ఫిర్యాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, సిబ్బంది వెళ్లేలోపు అక్కడి నుంచి అక్రమార్కులు పారిపోతున్నారని వివరించారు. అనుమతులు లేకుండా అక్రమ మట్టి, గ్రావెల్ త్వకాలు చేస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామనిహెచ్చరించారు.

ఉదయశంకర్ రాజు, తహాశీల్దార్ పెనుకొండ.

ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

ORIX

(గతంలో ఓయిస్ ఆటో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పేరుగలది) (ప్రత్యామ్నాయంగా ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్)
రిజిస్టర్డు ఆఫీసు: ప్లాట్ నం.94, మారోల్ కొఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్, అంధేరికుర్ల రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి400 059.
Tel.: + 91 22 2859 5093 / 6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937

అనుబంధరా4-ఎ (రూల్ 8(6)కు నియమాలను చూడండి)

స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల వేలం అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన. ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు & హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్‌చేయబడినది. దేనినైతే, సెక్యూర్డ్ క్రెడిటర్ అనగా., ఆరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచేత భౌతికంగా స్వాధీనంచేసుకోబడినది. ఇందు దిగువ పేర్కొన్నట్లు రుణగ్రహీతలు& సహ-రుణగ్రహీతలు నుండి ఆరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ కు బకాయిగా ఇందు దిగువ పేర్కొన్న మొత్తాల రికవరీ కొరకు **01.08.2024** న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన బహిరంగ వేలం ద్వారా విక్రయించబడుతుంది. రిజర్వు ధర & ధరావత్తు డిపాజిట్ (ఇఎండి) ఇందు దిగువ పేర్కొనబడినవి.

రుణగ్రహీతలు & సహారుణగ్రహీతల పేరు / బకాయి మొత్తాలు / డిమాండ్ నోటీసే తేది	ఆస్తి వివరాలు	రిజర్వు ధర (రూ) / ధరావత్తు / బిడ్ పెంపుదల మొత్తాలు
• చిన్న బాబా వలి తమ్మ • తుమ్మ వేంకటేశ్వర్లు • తమ్మ చిన్నబాబా వలి ఫిష్ కంపెనీ • తమ్మ జాలమ్మ • అంక నాగరాజు తమ్మ	శారదా హాస్పిటల్ దగ్గర, తెనాలి మున్సిపాలిటీ, తెనాలి, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522201 వద్ద అసెస్మెంట్ నం.6943, బ్లాక్ నం.3, వార్డు నం.4, ఎన్.టి.ఎస్.నం.201 వద్ద 89చ.గ.లు లేదా 74.41చ.మీ.ల విస్తీర్ణంతో డోర్ నం.15-9-40 యొక్క ఆస్తి యొక్క మొత్తం భాగం. మరియు **సరిహద్దులు: తూర్పు:** షేక్ కరీం & షేక్ సలీమ్ గోడ-26'6", **పడమర:** మున్సిపల్ రోడ్ 26'6", **దక్షిణం:** డోర్ నం.15-9-41 ఆస్తి-30'6", **ఉత్తరం:** షేక్ రహెమాన్ గోడ 30'6".	రూ.60,00,000/- (రూపాయలు అరవై లక్షలు మాత్రమే)
17.06.2024 నాటికి రూ.66,19,889.25/-		10% ధరావత్తు రూ.6,00,000/- (రూపాయలు ఆరు లక్షలు మాత్రమే)
డిమాండ్ నోటీసు తేది: 29.11.2022		బిడ్ పెంపుదల మొత్తాలు రూ.50,000/- (యాభై వేలు మాత్రమే)

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, దయచేసి ఆరిక్స్ లీజింగ్& ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ అనగా., **https://www.orixindia.com/leasing.php** లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి లేదా సంప్రదించండి: అధీకృత అధికారి శ్రీ తిరునగిరి జగన్నాధం దీక్షిత్ (సంప్రదించాల్సిన వివరాలు: +91-8328462543)ని సోమవారం నుండి శనివారం వరకు పనివేళల్లో సంప్రదించవచ్చును.

సం/-
అధీకృత అధికారి,
ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్.
తేది: 25.06.2024

ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

SMFG Grihashakti
Nayi Asha. Naya Vishwas.

(గతంలో ఫుల్లెర్టాన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా పేరుగలది)
కార్పొరేట్ ఆఫీసు: 503&504, 5వ అంతస్తు, జి-బ్లాక్, ఇన్‌స్పైర్ బికెసి, బికెసి మెయిన్ రోడ్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఇ), ముంబయి-400 051, మహారాష్ట్ర.
రిజిస్టర్డు ఆఫీసు: మేఫ్ టవర్స్, 3వ అంతస్తు, పాత నం.307, కొత్త నం.165, పూనమల్లీ హై రోడ్, మదురవోయల్, చెన్నై-600 095, తమిళనాడు.

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") యొక్క నియమాల క్రింద.
క్రింది సంతకందారు ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో ఫులెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)(ఎస్ఎంఎఫ్‌జిఐహెచ్ఎఫ్‌సిఎల్) యొక్క అధీకృత అధికారిగా, వ్యవహరిస్తూ చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులు జారీచేసి రూల్ 3తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి **60 రోజుల్లోగా** సదరు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా దిగువ రుణగ్రహీతలను కోరబడినది. క్రింది సంతకందారు భావించునది ఏమనగా, రుణగ్రహీతలు డిమాండ్ నోటీసులను పొందుటకు నివారించారు, అందుకుగాను రూల్స్ ప్రకారం నోటీసును ఇంటి పరిసరాల్లో అతికించుట & ప్రచురించుట జరిపినారు. డిమాండ్ నోటీసులోని విషయాలు ఇందు దిగువ వివరించబడినవి:

క్ర.సం.	రుణ ఖాతా నం. & రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతల/ఆస్తి యజమానుల పేరు	సెక్యూర్డ్ అసెట్స్/ తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ	సెక్షన్ 3(2) క్రింద డిమాండ్ నోటీసు తేది& పూర్తి బకాయి మొత్తాలు
1	ఎల్ఏఎన్: 605739211398213. 1) మామునూరు రాజ్యలక్ష్మి, 2)మామునూరు వెంకట సూర్యప్రకాశ రావు, **చిరునామా:** డోర్ నం.3-62, ఎస్ఎస్ఎస్ కాలనీ, గొల్లపూడి, విజయవాడ, ల్యాండ్ మార్క్, కన్వెన్షనల్ హాలు ఎదురుగా, కృష్ణా, ఆం.ప్ర.-521 225.	**షెడ్యూలు-ఏ:** కృష్ణా జిల్లా, కంకిపాడు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు యొక్క న్యాయ పరిధిలో కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం లో మద్దూరు గ్రామ పంచాయతి, డోర్ నం.2-52 సమీపాన ఆర్.ఎస్.నం.106/2 లో 1694.0చ.గ.ల విస్తీర్ణపు సైటు. సరిహద్దులు: పై సరిహద్దుల్లో 1694.0చ.గ.లకుగాను 56.46చ.గ.లు లేదా 47.21చ.మీ.లకు సమానమైన విస్తీర్ణంతో విడదీయలేని ఉమ్మడి భాగం. **సరిహద్దులు: తూర్పు:** పడవల వెంకట రమణ ఆస్తి; **దక్షిణం:** ఆర్& బి రోడ్డు; **పడమర:** యనమదాల మధుబాబు ఆస్తి; **ఉత్తరం:** యనమదాల మధుబాబు ఆస్తి. **షెడ్యూలు-బి: "శ్రీ శిర్డీ సాయి హైట్స్"** గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నం.105లో సైటు విస్తీర్ణం 56.46చ.గ.లు లేదా 47.21చ.మీ.లు, డోర్ నం.2-52 దగ్గర, 910చ.అ.లు ప్లింత్ ఏరియా & 240చ.అ.ల ఉమ్మడి ఏరియా, 100చ.అ.ల పార్కింగ్ ఏరియాతోపాటు డోర్స్, ఫిక్సర్స్& అన్ని ఇతర వసతులు మొ॥వాటితోసహా. **సరిహద్దులు: తూర్పు:** ఒపెన్ టు స్కై; **దక్షిణం:** ఒపెన్ టు స్కై; **పడమర:** ఉమ్మడి కారిడార్; **ఉత్తరం:** ఒపెన్ టు స్కై.	**తేది:** 11.06.2024. **08.06.2024** నాటికి రూ. **27,92,444.67పై.లు (రూపాయలు ఇరువై ఏడు లక్షల తొంబై రెండు వేల నాలుగు వందల నలభై నాలుగు మరియు అరవై ఏడు పైసలు మాత్రమే).** ఎన్‌పిఏ తేది: 05.06.2024.

రుణగ్రహీతలను డిమాండ్ నోటీసులతో అనుసరించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది మరియు చెల్లింపుల రియలైజేషన్ తేదీ వరకు వర్తించబడు వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ చార్జీలు, ఖర్చులు మరియు వ్యయాలతోపాటు ఈ ప్రచురణ తేది నుండి **60 రోజుల్లోగా** ఇందు పై పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. రుణగ్రహీతలు గమనించాల్సింది: రుణగ్రహీతలచే తాకట్టుపెట్టిన సెక్యూర్డ్ అసెట్స్‌గా స్థిరాస్తి/ఆస్తుల పై సెక్యూర్డ్ డెట్స్‌ను రుణగ్రహీతలచేత సెక్యూర్డ్ క్రెడిటర్ **ఎస్ఎంహెచ్ఎఫ్‌సి** నుండి రుణ మొత్తాలను పొందియున్నారని దయచేసి గమనించండి. రుణగ్రహీతలు నిర్ణీత సమయంలోగా పూర్తిగా బకాయిలను చెల్లించుటలో విఫలంచెందినందున, **ఎస్ఎంహెచ్ఎఫ్‌సి** సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొనుటకు, చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద హక్కులన్నింటిని వినియోగించుకొనుటతో రియలైజ్ చెల్లింపుల క్రింద చట్టం మరియు రూల్ క్రింద అందుబాటులోగల ఇతర రెమిడీ యొక్క ఇన్‌వోకింగ్ ద్వారా లేదా అమ్మకం రూపేనా దానిని బదిలీచేయుటకు అరుమతించబడరు. **ఎస్ఎంహెచ్ఎఫ్‌సి** అమ్మకం లేదా బదిలీకు అధికారాలను వినియోగించుటకు ముందు సెక్యూర్డ్ అసెట్స్‌ను అటాచ్& లేదా సీలు చేయు అధికారాలు కూడా కలిగియున్నారు. అదే విధంగా సెక్యూర్డ్ అసెట్స్ అమ్మకం జరుపబడును. మిగతా బకాయిల ను రాబట్టుటకు విడిగా లీగల్ ప్రొసీడింగ్స్ ప్రారంభించుటకు కూడా **ఎస్ఎంహెచ్ఎఫ్‌సి** అధికారాలు కలిగియుంటుంది. తాకట్టుపెట్టిన ఆస్తుల విలువ విషయంను **ఎస్ఎంహెచ్ఎఫ్‌సి** కు బకాయిల క్రింద చెల్లించబడును. దీనికి తోడు ఏదేని ఇతర చట్టం క్రింద **ఎస్ఎంహెచ్ఎఫ్‌సి** కు అందుబాటులోగల అన్ని ఇతర రెమెడీసును స్వతంత్రను పాటించును.
సెక్యూర్డు అసెట్సును విడిపించుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షను 13(8)పై మరియు తదుపరి చట్టం యొక్క సెక్షను 13(13)కు తదుపరి రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది, ఏదైతే **ఎస్ఎంహెచ్ఎఫ్‌సి** యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేనిదే, సెక్యూర్డు అసెట్సు దేనినైనా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాల (వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో ఇతరత్రా) రూపేనా బదిలీచేయుట లేదా సెక్యూర్డు అసెట్సుతో లావాదేవీలు జరుపుట లేదా కూల్చుట నుండి రుణగ్రహీత నిషేధింపబడినారు మరియు పై విధానాన్ని పాటించనియో, సదరు చట్టం యొక్క సెక్షన్ 29 క్రింద శిక్షకు గురికాగలరు. డిమాండ్ నోటీసు కాపీని క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును మరియు రుణగ్రహీతలు దానిని అవసరమనుకొంటే క్రింది సంతకందారు నుండి ఏదేని పనిదినమున పనివేళల్లో సేకరించవచ్చును.

సం/-
అధీకృత అధికారి,
ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
(గతంలో ఫుల్లెట్రన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
ప్రదేశం: కృష్ణా, ఆం.ప్ర.
తేది: 11.06.2024.

ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

ORIX

(గతంలో ఓయిస్ ఆటో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పేరుగలది) (ప్రత్యామ్నాయంగా ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్)
రిజిస్టర్డు ఆఫీసు: ప్లాట్ నం.94, మారోల్ కొ-ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్, అంధేరి-కుర్ల రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి-400 059.
Tel.: + 91 22 2859 5093 / 6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమాలను చూడండి)
ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకపు నియమ & నిబంధనలు: 1) ఆస్తి అనునది "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలాగే మరియు రికోర్స్ ప్రాతిపదికన" విక్రయించబడుతుంది. అట్టి అమ్మకం ఏలాంటి వ్యారంటీలు& ఇండెమినిటీస్‌లు లేకుండా నిర్వహించడుతుంది. **2)** ఆస్తి/ అసెట్స్ వివరాలు (అనగా., విస్తీర్ణం& కొలతలు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తెలిసినంత వరకు ఇ-వేలం అమ్మకం ప్రకటనలో సూచించబడినవి మరియు సెక్యూర్డ్ క్రెడిటర్ ఏవేని లోపాలు, తప్పులకు జవాబుదారు కారు. వాస్తవ విస్తీర్ణం& కొలతలలో మార్పులుఉండవచ్చు. **3)** ఇ-వేలం అమ్మకం ప్రకటన అనునది సర్వజనులు వారి బిడ్స్‌ను దాఖలుచేయుట కొరకు సెక్యూర్డ్ క్రెడిటర్‌చే జారీచేయబడినది మరియు అందుకు సెక్యూర్డ్ క్రెడిటర్ ఏదేని కమిట్‌మెంట్ లేదా ఏదేని బాధ్యత తీసుకోరు. ఆసక్తిగల బిడ్డరుదారులకు సలహా ఇవ్వడమేమనగా, బిడ్స్ దాఖలుచేయుటకు ముందుగానే ఆస్తికి సంబంధించిన టైటిల్ డీడ్స్/ఆస్తి/ఆస్తుల ప్రస్తుత షరతులు/ ఆస్తిని ప్రభావితంచేయు క్లెయిం/బకాయిల కాపీలు మరియు ఆస్తిత తగిన విచారణలు/ ఏవేని ఉన్నచో స్వతంత్రంగా విచారణ జరుపుకొని సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బిడ్స్ దాఖలుడచేయవలెను. **4)** వేలం/బిడ్డింగ్ కేవలం "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ విధానం" ద్వారా వెబ్‌సైట్ https://bankauctions.com ద్వారా లేదా సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ సి1 ఇండియా లిమిటెడ్, ఎవరైతే ఇ-వేలం ప్లాట్‌ఫారం ద్వారా వేలం యొక్కఅన్ని ఏర్పాట్లును నిర్వహిస్తున్నారో వారు వేలం నిర్వహించడుతుంది. **5)** బిడ్డరుదారులు వారు ఉన్నచోటు నుండే బిడ్డింగ్ కొరకు ఇ-వేలంలో పాల్గొనువచ్చును. ఇంటర్నెట్ సదుపాయంను బిడ్డరుదారులు తమకుతాముగా సమకూర్చుకోవలెను. ఇంటర్నెట్ కనెక్టివిటీ, నెట్‌వర్క్ సమస్యలు, స్వంత సిస్టమ్ క్రాష్, పవర్ ఫెయిలూర్ మొ॥వాటిపట్ల సెక్యూర్డ్ క్రెడిటర్/ సర్వీస్ ప్రొవైడర్ బాధ్యులు కారు. **6)** వివరాలు, సహకారం, విధానం మరియు ఇ-వేలం పై ఆన్‌లైన్ బిడ్డింగ్ కొరకు, నిర్ణీత బిడ్డరుదారులు సంప్రదించండి: మెసర్స్‌సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నెం.68, 3వ అంతస్తు, సెక్టార్ 44, గుర్గామ్, హర్యానా-122003 (సంప్రదించు నెం.: 7291981124, 25,26) సపోర్టు ఇమెయిల్: Support@bankeauctions.com శ్రీ. వినోన్ చౌహన్, మొబైల్ నెం.9813887931, ఇమెయిల్ ఐడి: delhi@c1india.com వారిని సంప్రదంచవచ్చును. **7)** ఇ-వేలం అమ్మకంలో పాల్గొనుట కొరకు ఆసక్తిగల బిడ్డరుదారులు వారి పేర్లను తప్పనిసరిగా https://www.bankauctions.com వద్ద నమోదుచేసుకోవలసిందిగా కోరబడుచున్నది అదే విదంగా ముందుగానే వారి యూజర్ ఐడి& పాస్‌వర్డ్‌ను పొందవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది. **8)** ఇ-వేలంలో పాల్గొనుట కొరకు, ఆసక్తిగల బిడ్డరుదారులు తిరిగి ఇవ్వబడు ధరావత్తు (ఇఎండి) రిజర్వు ధరలో 10%ను (పై పేర్కొన్నట్లుగా)ను ఆసక్తిగల బిడ్డరుదారులు **25 జూలై, 2024**న లేదా ముందుగా "హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరున డిమాండ్ డ్రాఫ్టు/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా చెల్లించవలెను. **9)** ఆసక్తిగల బిడ్డరుదారులు బిడ్డు ఫారం (ఫార్మాట్ https://www.bankauctions.comలో లభించును) డిమాండు డ్రాఫ్టుతోపాటు సీల్డు కవరులో అధీకత అధికారి, హెచ్‌హెచ్ఎఫ్ బ్రాంచ్‌ఆఫీసు, హిందూజాహౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.54-20-10/ఏ, 3వ అంతస్తు, గురునానక్ కాలనీ, మెయిన్ రోడ్, ఎస్‌బిఐ బ్యాంకు ఎదురుగా, విజయవాడ, క్రిష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్-520007 వద్ద **25 జూలై, 2024 సా॥ 05:00గం.లలోగా** దాఖలుచేయవలెను. పై పేర్కొన్నట్లుగా "ఆస్తి కొరకు రుణ ఖాతానెం.లో ఇవేలం అమ్మకం లో పాల్గొనుట కొరకు బిడ్స్"గా వ్రాసిన వారి బిడ్స్‌ను సీల్డు కవరులో పెద్ద అక్షరాలలో వ్రాసి దాఖలుచేయవలెను. **10)** ధరావత్తుతో బిడ్డు దాఖలుచేయుటకు చివరి తేది ముగిసిన తరువాత, అధీకృత అధికారి అతనిచే స్వీకరించబడిన బిడ్డును పరిశీలించి మరియు అర్హతగల బిడ్ల వివరాలను ఆమోదిస్తారు (ఎవరైతే వారి బిడ్స్ పైన రిజర్వు ధరకు మించిన& సూచించిన ధరావత్తుతో సెక్యూర్డ్ క్రెడిటర్‌కు) సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ అనుమతిస్తారు వారు మాత్రమే ఇ-వేలం అమ్మకపు ప్రకటనలో ఇవ్వబడిన తేది మరియు సమయమున ఆన్‌లైన్ ఇంటర్‌సే బిడ్డింగ్/వేలం ప్రక్రియల్లో పాల్గొనవలసి ఉంటుంది. **11)** అర్హతగ బిడ్డరుదారులచే ఇంటర్‌సే బిడ్డింగ్ ద్వారా గరిష్ట ధర కోట్‌చేసిన అర్హత గల బిడ్డర్లు నుండి ఇంటర్ సె బిడ్డింగ్ ప్రక్రియ కొనుసాగునప్పుడు ప్రతి 10 నిమిషాల అపరిమిత పొడిగింపు ఉంటుంది. అనగా, ఇ-వేలం సమయం ముగింపు చివరి క్షణాల్లో బిడ్‌వేయబడినచో ప్రతిసారి 10 నిమిషాలు పొడిగింపు ఉంటుంది. **12)** ఒకసారి వేసిన తరువాత బిడ్‌ను మార్చుకోలేరు లేదా ఉపసంహరించుకోలేరు. అన్ని బిడ్స్ బిడ్డరుకు ఇవ్వబడిన యూజర్ ఐడి నుండి చేసినవిగా భావించబడును. **13)** ఇ-వేలం ప్రక్రియ ముగిసిన వెంటనే, గరిష్ట బిడ్డరుదారుగా వారిచే కోట్‌చేయబడిన బిడ్ తుది మొత్తాలను ఇ-మెయిల్ ద్వారా బిడ్డరుదారుకు మరియు అధీకృత అధికారి, హిందూజాహౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్- రీజినల్ ఆఫీసు: డోర్ నెం.54-20-10/ఏ, 3వ అంతస్తు, గురునానక్ కాలనీ, మెయిన్ రోడ్, ఎస్‌బిఐ బ్యాంకు ఎదురుగా, విజయవాడ, క్రిష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్-520007 వారికి కూడా తెలియజేయబడుతుంది మరియు గెలుపొందిన బిడ్డరుదారుగా ప్రకటన పొందుట కొరకు సర్వీస్ ప్రొవైడర్‌తో ఇ-వేలం అమ్మకం ప్రక్రియల్లో పాల్గొనవలెను. **14)** గెలుపొందిన బిడ్డరు వెంటనే అదే రోజున బిడ్ మొత్తాలు (ధరావత్తుతో కలిపి) 25%ను డిపాజిట్ చేయవలెను, మిగతా మొత్తాలను హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున డిడి/పే ఆర్డర్/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్/చెక్కు ద్వారా అమ్మకం తేదీ నుండి 15 రోజుల్లోగా మిగతా 75% ను డిపాజిట్ చేయవలెను. **15)** గెలుపొందిన బిడ్డరుదారు/వేలం కొనుగోలుదారుచే నిర్ణయించిన 15 రోజుల్లోగా చెల్లింపులుచేయుటలో విఫలం చెందినచో, అమ్మకం రద్దు చేయబడుతుంది మరియు ఇప్పటి వరకు చెల్లించిన మొత్తాలు (ధరావత్తుతో కలిపి) జప్తు చేయబడుతుంది మరియు ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది. **16)** గెలుపొందిన బిడ్డరుదారు అభ్యర్థన మేరకు, అధీకృత అధికారికి బిడ్ మొత్తాలలో మిగతా మొత్తాన్ని ఎప్పటి వరకు చెల్లిస్తారో వ్రాతపూర్వకంగా వ్రాసి ఇవ్వవలసి ఉంటుంది. **17)** గెలుపొందిన బిడ్డరుదారు టిడిఎస్ (అమ్మకపు ప్రక్రియలకుగాను) అమ్మకం ధరలో 1% చెల్లించవలెను, ఆఫర్ ఆమోదించబడిన 15 పనిదినముల్లోగా లేదా అట్టి పొడిగింపు రోజుల్లోగా ధరావత్తు అధీకృత అధికారిచే సర్దుబాటు చేయబడుతుంది. విఫలం చెందినచో, ధరావత్తు జప్తు చేయబడుతుంది. **18)** మున్సిపల్/పంచాయత్ పన్నులు, విద్యుత్ బకాయిలు (ఏవేని ఉన్న) మరియు ఏవేని ఇతర బకాయిలను అమ్మకం సర్టిఫికేట్ జారీచేయుటకు ముందే గెలుపొందిన బిడ్డరుదారుచే చెల్లిచవలసి ఉంటుంది. ఆస్తికి సంబంధించి అన్ని చట్టబద్ధమైన బకాయిలను బిడ్డను తీసుకునే సమయంలో పరిగణలోకి తీసుకోబడును. **19)** గెలుపొందిన బిడ్డరుదారు పేరున మాత్రమే అమ్మకం సర్టిఫికేట్ జారీ చేయబడుతుంది వారి పూర్తి కొన్న ధర/బిడ్ మొత్తం డిపాజిట్‌చేసిన వారుగా ఉంటారు మరియు వారు అవసరమైన రుజువులు అన్ని పన్నులు/ఛార్జీలుకు సంబంధించి రుజువులు దాఖలుచేయాల్సి ఉంటుంది. **20)** వేలం కొనుగోలు ద్వారా కన్వేయెన్స్, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు మరియు ఇతర ఇన్సిడెంటల్ ఛార్జీలను భరించవలసి ఉంటుంది. **21)** అధీకృత అధికారి ఏవేని కారణాలు చూపకుండానే ఇ-వేలం అమ్మకం ప్రక్రియలను వాయిదావేయుట/రద్దుచేయవచ్చును. ఇ-వేలం అమ్మకం షెడ్యూలు వాయిదా పడిన విషయంలో తరువాతి రోజున అమ్మకం షెడ్యూలు తేది నుండి 30 రోజుల ముందుగా, దీనిని సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ పై ఉంచబడుతుంది. **22)** అధీకృత అధికారి నిర్ణయమే తుది నిర్ణయం, దానికి అందరు కట్టుబడియుండవలెను మరియు ప్రశ్నించటానికి వీలు ఉండదు. **23)** బిడ్డరుదారులందరు వారిచే ఇ-వేలం అమ్మకం యొక్క నియమ& నిబంధనలను క్షుణ్ణంగా చదివి మరియు అర్ధంచేసుకొని బిడ్స్ దాఖలుచేయవలెను. **24)** తదుపరి వివరాలు మరియు సందేహాలు కొరకు, సంప్రదించండి: అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎం. రామకృష్ణ మూర్తి, మొబైల్ నెం.9515154512. **25)** ఈ ప్రచురణ కూడా పైన పేర్కొన్న తేదీ/స్థలంలో వేలం విక్రయాన్ని నిర్వహించడం గురించి సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) ప్రకారం, పైన పేర్కొన్న లోన్ ఖాతా యొక్క రుణగ్రహీత / తాకట్టుడదారు/ హామీదారులకు 30 (ముప్పై) రోజుల నోటీసుగా ఉంటుంది.

తేది: 25 జూన్, 2024 , ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, శ్రీ.సిగా నరేష్ (సిఎల్ఎం), హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రత్యేక సూచనలు/హెచ్చరికలు: చివరి నిమిషాలు/సెకన్లలో బిడ్డింగ్‌ను బిడ్డర్లు వారి స్వంత ఆసక్తితో నివారించాలి. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ లేదా సర్వీస్ ప్రొవైడర్ అటువంటి సందర్భాలలో బిడ్డర్ యొక్క ఏదైనా లోపానికి (ఇంటర్నెట్ వైఫల్యం, విద్యుత్ వైఫల్యం మొదలైనవి) బాధ్యత వహించదు. అటువంటి ఆకస్మిక పరిస్థితులను నివారించడానికి, బిడ్డర్లు అవసరమైన అన్ని ఏర్పాట్లు /బ్యాకప్ విద్యుత్ సరఫరా వంటి ప్రత్యామ్నాయాలు & అవసరమైన ఏవైనా వాటిని చేయాలని అభ్యర్థించారు, తద్వారా వారు అటువంటి పరిస్థితిని అధిగమించి మరియు వేలంలో విజయవంతంగా పాల్గొనగలరు.




ప్రమాణ స్వీకారం చేస్తున్న కె రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్,



కలిశెట్టి అప్పలనాయుడు,



మిధున్‌రెడ్డి,



గురుమూర్తి,



తనూజరాణి

ఎంపిల ప్రమాణ స్వీకారం

- తెలుగులో 15 మంది.. ఇంగ్లీష్‌లో ఏడుగురు
- హిందీలో ఒకరు, సంస్కృతంలో ఒకరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

18వ లోక్‌సభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సోమవారం లోక్‌సభలో ప్రొటెం స్పీకరు భర్తృహరి మెహతాబ్ కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మెహతాబ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. మెహతాబ్ తొలుత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో ప్రమాణ స్వీకారం చేయించగా, తరువాత ప్రొటెం స్పీకర్ల ప్యానెల్ సభ్యులు రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తేతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కేంద్ర మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత రాష్ట్రాలకు చెందిన సభ్యుల ప్రమాణ స్వీకారం అక్షర క్రమంలో కొనసాగింది. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎంపిలు ప్రమాణ స్వీకారం చేయగా, మంగళవారం తెలంగాణ ఎంపిలు ప్రమాణ స్వీకారం చేస్తారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు.

తెలుగులో 15 మంది ప్రమాణ స్వీకారం

ఎపికి చెందిన ఎంపిల్లో ముగ్గురు మంత్రులు, 12 మంది ఎంపిలు తెలుగులోనూ, ఏడుగురు ఇంగ్లీష్‌లోనూ, ఒకరు హిందీ, ఒకరు సంస్కృతంలోనూ ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర మంత్రులు, టిడిపి ఎంపిలు కె రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బిజెపి ఎంపి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగులో టిడిపి ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, ఎం శ్రీభరత్, కేశినేని చిన్ని, లావు శ్రీకృష్ణదేవరాయలు, అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి, బికె పార్థసారథి, బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, దగ్గుమల్ల ప్రసాద్‌రావు, వైసిపి ఎంపి గురుమూర్తి, బిజెపి ఎంపి పురందేశ్వరి, జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి ప్రమాణ స్వీకారం చేశారు. వైసిపి ఎంపి తనూజరాణి హిందీలోనూ, టిడిపి ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ సంస్కృతంలోనూ ప్రమాణ స్వీకారం చేశారు.

ఏడుగురు ఎంపిలు ఇంగ్లీష్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. 25 మంది ఎంపిలకు 24 మంది ప్రమాణ స్వీకారం చేయగా, కడప ఎంపి అవినాష్ రెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కేంద్ర మంత్రి, బిజెపి ఎంపి జి కిషన్ రెడ్డి, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పంచకట్టుతో ప్రమాణ స్వీకారం చేశారు. కలిశెట్టి అప్పలనాయుడు పసుపు రంగు కుర్తా, పైజామాతో పసుపు రంగు సైకిల్ తొక్కుకుంటూ ఢిల్లీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నివాసం (అశోక్ రోడ్డు 50) నుంచి పార్లమెంటుకు చేరుకున్నారు.



పార్లమెంటుకు ట్రాక్టర్‌పై సిపిఎం ఎంపి అమ్రారామ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతు నేత, సిపిఎం ఎంపి అమ్రారామ్ పార్లమెంటుకు ట్రాక్టర్‌పై వెళ్లారు. సోమవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సిపిఎం తరపున గెలిచిన అమ్రారామ్ పార్లమెంటుకు ట్రాక్టర్‌పై వెళ్లారు. వ్యవసాయ పనుల్లో కీలక భాగస్వామి అయిన ట్రాక్టర్ రైతు పనిముట్టుగా తయారైంది. ఇటీవల కాలంలో దేశంలో జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటంలో రైతులతో పాటు ట్రాక్టర్లు వేలాదిగా పాల్గొన్నాయి. రైతులు తమతోపాటు ట్రాక్టర్లు తీసుకొచ్చి ఆందోళనలు చేపట్టారు. అప్పుడు కొన్నాళ్ళు ఢిల్లీలోని పార్లమెంట్, ఇండియా గేట్, కేంద్ర మంత్రిత్వశాఖ కార్యాలయాలున్న ప్రాంతాల్లో ట్రాక్టర్లను నిషేధించారు. అప్పటి నుంచి మోడీ సర్కార్‌లో ట్రాక్టర్ అంటే భయం పట్టుకుంది. అలాంటి ట్రాక్టర్‌పై సిపిఎం లోక్‌సభ ఎంపి అమ్రారామ్ పార్లమెంటుకు రావడం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. అక్కడ ఉన్న అనేక మంది ట్రాక్టరుపై వచ్చిన ఎంపిని చూస్తూ అభినందనలు తెలిపారు. ట్రాక్టర్‌పై అమ్రారామ్ పార్లమెంటుకు చేరుకోగానే భద్రతా సిబ్బంది ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. పార్లమెంటు లోపలకి వెళ్లడానికి లేదని పోలీసులు అడ్డుకుంటే, ఎంపి అమ్రారామ్ ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. ఒకప్పుడు నిరసన తెలుపుతూ పార్లమెంటుకు ఎడ్లబండి మీద వెళ్లిన ఘటనలు ఉన్నాయి. దేశంలోని రైతు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజుల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా ట్రాక్టరుపై పార్లమెంటుకు వచ్చారు. అయితే ఆయనను కూడా పార్లమెంటు గేటు వద్దనే పోలీసులు అడ్డుకున్నారు.

కొనసాగుతున్న ఢిల్లీ మంత్రి అతిషి నిరాహారదీక్ష

న్యూఢిల్లీ : నీటి కొరతతో అల్లాడుతున్న ఢిల్లీకి నీటిని విడుదల చేయకుండా బ్యారేజీ గేట్లను హర్యానా ప్రభుత్వం మూసివేసిందని ఢిల్లీ మంత్రి అతిషి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీకి నీటి పంపిణీ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలంటూ అతిషి చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం నాలుగోరోజూ కొనసాగింది. హత్నికుండ్ బ్యారేజీలో అదనపు నీరు ఉన్నప్పటికీ.. హర్యానా ప్రభుత్వం 28 లక్షల మంది ప్రజలను కష్టాల్లోకి నెట్టిందని అతిషి అన్నారు. ఢిల్లీకి చట్టపరమైన వాటా వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని అతిషి స్పష్టం చేశారు.

బైజూస్‌లో రూ.4వేల కోట్లు హుష్..

- నిండా మునిగిన నెథర్లాండ్ కంపెనీ

బెంగళూరు : కరోనాకు ముందు ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో రూ.4వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రోసస్ ఎన్‌వి నిండా మునిగినట్లు ప్రకటించింది. 2018లోని తమ పెట్టుబడులు ఇప్పుడు సున్నా విలువకు పడిపోయినట్లు తెలిపింది. తాము బైజూస్‌లో పెట్టిన పెట్టుబడుల వాటాను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. బైజూస్ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్ అంచనాలకు సంబంధించి తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆ సంస్థ విలువను తాము సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ తెలిపింది. తద్వారా తమకు 493 మిలియన్ డాలర్లు (రూ.4వేల కోట్లు) మేర నష్టం వాటిల్లినట్లు ఆ కంపెనీ పేర్కొంది.

కేసు కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల లడ్డు కౌంటర్ల నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించాలంటూ నవీన్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి సోషల్ మీడియాలో చేసిన పోస్టు ఆధారంగా తిరుపతి టూ టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. నేరపూరిత ఉద్దేశం లేకుండా సదుద్దేశంతో ఏదైనా వార్తను వ్యాప్తి చేసినప్పుడు దాని ఆధారంగా కేసు నమోదు చేయడం సబబు కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి తీర్పు వెలువరించారు.

కేసులు ఎత్తేయండి

- మంత్రులకు ఎపిసిఎస్‌ఇఎ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో ఎపిసిపిఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలని ఎపిసిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పలువురు మంత్రులను కోరారు. సోమవారం సచివాలయంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎం.రవికుమార్, అధ్యక్షులు కె.సతీష్, ప్రధాన కార్యదర్శి ఎం.సి.దాస్, ఉపాధ్యక్షులు నాగదుర్గారావు తదితరులు మంత్రులు లోకేష్, కొలుసు పార్థసారథి, వంగలపూడి అనిత, ఆనం రాంనారాయణరెడ్డి, టిజి భరత్, వాసంశెట్టి సుభాష్, ఎస్.సవితను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో తమపై 1,600 కేసులకుపైగా పెట్టారని, వాటిని ఎత్తేయాలని విజ్ఞప్తి చేశారు.

బీహార్‌లో నీట్-యుజి ప్రశ్నాపత్రం లీక్

- లభించిన ఆధారాలు
- పాట్నాకు సిబిఐ బృందం

పాట్నా : బీహార్‌లో నీట్-యుజి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందని రూఢీ అయింది. ప్రశ్నాపత్రం ఫొటోకాపీ ఒక దానిని కొందరు వ్యక్తులు తగలబెట్టారు. ఆ చెత్తను బీహార్ ప్రభుత్వ ఆర్థిక నేరాల విభాగం క్షుణ్ణంగా పరిశీలించగా ప్రశ్నాపత్రంలో ఇచ్చిన 68 ప్రశ్నలు తగలబడిన ఫొటోకాపీలోనూ కన్పించాయి. ఈ సమాచారాన్ని బీహార్ ప్రభుత్వం కేంద్రానికి చేరవేసింది. తగలబడిన ప్రశ్నాపత్రంలో అధికారులకు పరీక్షా కేంద్రం కోడ్ కన్పించింది. అది సిబిఎస్‌ఇ అనుబంధ ఒయాసిస్ ప్రైవేటు పాఠశాలకు చెందినది. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఉన్న ఈ పాఠశాలలో పరీక్ష జరిగింది. ఈ ప్రశ్నాపత్రాన్ని ఓ ఇంటి నుండి బీహార్ పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు. తగలబడిన ఫొటోకాపీని, అసలైన ప్రశ్నాపత్రాన్ని, అందులోని ప్రశ్నలను సరిపోల్చేందుకు అధికారులు ఫోరెన్సిక్ లేబొరేటరీ సాయం తీసుకున్నారు. ఆర్థిక నేరాల విభాగం అందించిన సమాచారం ఆధారంగానే కేంద్ర విద్యాశాఖ విచారణను సిబిఐకి అప్పగించింది. పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకూ 18 మంది అరెస్టయ్యారు. ఫొటోకాపీలోని ప్రశ్నల వరుస సంఖ్యలు, ఒరిజనల్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నల వరుస సంఖ్యలు కూడా ఒకేలా ఉన్నాయి. పేపర్ ఎక్కడ, ఎప్పుడు లీకైందో తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అధికారులు రెండు రోజుల క్రితం ఒయాసిస్ పాఠశాలకు వెళ్లి ప్రశ్నాపత్రాలు ఉన్న పెట్టెలు, కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఓ కవరును తప్పుగా వేరే వైపు కత్తిరించారని వారు గుర్తించారు. పరీక్షా కేంద్రానికి చేరుకోక ముందే పేపర్లు లీక్ అయి ఉంటాయని పాఠశాల ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు.

బీహార్‌కు సిబిఐ బృందం

సిబిఐ బృందాలు సోమవారం బీహార్ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఇఒయు) కార్యాలయానికి చేరుకున్నాయి. నీట్ విచారణకు సిబిఐకి అప్పగించడానికి ముందు... ఇఒయు ఈ కేసులో దర్యాప్తు చేపట్టింది. ఇప్పటివరకు 18 మందిని అరెస్ట్ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇఒయు నుండి ఈ కేసుకి సంబంధించిన ఆధారాలను సిబిఐ సేకరించనుందని వారు పేర్కొన్నారు.

వలంటీర్లలో ఆందోళన

- పింఛను పంపిణీకి దూరం పెట్టిన ప్రభుత్వం
- న్యూస్ పేపర్ అలవెన్స్ రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆందోళన గ్రామ, వార్డు వలంటీర్లలో నెలకొంది. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుండి వారికి ఎటువంటి బాధ్యతలు అప్పచెప్పని ప్రభుత్వం తాజగా జులై ఒకటి నుండి ప్రారంభం కానున్న పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని నిర్ణయించింది. పింఛన్లను ఇళ్లవద్దే పంపిణీ చేయాలని నిర్ణయించినప్పటికీ, ఆ పనిని సచివాలయాల శాఖ ఉద్యోగులతో చేయించాలని సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఇదే సమయంలో ఇప్పటి వరకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విధుల్లో ఉన్న వలంటీర్లకు ప్రభుత్వం న్యూస్ పేపర్ అలవెన్స్ కింద ఒక్కొక్కరికి ప్రతి నెల చెల్లిస్తున్న రూ.200ల ను ప్రభుత్వం నిలిపి వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామ వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్, ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో జూలై నెలనుంచి సచివాలయశాఖ ఉద్యోగులు, వాలంటీర్లకు పేపర్ అలవెన్స్ నిలిచిపోయినట్లే. అలవెన్స్ నిలిపి వేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి సుమారు రూ.4నుంచి 5కోట్లు నిధులు పొదుపు చేసినట్లేననే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇది ఇలా ఉంటే సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా 2.63లక్షల మంది ఉన్న వలంటీర్లలో అధికారపార్టీ నేతల ఆదేశాలతో 1.09 లక్షల మంది స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. అయితే, ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే

వలంటీర్లకు నెలకు రూ.10వేలు గౌరవభృతిని ఇస్తామని టిడిపి ప్రకటించింది. అయితే, ఇప్పటి వరకు దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు బాధ్యతలను కూడా తప్పిస్తుండటం వారిని ఒత్తిడికి గురిచేస్తోంది. మరోవైపు అధికారపార్టీ నేతల వత్తిళ్లకు తలొగ్గి రాజీనామాలు చేశామని, తిరిగి తమకు అవకాశం కల్పించాలంటూ మంత్రులకు వినతి పత్రాలు అందించే వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది.

తక్షణమే జోక్యం చేసుకోలేం

- కేజ్రీవాల్ బెయిల్ స్టేపై సుప్రీం
- నా స్వేచ్ఛను ఎందుకు కుదిస్తున్నారో తెలియడం లేదన్న ఢిల్లీ సిఎం

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మంజూరు చేసిన బెయిల్‌పై స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకునేలా తక్షణమే జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు విముఖత వ్యక్తం చేసింది. ఎక్సైజ్ పాలసీ కేసులో తన వ్యక్తిగత స్వేచ్ఛను విచారణ కోర్టు పరిరక్షించినప్పటికీ తన స్వేచ్ఛను ఎందుకు కుదిస్తున్నారని కేజ్రీవాల్ ప్రశ్నిస్తున్నారు. "మేం ఆదేశాలు జారీ చేసినట్టైతే, ఈ అంశంపై ముందుగానే తీర్పునిచ్చినట్లవుతుంది." అని వెకేషన్ బెంచ్‌కు నాయకత్వం వహిస్తున్న జస్టిస్ మనోజ్ మిశ్రా వ్యాఖ్యానించారు.

"జూన్ 20న విచారణా కోర్టు నాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన సమస్య. ఢిల్లీకి ముఖ్యమంత్రిని నేను. నేనేమీ పరారీలో లేను, విదేశాలకు వెళతానేమోననే భయం లేదు. ఒకసారి మంజూరు చేసిన బెయిల్‌పై ఎందుకు స్టే విధిస్తున్నారు?" అని కేజ్రీవాల్ తరపు న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి ప్రశ్నించారు.

జూన్ 20న ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను ఇడి సవాలు చేసింది. ఆ వెంటనే తాత్కాలికంగా స్టే తెచ్చుకుంది. బహుశా మంగళవారం ఆయన బెయిల్‌పై తీర్పును హైకోర్టు ప్రకటించే అవకాశం వుందని ఇడి పేర్కొంది. దీనిపై తాము తీర్పు ఇచ్చేవరకు వేచి వుండాల్సిందిగా హైకోర్టు సుప్రీంను కోరింది. తాము వేచి వుండడమే సముచితమని జస్టిస్ మిశ్రా వ్యాఖ్యానించారు. 26వ తేదీకి విచారణను వాయిదా వేశారు.

అయితే వ్యక్తిగత స్వేచ్ఛను ప్రభావితం చేసే కేసులో ఉత్తర్వులను హైకోర్టు ఇలా రిజర్వ్ చేసుకోవడం అసాధారణంగా వుందని వెకేషన్ బెంచ్ అభిప్రాయపడింది. సాధారణంగా ఉత్తర్వులను రిజర్వ్ చేయరు. విచారణ ముగిసిన వెంటనే ఉత్తర్వులు వెలువడాలి. కానీ ఇది అసాధారణమైన తీరులో వుందని మిశ్రా పేర్కొన్నారు. హైకోర్టు పట్ల సుప్రీంకోర్టు ఎందుకు ఇంత విధేయతతో వుందనేది అర్థం కావడం లేదని సింఘ్వి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ట్రయల్ కోర్టు తన తీర్పును అప్‌లోడ్ చేసేవరకు వేచి వుండని హైకోర్టు విషయంలో ఎందుకు ఇలా వేచి వున్నారో తెలియడం లేదని పేర్కొన్నారు.

ప్రైమ్ మినిస్టర్ కాదు, క్రైమ్ మినిస్టర్

- నెతన్యాహుపై ఇజ్రాయిలీ ప్రజల ఆగ్రహం
- లక్షన్నర మందితో భారీ ర్యాలీ



టెల్ అవీవ్: గాజాలో జరుగుతున్న మారణహోమం నుంచి ఇజ్రాయిల్ వెనక్కి తగ్గేది లేదని ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించడంతో ఇజ్రాయిల్ ప్రజలు భారీ యుద్ధ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. 37వేల మందిని అమానుషంగా పొట్టనపెట్టుకున్న నెతన్యాహు ఇంకా నీ రక్త దాహం తీరలేదా అంటూ వారు నినదించారు. ఆదివారం టెల్ అవీవ్‌లో పెద్ద సంఖ్యలో గుమికూడిన ఇజ్రాయిలీ ప్రజలు నెతన్యాహు ప్రైమ్ మినిస్టర్ కాదు, క్రైమ్ మినిస్టర్ అన్న బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. లక్షన్నర మంది దాకా ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. నెతన్యాహు అంత చెత్త ప్రధానిని తానెన్నడూ చూడలేదని భద్రతా దళ మాజీ అధిపతి ఇవాన్ డిస్కిన్ అన్నారు.మనవడి భవిష్యత్తు కోసం తాను ఈ నిరసన ర్యాలీలో పాల్గొనడానికి వచ్చానని ఆయన తెలిపారు.నెతన్యాహు ప్రభుత్వాన్ని పడగొట్టక పోతే తమకే కాదు, తమ పిల్లలకూ భవిష్యత్తు ఉండదని 66 ఏళ్ల పాయ్ ఎరెల్ అన్నారు. నెతన్యాహు హయాంలో దేశంలో ప్రజాస్వామ్యం చచ్చిపోతోందంటూ టెల్ అవీవ్‌లోని డెమొక్రసీ స్క్వేర్‌కు ఎర్ర రంగు పులిమి నిరసన తెలిపారు. నెతన్యాహు తక్షణమే గద్దె దిగి, ఇజ్రాయిల్ పార్లమెంటుకు ఎన్నికలు జరపాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. గాజాపై దాడులను ఆపాలని కూడా వారు డిమాండ్ చేశారు. హమాస్ చేతిలో బందీలుగా చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా ఆయుధ సప్లై తగ్గిపోయింది: నెతన్యాహు

గత నాలుగు నెలలుగా అమెరికా నుండి ఆయుధాల రవాణా గణనీయంగా పడిపోయిందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. వారం వారం జరిగే కేబినెట్ సమావేశం ప్రారంభంలో మాట్లాడుతూ, ఆయుధాల సరఫరా తగ్గుదల గురించి బైడెన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇజాయిల్ రక్షణ మంత్రి ఆదివారం అమెరికాకు వెళ్లారు. నెతన్యాహు వ్యాఖ్యలను వైట్ హౌస్ అంత సీరియస్‌గా తీసుకోలేదు.

30కి పైగా రష్యా చమురు కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులు

కీవ్ : 30కి పైగా రష్యా చమురు ప్రాసెసింగ్, నిల్వ కేంద్రాలపై దాడులు చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ సోమవారం తెలిపారు. చమురు రిఫైనరీలు, టెర్మినల్స్, చమురు డిపోలు మొత్తంగా 30కి పైగా దాడులకు గురయ్యాయని జెలెన్స్కీ స్పెషల్ ఆపరేషన్స్ సెంటర్ అధికారులకు చెప్పారు. రష్యన్ ఆర్మీకి చమురు సరఫరాల్లో అడ్డంకులు కలిగించడమే ఈ దాడుల లక్ష్యంగా వుంది. తద్వారా రష్యా ఆదాయాలకు గండి కొట్టాలని ఉక్రెయిన్ భావిస్తోంది.

ఉక్రెయిన్ ఆయుధ నిల్వల కేంద్రంపై దాడి

ఉక్రెయిన్ సాయుధ బలగాలు ఉపయోగించే అతిపెద్ద ఆయుధ నిల్వల కేంద్రంపై రష్యా సైనిక దళాలు దాడి చేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. మానవ రహిత విమానాలు, క్షిపణులు, శతఘ్నులు, ఇతర వైమానిక బలగాలను ఉపయోగించి ఈ దాడి చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఆదివారం క్రిమియా ద్వీపకల్పంపై ఉక్రెయిన్ క్షిపణులతో దాడి చేసిన మరుసటి రోజే ఈ దాడి జరిగింది.

రష్యాలో మిలిటెంట్ల దాడులు

- 15మంది పోలీసు అధికారులు, పలువురు పౌరులు మృతి

మాస్కో : రష్యాలోని దక్షిణ రిపబ్లిక్ డాగెస్తాన్‌లో ఆదివారం సాయుధ మిలిటెంట్లు జరిపిన దాడిలో 15మందికి పైగా పోలీసు ఆఫీసర్లు, పలువురు పౌరులు మరణించారని డాగెస్తాన్ గవర్నర్ సెర్గి మెలికొవ్ సోమవారం తెలిపారు. మృతి చెందిన వారిలో క్రైస్తవ మతాధిపతి కూడా వున్నారు. రెండు ఆర్థడాక్స్ చర్చిలపై, యూదుల ప్రార్థనా మందిరంపై, రెండు నగరాల్లో పోలీసు పోస్టులపై సాయుధులు కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు. ముస్లింలు అధికంగా వుండే ప్రాంతంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. సోమవారం నుండి మూడు రోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించారు. డెర్బెంట్ నగరంలో చర్చిపై, యూదు ప్రార్థనా మందిరంపై సాయుధుల బృందం కాల్పులు జరిపిందని డాగెస్తాన్ హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. దాడుల్లో డాగెస్తాన్ అధికారి కుమారుడి ప్రమేయం వుందనే అనుమానంతో సదరు అధికారిని అదుపులోకి తీసుకున్నట్లు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్గాలు తెలిపాయి. ఆ ప్రాంతంలో పరిస్థితి అదుపులో వుందని గవర్నర్ తెలిపారు. దర్యాప్తు జరుగుతోందని, బాధ్యులైన వారిని పట్టుకుని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడులకు విదేశాల నుండి కుట్ర పన్నారని ఆయన చెప్పారు.

గాజాలో దాడులకు నిరసనగా మరో ముగ్గురు అమెరికన్ అధికారుల రాజీనామా

వాషింగ్టన్ : గాజాలో ఇజ్రాయిల్ మిలిటరీ దాష్టీకాలకు అమెరికా మద్దతిస్తున్నందుకు నిరసనగా బైడెన్ ప్రభుత్వంలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఈ వారంలో మరో ముగ్గురు అమెరికన్ అధికారులు రాజీనామా చేశారు. వీరిలో ఇద్దరు మిలటరీకి చెందినవారని అమెరికా మీడియా ఆదివారం వెల్లడించింది. ఈ దాడుల్లో అమెరికా మిలటరీ పాత్ర కొనసాగుతున్నందున ఇక తాము సైన్యంలో కొనసాగలేమంటూ లారీ హెబర్ట్, జువాన్ బెట్టన్‌కోర్ట్ ప్రకటించారు. ఇజ్రాయిల్-పాలస్తీనా వ్యవహారాల నిపుణులు, అమెరికా విదేశాంగ శాఖలో సీనియర్ అధికారి ఆండ్రూ మిల్లర్ రాజీనామా చేసిన వెనువెంటనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గాజాలో 8మాసాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతకు అతి పెద్ద మద్దతుదారుగా అమెరికా నిలవడం పట్ల మిల్లర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

బర్డ్ ఫ్లూ నివారణకు శ్రీలంక చర్యలు

కొలంబో: బర్డ్ ఫ్లూ కేసులు నమోదైన దేశాల నుండి జంతువులు, జంతు ఉత్పత్తుల దిగమతులను నిరోధించేందుకు శ్రీలంక చర్యలు చేపట్టిందని ఆ దేశ జంతు ఉత్పత్తుల, ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం తెలిపారు. అమెరికాకు చెందిన పశువులు తొలిసారిగా ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ బారిన పడ్డాయని ఆరోగ్యశాఖ డైరక్టర్ జనరల్ హెమాలి కొతాలావాలా విలేకరులతో అన్నారు. విదేశాల్లో జరుగుతున్న పరిణామాలను తెలుసుకుని దేశంలోని వ్యవసాయ పరిశ్రమ, వినియోగదారుల ఆరోగ్యాన్ని పరి రక్షించేందుకు చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. దేశంలో ఏదైనా కేసు బయటపడితే వ్యాధి నియంత్రణ చర్యలు వెంటనే చేపట్టేందుకు అవసరమైన సన్నద్ధతను కలిగి ఉండాలని కింది స్థాయి సిబ్బందిని కోరారు. గత సంవత్సరం హెచ్5, హెచ్7, హెచ్9 బర్డ్ ఫ్లూ కేసులను గుర్తించే సామర్థ్యాన్ని శ్రీలంక అభివృద్ధి చేసిందని అన్నారు.

క్రిమియాపై దాడి వెనక అమెరికా హస్తం

- రష్యా ఆరోపణ

మాస్కో: క్రిమియాపై ఉక్రెయిన్ క్షిపణులతో దాడి వెనక అమెరికా హస్తం ఉందని రష్యా ఆరోపించింది. రష్యన్ అధ్యక్ష భవనం ప్రతినిధి డిమిట్రో పెస్కోవ్ సోమవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ క్రిమియాపై దాడిని అనాగరిక చర్యగా పేర్కొన్నారు. ఈ దాడిలో అమెరికా ప్రమేయముందని ఆయన ఆరోపించారు.పిల్లలను చంపడం మరీ దారుణమని ఆయన అన్నారు. క్రిమియాపై ఆదివారం జరిగిన దాడిలో ఇద్దరు పిల్లలతో సహా నలుగురు చనిపోయారు. మరో 151 మంది గాయపడ్డారు.

అమెరికా సైన్యానికి ఇక్కడేం పని? వెనక్కి వెళ్లిపోమనండి

- జాంబియాలో ఊపందుకుంటున్న ఉద్యమం

లుసాకా: జాంబియాలో తిష్టవేసుక్కూర్చొన్న అమెరికా సైనిక దళాలకు ఇక్కడేం పని అని, వెంటనే ఆ దళాలుల ఇక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోవాలని జాంబియా ప్రజలు నినదిస్తున్నారు. గత కొంతకాలంగా ఊపందుకుంటున్న ఈ డిమాండ్ ఇప్పుడు పార్లమెంటులోను ప్రతిధ్వనిస్తోంది. అమెరికాతో జాంబియా ప్రభుత్వం భద్రతా సహకార ఒప్పందం కుదుర్చుకోవడాన్ని పతిపక్షాలు నిరసించాయి. ప్రతిపక్ష సభ్యుడు స్టీఫెన్ కాంపియాంగో మాట్లాడుతూ అమెరికా-ఆఫ్రికా కమాండ్ (ఆఫ్రికామ్ దళాలు) ఈ గడ్డపై ఉండాల్సిన అవసరం లేదని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా బడ్జెట్‌ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిమానాల రేట్లను గణనీయంగా తగ్గించారు. ఇది కూడా ఇపిఎఫ్ఓ సెంట్రల్ ట్రస్టీల బోర్డుకు తెలియకుండా జరిగింది. యూనియన్లతో కూడా దీనిపై చర్చలు జరపలేదు. ఇటువంటి విధానాల వల్ల కేవలం కొన్ని కార్పొరేట్ సంస్థలకు మాత్రమే లబ్ది చేకూరుతుందనే విషయాన్ని కొత్త ఎన్‌డిఎ ప్రభుత్వం గుర్తించాలని ఆ సంఘాలు ఆ లేఖలో కోరాయి.

ప్రజల విస్తృత ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న దయనీయ పరిస్థితులను గమనంలోకి తీసుకుని ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు లేఖ పేర్కొంది. స్వామినాథన్ సిఫార్సుల మేరకు అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ఇవ్వాలని సూచింది. కార్మికులందరికీ ఇపిఎఫ్, ఇఎస్‌ఐ సేవలు అందేలా చూడాలని కోరింది.

వేతన జీవుల వేతనాలు, గ్రాట్యుటీలపై ఆదాయపన్ను రాయితీ సీలింగ్ పరిమితిని గణనీయంగా పెంచాలని సూచించింది. అలాగే నెలకు రూ.9వేల కనీస పెన్షన్, ఇతర వైద్య, విద్యా ప్రయోజనాలు కల్పించడంతో సహా సార్వజనీన సామాజిక భద్రతా పథకాలను అందచేసేందుకు అసంఘటిత రంగాల కార్మికులు, వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయాలని సూచించింది. అసంఘటిత రంగాల కార్మికులందరినీ ఇ శ్రమ పోర్టల్‌లో చేర్చాలని, వారికి కూడా ఈ పథకాలను వర్తింపచేయాలని సూచించింది.

కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, పిఎస్‌యుల్లో ప్రస్తుతమున్న ఖాళీలన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలని సూచించింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లను తక్షణమే ఆపివేయాలని, దానికి బదులుగా రెగ్యులర్ ఉపాధికి హామీ కల్పించాలని కోరింది. సమాన పనికి సమాన వేతనం వుండాలని సూచించింది.అగ్నివీర్, ఆయుధ్‌వీర్, కొయలావీర్ వంటి నిర్దిష్ట కాలపరిమితి ఉపాధులను తక్షణమే ఆపివేయాలని కోరింది. ఆయా రంగాల్లో రెగ్యులర్ ఉపాధి కల్పించాలని కోరింది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచుతూ కనీసం 200 రోజుల పనిదినాలు వుండేలా, చట్టబద్ధమైన కీన వేతనాలు నిర్ణయించేలా చూడాలని సూచించింది. కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసిన, ఆ స్థానంలో పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని సూచించింది. తక్షణమే 8వ వేతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరింది. 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కార్మిక సంఘాలు సూచించాయి. పిఎస్‌యుల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని కోరింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ ఖజానా దోపిడీ, దుర్వినియోగాలను ఆపాలని కోరింది. ఎల్‌ఐసి, జిఐసిలను ప్రైవేటీకరించే చర్యలను నిలుపుచేయాలని సూచించింది.

పోషకాహారం, ఆరోగ్యం, విద్య వంటి సామాజిక సేవా రంగాల ప్రైవేటీకరణను ఆపాలని కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు సూచించాయి. ఆరోగ్య, విద్య రంగాల్లో మౌలిక సేవలకు కేటాయింపులు పెంచాలని కోరాయి. తాగునీరు, పారిశుధ్యం, గృహ నిర్మాణాలకు తగిన కేటాయింపులు జరపాలని కోరింది. ఎస్‌సి, ఎస్‌టి, ఉప ప్రణాళికకు, మహిళలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సూచించింది.

పెట్రోలియం ధరలను పెంచడం వల్ల నిత్యావసరాలు, ఇతర సేవల ధరలు పెరుగుతాయని అందువల్ల పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచరాదని సూచించింది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా వర్కర్లతో సహా స్కీమ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, వారికి ఐఎస్‌సి సిఫార్సులకు అనుగుణంగా వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందించాలని సూచించింది.

రాజ్యాంగంపై మోడీ దాడి

(మొదటి పేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణ స్వీకారాన్ని పూర్తి చేశారు.

రాజ్య సభాపక్ష నేతగా నడ్డా

రాజ్యసభలో సభాపక్ష నేతగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాను ఆ పార్టీ నియమించింది. లోక్‌సభ ఎన్నికల్లో ముంబయి నార్త్ నియోజకవర్గం నుంచి ఎంపిగా గెలిచిన పియూష్ గోయల్ స్థానంలో ఆయనను నియమించింది. గోయల్ 2010 జులై 5న రాజ్యసభ ఎంపిగా ఎన్నికయ్యారు. 2021 జులై 14న ఆయనను రాజ్యసభ సభా నాయకుడిగా ప్రకటించారు. జూన్ 4న లోక్‌సభ ఎంపిగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన స్థానంలో జెపి నడ్డాను నియమించారు. జెపి నడ్డా తొలిసారిగా 2012 ఏప్రిల్ 3న రాజ్యసభకు ఎన్నికయ్యారు. సోమవారం ఆయనను సభాపక్ష నేతగా నియమిస్తూ పార్టీ నిర్ణయించింది.

ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యంపై మచ్చ : మోడీ

పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడుతూ.. దేశానికి మూడోసారి సేవ చేసే భాగ్యాన్ని కల్పించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనంలో 18వ లోక్‌సభ సమావేశమవుతుందని చెప్పారు. 'ప్రపంచంలో అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ నిర్వహించాం. 65 కోట్ల మంది ఓటర్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. మా విధానాలకు, అంకితభావానికి జనామోదం లభించింది. ప్రజలు మాకు వరుసగా మూడోసారి సేవచేసే అవకాశం కల్పించారు. ఇది చాలా పవిత్రమైన రోజు. కొత్త సభ్యులకు స్వాగతం. కొత్త ఆశలు, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలి. అందరి సహకారంతో భరతమాత సేవలో పాల్గొంటాం. కొత్త లక్ష్యాలను చేరుకోవడానికి మనమంతా కృషి చేయాలి. 2047 వికసిత్ భారత్ సంకల్పం, లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సాగుతాం. రాజ్యాంగానికి గౌరవం ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాం. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతాం. భారత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కృషి చేస్తాం' అని మోడీ అన్నారు. ఎమర్జెన్సీ ద్వారా ప్రజాస్వామ్యంపై పడిన మచ్చకు 50 ఏళ్లు అవుతుందని ప్రధాని మోడీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 50 ఏళ్ల కిందట జరిగిన తప్పు మరెవరూ చేయకూడదన్నారు. జనహితం కోసం సభ్యులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. 18వ లోక్‌సభలో ప్రతిపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.




మీకోసం

చెప్పులు, బూట్లు కరుస్తుంటే ఆ భాగానికి పెరుగు రాసి రాత్రంతా ఉంచి తెల్లారి ఎండిన పెరుగును దులిపి పాద రక్షలు ధరించాలి.

జీవన సౌరభం

పనిచేసిన ప్రతిసారీ సత్ఫలితాలు రాకపోవచ్చు గాని, అసలు ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

అన్నీ పనికొచ్చేవే..!



రోజూ హుషారుగా ఉండే రాజు ఆ రోజు ఎందుకో దిగాలుగా కనిపించాడు. 'రాజూ! ఏంటి దిగులుగా ఉన్నావు. రోజూ హుషారుగా ఉండేవాడివి. ఏమైంది?' అని క్లాస్ టీచర్ సుమ రాజుని అడిగారు. 'ఏమీ లేదు టీచర్' అని సమాధానమిచ్చాడు రాజు. 'పర్వాలేదు చెప్పు. నిన్ను ఎవరైనా అరిచారా' అని ఈసారి కాస్త గట్టిగా అడిగారు టీచర్. 'అవును టీచర్. స్కూల్లో నన్ను కొంతమంది నల్లోడు అని, పనికిమాలిన గాడిద అని తిడుతున్నారు. ఆట పట్టిస్తున్నారు' అని అసలు విషయం చెప్పాడు రాజు.

'నేను వాళ్లతో మాట్లాడుతాను. నువ్వు ధైర్యంగా వుండు' అంటూ తరగతి గదిలోని ఇతర పిల్లలను పిలిచారు టీచర్. 'చూడండి పిల్లలూ! మీలో కొంతమంది రాజును తిడుతున్నారని తెలిసింది. ఎవరినీ కూడా మనం వారి రంగు, ఆకారం చూసి తిట్టకూడదు. దీన్ని బాడీ షేమింగ్ అంటారు. అదే విధంగా ఈ ప్రపంచంలో పనికి రాని వస్తువు అంటూ ఏదీ ఉండదు. గాడిద పాలు కూడా ఆరోగ్యానికి ఎంతో మంచివి. వీటిని చాలా దేశాలలో ఉపయోగిస్తున్నారు. దేనినీ మనం తక్కువ అంచనా వేయకూడదు. కాబట్టి ఎవరినీ తక్కువ చేసి మాట్లాడవద్దని సూచించారు సుమ టీచర్. సుమ ఇచ్చిన ధైర్యంతో రాజులో ఉన్న నిరుత్సాహం మాయమైంది. 'థాంక్ యూ టీచర్' అంటూ హుషారుగా తరగతి గదికి వెళ్ళాడు.


- యం. రాం ప్రదీప్,
జనవిజ్ఞాన వేదిక,
94927 12836.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఆంగ్ల అక్షరాలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



బి. జయాదిత్య గౌడ్,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాంపూర్, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉన్నతంగా జీవించాలని..

రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, గుడి, బడి ప్రతి చోటా యాచకులు కనిపిస్తారు. రూపాయి, రెండు రూపాయిల కోసం చేయి చాచి దీనంగా అర్థిస్తారు. మనసున్న మారాజెవరైనా సాయం చేయకపోతాడా అని ఆశగా ఎదురుచూస్తారు. వారి ఆశంతా డబ్బులు, తిండి కోసమే. అంతకుమించి ఆలోచించే జ్ఞానం వారికి లేదు. అయితే వారి బతుకుల్లో మార్పు తేవాలంటే డబ్బులు, తిండి ఇవ్వడం కాదు, విద్యాదానం చేయాలని సంకల్పించాడు కార్తీక్ నాత్జోగి. మహారాష్ట్ర కరువుపీడిత ప్రాంతం విదర్భ భండార ప్రాంతానికి చెందిన కార్తీక్ సంకల్పం గురించి తెలుసుకుందాం.

నాత్జోగి అంటే యాచక కమ్యూనిటీకి చెందిన తెగ అని అర్థం. అలాంటి యాచక కుటుంబంలో పుట్టిన కార్తీక్‌కి, తన చుట్టూ ఉన్న వారంతా యాచన చేయడం నచ్చలేదు. అక్కడే ఉంటే తను కూడా, తనవారిలాగా బస్టాండుకో, రైల్వే స్టేషనుకో పరిమితం కావాలని భయపడ్డాడు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే బాగా చదువుకుని బతుకు బాగు చేసుకోవాలనుకున్నాడు. మరాఠీ భాషలో లిటరేచర్ చేసి, పొలిటికల్ సైన్స్ అభ్యసించి ఉన్నత విద్యావంతుడిగా తిరిగివచ్చాడు. అయినా ఫలితం శూన్యం. తన కమ్యూనిటీకి చదువు విలువ తెలీదు. దీంతో కాలనీ పిల్లలంతా తల్లిదండ్రులతో భిక్షాటనకి వెళుతున్నారు.



రమాబాయి కార్తీక్ కమ్యూనిటీకి చెందిన బాలిక. తనకి చదువంటే ఇష్టం. తన ఆసక్తిని తెలుసుకున్న కార్తీక్ ఆ పిల్లను బడిలో చేర్పించాడు. దగ్గరుండి చదువు చెప్పించాడు. ఇప్పుడు ఆ కమ్యూనిటీలో 10వ తరగతి పాసైన ఏకైక బాలిక రమాబాయి. ఆ కమ్యూనిటీ ప్రజలంతా ఇప్పటికీ యాచక వృత్తిలోనే జీవిస్తున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాలకు వలసపోయి గుడారాల్లో నివసిస్తూ వృత్తి కొనసాగిస్తారు. వ్యవసాయ భూమి ఉండదు. స్థిర నివాసమూ లేక, సంచారజీవితం గడుపుతారు. 'మా కమ్యూనిటీ ప్రజలకు పిల్లల ఆలనాపాలనా, చదువు, సంధ్యా ఒక పట్టాన అర్థం కాదు. వ్యవసాయ భూములు లేకపోవడం వల్ల ఏ పనీ చేతకాదు. యాచకం ఒక్కటే బతుకుదెరువుగా ఉంటారు. ఆ పని మాన్పించాలనే నేను ఈ లక్ష్యం పెట్టుకున్నాను' అని కార్తీక్ చెబుతున్నాడు.

'నేను స్కూలుకు వెళ్లాలంటే బాగా భయపడ్డాను. కార్తీక్ టీచర్ మాత్రం నన్ను చాలా ప్రోత్సహించారు. మా కమ్యూనిటీ కోసం నేను ఏదైనా చేయాలంటే చదువొక్కటే మార్గమని నాకు అర్థమయ్యేలా చెప్పార'ని రమాబాయి చెబుతోంది.

కార్తీక్ లక్ష్యం ఒక్క రమాబాయితోనే పూర్తికాలేదు. తన ప్రాంతంలోనే ఒక స్కూలు ఉంటే పిల్లలంతా బయటికి వెళ్లకుండా చదువుకుంటారని భావించాడు. బడి కోసం పాలకుల దగ్గర అర్జీలు పెట్టాడు. ఫలితం లేదు. నిరాశపడకుండా తన వారి దగ్గరే రూ.10 చొప్పున వసూలు చేసి ఊరి మధ్యలో ఓ చిన్న గదిని ఏర్పాటుచేశాడు. పలక,



రమాబాయి

బలపం కొనిపెట్టాడు. పిల్లలను ఆహ్వానించాడు. ఇప్పుడా స్కూలుకు పిల్లలు వస్తున్నారు. అయితే కార్తీక్ లక్ష్యం ఇంకా పూర్తి కాలేదు. ఆ కమ్యూనిటీ వ్యక్తులు యాచకం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతే పిల్లల చదువు కుంటుపడుతుంది. అలా జరగకుండా ఉండాలంటే రెసిడెన్షియల్ స్కూలు నిర్మించాలి. అందుకోసం భారీగా ఖర్చవుతుంది. అయినా కార్తీక్ వెనుకడుగు వేయడం లేదు. ఈసారి పాలకులతో చర్చలు సఫలం అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

'మా కమ్యూనిటీ వ్యక్తులు బాగా చదువుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించాలి. మేమంతా గౌరవంగా జీవించాలనుకుంటున్నాం. ఆ లక్ష్యం చేరుకోకపోతే, స్వేచ్ఛకు అర్థమే లేదు' అంటున్న కార్తీక్ లాంటి యువకులు ఎంతోమందికి ఆదర్శం.

వర్షం వేళ ... జాగ్రత్త!

కుండపోతగా వర్షాలు పడినప్పుడు వీధులన్నీ జలమయం అవుతాయి. నాళాలు పొంగిపొర్లుతుంటాయి. ఈ సమయంలో వాహనదారులు చాలా జాగ్రత్తలు ప్రయాణించాలి. రోడ్ల మీద నీళ్లు ఎక్కువగా ఉండటం వల్ల బైక్ జారి కింద పడే అవకాశం ఉంటుంది.. అందుకే వర్షాలు రాకముందే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను తగ్గించవచ్చు.

- వర్షాకాలం రాకముందే వాహనాలను చెక్ చేయించాలి. ఏదైనా లోపాలు ఉంటే సర్వీసు చేయించాలి.
- పాత టైర్లు అరిగిపోయినట్లయితే వెంటనే మార్పించుకోవాలి. అలా చెయ్యకపోతే టైర్లకు పంక్చర్ అవుతుంది. నీళ్లల్లో వెళ్లేటప్పుడు పాత టైర్లు పట్టును కోల్పోయి స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంటుంది.
- ఇండికేటర్ పనితీరును కూడా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. ఇతరత్రా ఏదేని మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించుకోవాలి.
- వర్షం కారణంగా చీకటిగా ఉంటుంది. హెడ్ లైట్, టెయిల్ లైట్లు పనిచేయకపోతే ఇలాంటి సమయంలో ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. కాబట్టి లైట్ల పనితీరును పరిశీలించుకుని కొత్తవి అమర్చుకోవాలి.
- అలాగే బ్రేక్లను చెక్ చేయించుకోవాలి. ఒక్కొక్కసారి బ్రేక్‌లు గట్టిగా బిగుసుకుపోయి బైక్ సమయానికి ఆగదు. దీనివల్ల కూడా బైక్ స్కిడ్ అవుతూ ఉంటుంది. కాబట్టి బైక్ సర్వీసింగ్ చేయించుకోవడం మంచిది.
- హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. రోడ్లపై నీళ్లు, తడిగా ఉండటం వల్ల బైక్ స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంటుంది కాబట్టి హెల్మెట్ ఉంటే ప్రమాదం బారిన పడకుండా ఉండొచ్చు.



ఈగల బెడద ఇలా వదిలించుకోండి..

వర్షకాలంలో ఇంట్లో ఈగల బెడద ఎక్కువగా ఉంటుంది. వంటగదిలో, బాత్‌రూమ్‌లో, ఇంటి ఆవరణలో ఎక్కడ చూసినా అవే కనిపిస్తాయి. వీటి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తుంది. వీటిని నివారించడానికి ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటిస్తే సరి.



- ఒక నిమ్మకాయ, రెండు టీస్పూన్ల ఉప్పు, ఒక గ్లాసు నీరు తీసుకోవాలి. నిమ్మకాయను కోసి గ్లాసు నీళ్లలో వేసి ఉప్పు వేయాలి. ఈ రెండింటిని బాగా కలపాలి. స్ప్రే బాటిల్‌లో ఈ ద్రావణాన్ని పోసి ఈగలు ఎక్కడ చూసినా వాటిపై పిచికారీ చేయాలి.
- ఆపిల్ సైడర్ వెనిగర్ ఇంట్లో నుండి ఈగలు రాకుండా చేయడంలో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఆపిల్ సైడర్ వెనిగర్‌లో నీటిని బాగా కలపండి. తర్వాత ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో నింపి ఇల్లంతా స్ప్రే చేయాలి. ఇలా చేస్తే ఈగలు త్వరగా వెళ్లిపోతాయి.
- కర్పూరం ద్వారా కూడా ఈగలను వదిలించుకోవచ్చు. కర్పూరం చిన్న ముక్క తీసుకోవాలి. ఒక చెంచా మీద ఉంచి, వెలిగించాలి. ఈ కర్పూరపు పొగను ఇల్లంతా వ్యాపించేలా చేయాలి. కర్పూరం పొగ ఇంట్లో ఈగలు త్వరగా పోయేలా చేస్తుంది. కర్పూరం వాసన ఉన్నంత సేపు ఒక్క ఈగ కూడా ఇంట్లోకి రాదు.
- ఇంటిని శుభ్రపరిచేటప్పుడు కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుంటే చాలా వరకు ఈగలను వదిలించుకోవచ్చు. ఇంటిని శుభ్రం చేసేటపుడు నీటిలో కొద్దిగా ఫినైల్ కలిపితే ఈగలు సులభంగా తొలగిపోతాయి.

సినీ రంగానికి ప్రాధాన్యత

నిర్మాతల బృందంతో డిప్యూటీ సిఎం పవన్



సినిమా పరిశ్రమ అభివృద్ధికి అదే విభాగం నుంచి వచ్చిన తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానని డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు. టాలీవుడ్‌కు చెందిన నిర్మాతల బృందం సోమవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకుంది. అక్కడి నుంచి విజయవాడలోని క్యాంపు ఆఫీసులో పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయ్యింది. చిత్ర పరిశ్రమకు చెందిన పెద్దలను పవన్ ఆప్యాయంగా తన ఛాంబర్‌లోకి ఆహ్వానించారు. తొలుత అందరూ పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ఎపిలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలు నిర్మాతలు సుదీర్ఘంగా చర్చించారు. దీనికి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ చిత్ర పరిశ్రమకు పూర్వవైభవం వచ్చేలా కృషిచేస్తానన్నారు. ఆంధ్రాలో కూడా చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని గుర్తుచేశారు. స్టూడియోల ఏర్పాటు, షూటింగ్ స్పాట్ల అభివృద్ధి ఇలా అనేక అంశాలపై త్వరలోనే విధానపరమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కూడా ఈ సందర్భంగా మాట్లాడారు. ఆంధ్రాలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి ఎంతో అవకాశాలున్నాయన్నారు. ప్రభుత్వపరంగా త్వరలోనే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవటం ద్వారా పరిశ్రమ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. నిర్మాతల బృందంలో అల్లు అరవింద్, సి.అశ్వనీదత్, ఎఎం రత్నం, ఎస్.రాధాకృష్ణ (చినబాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, వై.సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టిజి విశ్వప్రసాద్, యువి క్రియేషన్స్ వంశీ తదితరులు ఉన్నారు. పవన్ కళ్యాణ్‌తో సమావేశం అనంతరం అల్లు అరవింద్ మాట్లాడారు. 'ఈరోజు మా అందరికీ చాలా సంతోషకరమైన రోజు. పవన్‌కళ్యాణ్‌తో అన్ని విషయాలూ మాట్లాడాం. త్వరలో ఇండస్ట్రీ గురించి రిప్రజంటేషన్ ఇస్తాం' అని వివరించారు. నిర్మాతల మండలి చర్చల్లోప్రధానంగా టిక్కెట్ల ధరల విషయమై ప్రధానంగా చర్చ జరిగినట్లుగా సమాచారం. ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి ఎడి 2898' సినిమా ఈనెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా టిక్కెట్ల ధరల పెంపుదలతో పాటుగా రాబోయే కొత్త సినిమాలకు కొన్ని రోజులు టిక్కెట్ల ధరలు పెంచుకునే వీలు కల్పించేలా చట్టం చేయాలని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను నిర్మాతలు కోరినట్లుగా సమాచారం.

'ఎన్‌కెఆర్-21'లో వైజయంతి ఐపీఎస్



నందమూరి కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎన్‌కెఆర్-21'. యాక్షన్ జోనర్‌లో వస్తున్న ఈ సినిమాను అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి విజయశాంతి ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. సోమవారం విజయశాంతి బర్త్ డే. ఈ సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌తో పాటు స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఆమె 'వైజయంతి ఐపీఎస్' అనే పాత్రలో నటిస్తున్నారు. 34 సెకండ్ల నిడివి గల గ్లింప్స్‌లో విజయశాంతి పవర్ పెర్ఫామెన్స్ చూపించారు. ఈ గ్లింప్స్‌లో కళ్యాణ్ రామ్ కూడా కనిపించారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రంలో సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోహెల్ ఖాన్, శ్రీకాంత్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల



పాల ద్వారా చర్మ సంరక్షణ ఉత్పత్తులను తయారుచేసే న్యూడ్ తన హై గ్లేజర్ లైన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా హీరోయిన్ శ్రీలీలను నియమించుకుంది.

జులై 19న ప్రియదర్శి 'డార్లింగ్'



ప్రియదర్శి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డార్లింగ్'. కామెడీ ఎంటర్టైనర్‌గా రానున్న ఈ చిత్ర విడుదల తేదీని తాజాగా చిత్రబృందం ప్రకటించింది. జులై 19న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సినిమాను అశ్విన్ రామ్ డైరెక్ట్ చేస్తుండగా, 'హను-మాన్' చిత్ర నిర్మాత నిరంజన్ రెడ్డి ప్రొడ్యూస్ చేస్తున్నారు. నభా నటేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అనన్య నాగళ్ల, మొయిన్, శివారెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు.

శివమెత్తిన రోహిత్

- 41బంతుల్లో 92పరుగులు
- ఆస్ట్రేలియాపై 24పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం

సెయింట్ లూసియా: టి20 ప్రపంచకప్‌లో సూపర్-8లో టీమిండియా వరుసగా మూడో మ్యాచ్‌లోనూ గెలిచింది. ఆస్ట్రేలియాతో సోమవారం జరిగిన సూపర్-8 చివరి లీగ్ మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ(92; 41బంతుల్లో 7ఫోర్లు, 8సిక్సర్లు) వీర విహారం చేయడంతో తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 205పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. భారీ ఛేదనతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 7వికెట్లు నష్టపోయి 181పరుగులే చేసి ఓటమిపాలైంది. ఆస్ట్రేలియా జట్టులో ట్రివిస్ హెడ్(76), మార్ష్(37), మ్యాక్స్‌వెల్(20) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్‌కు మూడు, కుల్దీప్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రోహిత్ శర్మకు దక్కింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ శివాలెత్తే బ్యాటింగ్‌తో అలరించాడు. వరుస ఫోర్లు, సిక్సర్లతో ఆస్ట్రేలియా బౌలర్లకు చుక్కలు చూపించాడు. బంతిపడితే చాలు బౌండరీ అవతలికే అన్నట్లుగా ఆడాడు. కేవలం 19బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న రోహిత్ శతకం చేసేలా కనిపించాడు. కానీ, 92 పరుగుల వద్ద మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో బౌల్డ్ అయి పెవిలియన్‌కు చేరాడు. ఇక అంతర్జాతీయ టి20ల్లో 200సిక్సర్లు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. మరో ఓపెనర్ విరాట్ కోహ్లీ(0) పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్నాడు. రెండో ఓవర్లోనే హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో షాట్‌కు ప్రయత్నించి టిమ్ డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరాడు. తొలి డౌన్‌లో వచ్చిన రిషభ్‌పంత్ (15)కూడా తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. అయితే సూర్యకుమార్ యాదవ్ (31; 16బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు. దూకుడుగా ఆడుతున్న సూర్యకుమార్ జట్టు స్కోరు 159 పరుగుల వద్ద వేడ్‌కు



రోహిత్ శర్మ (92; 41బంతుల్లో 7ఫోర్లు, 8సిక్సర్లు)

క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శివం దుబే (28; 22బంతుల్లో 2ఫోర్లు, సిక్సర్), హార్దిక్ పాండ్య (27నాటౌట్; 17బంతుల్లో ఫోర్, 2సిక్సర్లు), జడేజా (9నాటౌట్; 5బంతుల్లో ఓ సిక్సర్) జోరుగా పరుగులు రాబట్టడంతో భారత్ భారీ స్కోరే చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో హేజిల్‌వుడ్(1/14) పొదుపుగా బౌలింగ్ చేయగా.. మిచెల్ స్టార్క్, స్టొయినిస్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

భారీ ఛేదనలో ఆసీస్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ వార్నర్(6) త్వరగా పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత హెడ్ అర్ధసెంచరీతో మెరవగా.. కెప్టెన్ మార్ష్(37) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ 2వ వికెట్‌కు 81పరుగులు జతచేశారు. మూడో వికెట్‌కు మ్యాక్స్‌వెల్(20) కూడా రాణించడంలో ఆసీస్ జట్టు 13 ఓవర్లకే 128పరుగులు చేసి గెలుపు దిశగా పయనించింది. ఆ దశలో టీమిండియా బౌలర్లు ఆర్ష్‌దీప్, బుమ్రా వరుసగా వికెట్లను కూల్చి విజయాన్ని చేకూర్చారు. దీంతో నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 181పరుగులే చేసి 24పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

ఆఫ్ఘన్‌కు అవకాశం..

నేడు జరిగే ఆఖరి సూపర్-8 మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు బంగ్లాదేశ్‌ను ఓడిస్తే నేరుగా సెమీస్‌కు చేరనుంది. ఒకవేళ ఆఫ్ఘన్ జట్టు బంగ్లా చేతిలో ఓడితే రన్‌రేట్ ప్రాతిపదికపై ఏ జట్టు సెమీస్‌కు చేరేది తేలిపోనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి)స్టార్క్ 92, కోహ్లి (సి)టిమ్ డేవిడ్ (బి)హేజిల్‌వుడ్ 0, పంత్ (సి)హేజిల్‌వుడ్ (బి)స్టొయినీస్ 15, సూర్యకుమార్ యాదవ్ (సి)వేడ్ (బి)స్టార్క్ 31, దూబే (సి)వార్నర్ (బి)స్టొయినీస్ 28, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 27, జడేజా (నాటౌట్) 9, అదనం 3. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 205పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/93, 3/127, 4/194 **బౌలింగ్:** స్టార్క్ 4-0-45-2, హేజిల్‌వుడ్ 4-0-14-1, కమిన్స్ 4-0-48-0, జంపా 4-0-41-0, స్టొయినీస్ 4-0-56-2.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: డేవిడ్ వార్నర్ (సి)సూర్యకుమార్ (బి)ఆర్ష్‌దీప్ 6, హెడ్ (సి)రోహిత్ (బి)బుమ్రా 76, మార్ష్ (సి)అక్షర్ (బి)కుల్దీప్ 37, మ్యాక్స్‌వెల్ (బి)కుల్దీప్ 20, స్టొయినీస్ (సి)హార్దిక్ (బి)అక్షర్ 2, టిమ్ డేవిడ్ (సి)బుమ్రా (బి)ఆర్ష్‌దీప్ 15, వేడ్ (సి)కుల్దీప్ (బి)ఆర్ష్‌దీప్ 1, కమిన్స్ (నాటౌట్) 11, స్టార్క్ (నాటౌట్) 4, (అదనం 9. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 181పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/87, 3/128, 4/135, 5/150, 6/153, 7/165 **బౌలింగ్:** ఆర్ష్‌దీప్ 4-0-37-3, బుమ్రా 4-0-29-1, అక్షర్ పటేల్ 3-0-21-1, హార్దిక్ పాండ్యా 4-0-47-0, కుల్దీప్ 4-0-24-2, జడేజా 1-0-17-0

సెమీస్‌కు దక్షిణాఫ్రికా

వెస్టిండీస్‌పై మూడు వికెట్ల తేడాతో గెలుపు

ఆంటిగ్వా: ఐసిసి టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లోకి దక్షిణాఫ్రికా ప్రవేశించింది. వెస్టిండీస్‌తో సోమవారం జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీస్ బెర్త్ సాధించింది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా గ్రూప్-2లో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. వర్షం వల్ల కుదించిన మ్యాచ్‌లో.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఏడు వికెట్ల నష్టానికి 124పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి కేవలం 135 పరుగులు మాత్రమే చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో షాంసీకి మూడు వికెట్లు తీసుకున్నాడు. అయితే చేజింగ్ సమయంలో వర్షం రావడంతో సౌతాఫ్రికా టార్గెట్‌ను 17 ఓవర్లలో 123 రన్స్‌కు కుదించారు. ఇంకా అయిదు బంతులు మిగిలి ఉండగానే ఆ టార్గెట్‌ను దక్షిణాఫ్రికా అందుకుంది. చివరలో జేన్‌సన్ ఓ సిక్సర్, బౌండరీతో జట్టుకు విజయాన్ని అందించాడు. గ్రూప్ 2 నుంచి ఇంగ్లండ్ రెండో స్థానంలో ఉన్నది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షాంసీకి లభించింది.

స్కోర్‌బోర్డు...

వెస్టిండీస్ ఇన్నింగ్స్: మయర్స్ (సి)స్టబ్స్ (బి)షాంసీ 35, హోప్ (సి)స్టబ్స్ (బి)జాన్సన్ 0, పూరన్ (సి)జాన్సన్ (బి)మార్క్రమ్ 1, ఛేస్ (సి)రబడా (బి)షాంసీ 52, రువాన్ పావెల్ (స్టంప్)డికాక్ (బి)మహరాజ్ 1, రూథర్‌ఫర్డ్ (సి)మార్క్రమ్ (బి)షాంసీ 0, రస్సెల్ (రనౌట్) నోర్జే 15, అకెల్ హొసైన్ (సి అండ్ బి) రబడా 6, జోసెఫ్ (నాటౌట్) 11, మోంటీ (నాటౌట్) 4, అదనం 10. (20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 135పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/5, 3/86, 4/89, 5/94, 6/97, 7/117, 8/118 **బౌలింగ్:** జాన్సన్ 2-0-17-1, మార్క్రమ్ 4-0-28-1, మహరాజ్ 4-0-24-1, నోర్జే 4-0-26-0, షాంసీ 4-0-27-3, రబడా 2-0-11-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి)రూథర్‌ఫర్డ్ (బి)రస్సెల్ 12, హెండ్రిక్స్ (సి)పూరన్ (బి)రస్సెల్ 0, మార్క్రమ్ (సి)మయర్స్ (బి)జోసెఫ్ 18, స్టబ్స్ (సి)పూరన్ (బి)ఛేస్ 29, క్లాసెన్ (సి)పూరన్ (బి)జోసెఫ్ 22, డేవిడ్ మిల్లర్ (బి)ఛేస్ 4, జాన్సన్ (నాటౌట్) 21, మహరాజ్ (సి)జోసెఫ్ (బి)ఛేస్ 2, రబడా (నాటౌట్) 5, అదనం 11. (16.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 124పరుగులు. **వికెట్ల పతనం:** 1/12, 2/15, 3/42, 4/77, 5/93, 6/100, 7/110

బౌలింగ్: హొసైన్ 3-0-31-0, రస్సెల్ 4-0-19-2, జోసెఫ్ 4-0-25-2, మోంటీ 1-0-20-0, మెక్ కొయ్ 1.1-0-15-0, ఛేస్ 3-0-12-3.

టి20 ప్రపంచకప్ సూపర్-8లో నేడు..
ఆఫ్ఘనిస్తాన్ × బంగ్లాదేశ్
వేదిక: సెయింట్‌లూసియా; ఉ.6.00గం॥లకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68